పోతోంది విల్‌ఫర్ట్ కూడా రోజూ వచ్చి ఆమెవద్ద అరగంట కూర్చొని వెడుతున్నాడు చీకటిపడేవేళకి వృద్ధుని పరిచారకుడు తీసుకుపోతాడు రాత్రి ఎనిమిది గంటలకు డాక్టరు వచ్చి రోగిని పరీక్షచేసి మందు ఇచ్చి వెడతాడు తరవాత దాది వచ్చి పది గంటలవరకూ రోగివద్ద ఉండి, రోగి నిద్రపోగానే వెళ్లిపోతుంది ప్రతి ఉదయం మారెల్ వృద్ధుని కలుసుకుని వాలంటిన్ గురించిన సమాచారం తెలుసుకుంటున్నాడు

రాత్రివేళమాత్రం వాలంటిన్‌కి నిద్ర సరిగ్గా ఉండదు చీకటిలో ఎవరెవరో ఆమెకు కనపడుచున్నారు ఒక్కొక్కసారి సవతితల్లి వచ్చి తనను బెదిరిస్తున్నట్లు ఆమె దృష్టికి పొడగట్టేది మరొకసారి మారెల్ తనవంక చేతులు చాచి వస్తున్నట్లుండేది ఒక్కొక్కప్పుడు మాంట్ క్రిస్టోవంటి అపరిచితులు కనపడుతున్నట్లుండేది

యూజినీ పారిపోయిందనీ, బెనెడెట్టో అరెస్టయినాడనీ తెలిసిన రోజు రాత్రి వాలంటిన్ ఊహాలు పరిపరి విధాల పోయినాయి తన పరిస్థితి తలపుకు వచ్చి యోచించ నారంభించింది

రాత్రి పదకొండు గంటలయింది దాది వెళ్లిపోయి పది నిమిషాలౌతోంది అకస్మాత్తుగా కుడిచేతివైపు గదితలుపు తెరుచుకున్నట్లు వాలంటిన్‌కి తోచింది చీకటలో కన్నులు పొడుచుకుని ఆ వంకకు చూసింది కాని ఎవ్వరూ కనపడలేదు తరవాత అదంతా కేవలం తన భ్రమనుకుంది కాని క్రమంగా ఒక ఆకారం తన పడక సమీపించడం చూసింది ఇదీ భ్రమే ననుకుంటూ అలాగే ఆ ఆకారం అంతర్ధానమౌతుందని నిరీక్షించింది కాని అది అంతర్ధానం కాలేదు పడక సమీపించింది సమీపంలోనే మేజాపైన డాక్టర్ ఉంచినమందు తీసుకుంటే కంటికి కనపడుతున్న ఛాయలు పటాపంచలైపోతాయనుకుంది మేజాపైకి చెయ్యి చాచింది వెంటనే నిలబడిన వ్యక్తి దగ్గరికి వచ్చి చెయ్యి అడ్డు పెట్టాడు వాలంటిన్ తన చేతిని చటుక్కున లాక్కుంది వచ్చిన వ్యక్తి మేజాపై గ్లాసు నెత్తి చూశాడు ఒక చెంచాలో ఔషధం తీసుకుని రుచిచూశాడు వాలంటిన్ ఇది చూసింది ఇంక ఇది తన భ్రమకాదనీ తెలుసుకుంది నిజంగానే ఎవరో తన గది ప్రవేశించారు "ఇంక తాగవచ్చు" అన్నాడు ఆ వ్యక్తి

వాలంటిన్ గజగజ వొణికిపోయింది రాత్రివేళ కనపడుతున్న ఆకారాలు మాట్లాడ్డం ఇదే మొదటిసారి ఆమె కేక పెట్టబోయింది వచ్చిన వ్యక్తి పెదవులపై వేలుంచి నిశ్శబ్దంగా ఉండమన్నట్లు సంజ్ఞచేశాడు "మాంట్ క్రిస్టో" అని గొణిగింది వాలంటిన్

"కేకవెయ్యకు భయపడకు" అన్నాడు మాంట్ క్రిస్టో రహస్యంగా ఆమె ముఖంమీదికి వొంగి ఇలా అన్నాడు నన్ను గురించి భయపడకు వాలంటిన్ మనస్సులో అనుమానం పెటుకోకు నేను నీకు పితృసమానుణ్ణి నాకంటె మించిన మిత్రుడు నీకిప్పుడు లేడుసుమా!"

వాలంటిన్‌కి నోటివెంట మాట రాలేదు

"నామాట విను" అన్నాడు మాంట్ క్రిస్టో "నావంక చూడు నాలుగురోజులుగా రాత్రీ పగలు మేలుకుని నిన్ను కనిపెట్టి కాపాడుతున్నాను నిన్ను మారెల్ కోసం రక్షించడానికి నిద్ర మానుకున్నాను నాకళ్ళ వంక చూడు నీకే తెలుస్తుంది"

మారెల్ పేరు వినగానే వాలంటిన్ భయం పటాపంచలయింది "మారెల్" అని గొణిగింది "మారెల్ మీకు మా రహస్యం చెప్పాడా?"

"అన్నీ చెప్పాడు నువ్వు అతనికి ప్రాణంతో సమానమన్నాడు నిన్ను కాపాడతానని అతనికి మాట ఇచ్చాను"

"కాని నన్ను కాపాడ్డ మేమిటి? నన్నెక్కడనించి కనిపెట్టి చూస్తున్నారు?"

"అదుగో ఆవంక చూడు కుడివైపు నున్న ఆ యిల్లు నే నద్దెకు తీసుకున్నాను— ఆ కిటికీగుండా చూస్తే నీ గదిలో ఏం జరుగుతోందో, ఎవరెవ రొస్తున్నారో సర్వం కనపడుతుంది"

"ఇలా చూడ్డం మీకు న్యాయమేనా?"

"వాలంటిన్! నీకెవరెవ రే ఔషధా లిస్తున్నారో, నీదగ్గిర కెవరెవ రొస్తున్నారో చూస్తున్నాను ప్రతిరాత్రీ నీ కోసం ఇక్కడ పెడుతున్న విషాన్ని పారబోసి, నిన్ను సేదదేర్చే ఔషధం ఇక్కడ పెడుతున్నాను ఇప్పుడూ అదే పని చేశాను చూడు ఈ ఔషధం తీసుకో," ఇది తప్ప ఇంక ఈ రాత్రి కేమీ పుచ్చుకోవద్దు"

వాలంటిన్ చెయ్యి చాపింది కాని వెంటనే భయంతో చెయ్యి లాక్కుంది మాంట్‌క్రిస్టో గ్లాసులోని ఔషధం నాలుగో వంతు తను తాగి చూపించాడు వాలంటిన్ చిరునవ్వుతో గ్లాసు అందుకుని తాగేసింది "అవును ప్రతిరాత్రీ ఇదే తాగుతున్నాను" అంది

"అవును నాలుగు రాత్రులుగా నువ్విలాగే చావు తప్పించుకుంటూ వచ్చావు వాలంటిన్ కాని ఈ నాలుగు రాత్రులూ నేను పడిన బాధ ఇంతా అంతా కాదు నేను వచ్చి తీసి పారపోసే లోగా ఆ విషం నువ్వెప్పుడు పుచ్చుకుంటావో ననే భీతితో గడిపాను"

"విషమా? ఎవ రిస్తున్నారు నాకు? మీరు చూశారా?"

"చూశాను"

"నమ్మడానికి వీలులేకుండా ఉంది నా తండ్రి ఇంట్లో నన్నే చంపడానికి ప్రయత్నమా? అసంభవం"

"విషప్రయోగం నీకొక్కదానికే జరిగిందా వాలంటిన్? మూడేళ్లుగా జాగ్రత్త పడకపోతే మీ తాత గారి పనేమయ్యేదో నీకు తెలియదా?"

"ఆ! అందుకే నా తాతగారు తన మందులన్నీ నాకూ ఇస్తున్నది?"

"అవును ఈ యింటిలో విష ప్రయోగం చేసేవారున్నారని ఆయనకు తెలుసును ఎవరో కూడా ఆయన అనుమానించే ఉంటారు. కాని ఆయన జాగ్రత్త పడినదంతా ఈ నాలుగు రోజుల నించీ ఇస్తున్న విషం ముందు వృధా కావలసిందే"

"ఈ హంతకు డెవరు?"

"నీ ప్రాణాలు తియ్యడాని కెవరు ప్రయత్నిస్తున్నారో నీకు తెలియనే తెలియదా?"

"తెలియదు నన్ను చంపడం ఎవరి కవసరం?"

"అది ఇప్పుడే తెలుస్తుంది చూడు" అంటూ మాంట్‌క్రిస్టో పక్కకు తిరిగి జాగ్రత్తగా ఆలకించాడు దూరాన పన్నెండు గంటలు కొట్టిన ధ్వని వినవచ్చింది

"వాలంటిన్! నువ్విప్పుడు జాగ్రత్తగా ఉండాలి భయపడకుసుమా గుండె దిటవు తెచ్చుకో కదలవద్దు నిద్రపోతున్నట్లు నటించు జాగ్రత్త"

"ఏదో చప్పుడు వినబడుతోంది" అంది వాలంటిన్

"జాగ్రత్తసుమా! లేకపోతే నేను వచ్చేలోగానే నువ్వు దక్కవు" అంటూ మాంట్‌క్రిస్టో కుడివైపు ద్వారం తెరుచుకుని మాయమైనాడు

వాలంటిన్ ఇప్పుడు ఒంటరిగా ఉంది తనను చంపడాని కెవరో ప్రయత్నిస్తున్నారని తెలుసుకున్నాక ఆమె ఆరాటం అధికమయింది ఆ వ్యక్తి విషంవల్ల ప్రయోజనం లేదని తెలుసుకుని కత్తితో పొడిస్తే సమయానికి మాంట్‌క్రిస్టో రాలేకపోతే తనకింక అవసానం ఆసన్నమయిందేమోనని ఆందోళనపడసాగింది. ఇంక మారెల్‌ని చూడ్డానికి వీలుండదు

అరగంట గడిచింది ఎడమవైపు తలుపు తెరవబడిన చప్పుడు సన్నగా వినపడింది వాలంటిన్ ఊపిరి బిగబట్టి పడుకుంది ఓర కన్నులతో పరికించ నారంభించింది తలుపు తెరుచుకుంది ఒక వ్యక్తి పడక సమీపించడం గమనించింది తరవాత గ్లాసులో ఏదో ద్రవ్యం పోసిన శబ్దం వినవచ్చింది వాలంటిన్ వ్యక్తిని జాగ్రత్తగా పరిశీలించింది వచ్చిన వ్యక్తి స్త్రీ గమనించగానే వాలంటిన్ కొద్దిగా కదిలినట్లుంది స్త్రీ ఉలిక్కిపడి మేజాకింద నీడలో కూర్చుంది తరవాత కొంతసేపటికి మెల్లిగా లేచి ఆమె వాలంటిన్ ముఖంలోకి చూసింది

హీలాయిస్ విల్‌ఫర్ట్‌ని వాలంటిన్ గుర్తించింది వాలంటిన్ నిద్రపోతున్న దనుకుంది హీలాయిస్ విల్‌ఫర్ట్ గ్లాసు పూర్తిగా నింపి ఒడీచప్పుడూ కాకుండా వెళ్లిపోయింది వాలంటిన్ కన్నులు తెరిచింది ఎంత అణుచుకున్నా వొణుకు ఆగడంలేదు మెల్లిగా కుడివైపు ద్వారం తెరుచుకుంది మాంట్‌క్రిస్టో వచ్చాడు. "చూశావా" అన్నాడు

"చూశాను" అంది "కాని నమ్మలేకుండా ఉన్నాను"

"అయితే మారెల్‌ని విడిచిపెట్టి నిష్కారణంగా చనిపోతావా?"

"కాని తాతగారిచ్చిన ఔషధం నన్ను కాపాడదా?"

"బలమైన విషానికి అవి ఆగలేవు ఇదిగో ఇదే చూడు" అంటూ మాంట్‌క్రిస్టో గ్లాసు తీశాడు "ఇది తాగినట్లయితే నువ్వు మాకు దూరమైపోయేదానవే"

"నన్నెందుకామె చంపడానికి ప్రయత్నిస్తోంది?"

"నువ్వు భాగ్యవంతురాలవు వాలంటిన్ ఆమె ఇదంతా తన కొడుక్కు సంక్రమించాలని కాంక్షిస్తోంది"

"ఏమిటి? ఏమీ ఎరగని ఆ పసిబిడ్డ పేరుతో ఇటువంటి ఘోరాలు చేస్తోందా? నమ్మలేను పైగా ఆడది, ఆమె ఇంతపని చెయ్యగలదా?"

"వాలంటిన్! ఇటలీలో నీ సవతితల్లి ఒక అపరిచిత వ్యక్తితో విషమూలికల్ని గురించి చర్చించడం నీకు గుర్తులేదా? ఆనాటినుంచే ఆమె ఈ కుట్ర పన్నుతోంది"

వాలంటిన్‌కి కళ్ళ నీళ్లు నిండాయి "అయితే నేనింక చావడం తప్పదన్నమాట" అంది గద్గదకంఠంతో

"లేదు నే నీ కుట్ర అంతా ముందే కనిపెట్టాను నువ్వు తప్పకుండా బ్రతుకుతావు కాని నా మీద నమ్మకంతో నే చెప్పిన ప్రకారం చెయ్యాలి"

"మీ రేదిచెప్పినా సరే నేను సిద్ధమే"

"నే నిచ్చినది మారుమాట లేకుండా పుచ్చుకోవాలి ఈ రహస్యం ఎవ్వరికీ తెలియకూడదు సుమా—చివరికి నీ తండ్రికి కూడా"

"అయితే నా తండ్రి కూడా ఈ కుట్రలో చేరాడా?"

"లేదు కాని ఈ కుట్ర కనిపెట్టవలసింది నిన్ను కాపాడ్డానికి ఆయన జాగ్రత్త పడలేదు"

"ఇకనించి మీరు చెప్పినట్లు నడుచుకుంటాను ఏ చెప్పినా సరే"

"వాలంటిన్! ఏంజరిగినా సరే భయపడకు నిన్ను గోరీలో పెట్టినాసరే భయపడనని నాకు మాటియ్యి నిన్ను మారెల్

ప్రాణాలొడ్డయినాసరే కాపాడగల మిత్రుడొకడున్నాడన్న మాట ఎన్నడూ ఏ పరిస్థితిలోనూ మరిచిపోకు నువ్విదంతా భరించలేకపోతే ఇంక ఒక్కటే మార్గం ఉంది "

"ఏమిటది ?"

"నీ సవతితల్లి దురంతకృత్యాల్ని నువ్వు బయటపెట్టడం "

"దానికి బదులు నేను చనిపోవడం మేలు "

"అయితే ధైర్యంతో నేను చెప్పిన ప్రకారం చెయ్యి"

"తప్పకుండా చేస్తాను "

"ఏమి జరిగినాసరే భయపడకు అంతా నీ మేలుకేననే ఆశతో ఉండు ఎన్నడూ ఆశవిడవకు అలాగని నాకుమాటియ్యి "

"మీరు చెప్పినది శిరసావహిస్తాను మారెల్ పేరు తల్చుకుని ఆశతో ఉంటాను '

మాంట్‌క్రిస్టో జేబులోనుంచి ఒక భరిణతీశాడు మూత తెరిచి నల్లనిమాత్ర ఒకటి తీసి వాలంటిన్ నోటికందించాడు ఆమె అది మ్రింగింది "ఇంక నువ్వు నిశ్చింతగా నిద్రపో నిన్ను కాపాడగలిగినట్లే ఇంక నేను నిద్రపోతాను "

"వెళ్లండి. ఏం జరిగినాసరే ఆశ విడవను "

మాంట్‌క్రిస్టో మేజాపైనున్న గ్లాసు తీశాడు మూడువంతులు ఔషధం పారపోసి తిరిగి గ్లాసు మేజాపైన పెట్టాడు వాలంటిన్ అది తాగినట్లు హిలాయ్ విల్‌ఫర్ట్ భావించాలని అతని ఉద్దేశం తరవాత మాంట్‌క్రిస్టో వచ్చినదారినే వెళ్లిపోయాడు వాలంటిన్‌కి నిద్రపట్టడాని కాట్టేసేపు పట్టలేదు

గంటసేపటికి తిరిగి ఎడమవైపు ద్వారం తెరుచుకుంది ఈ మారు వాలంటిన్ గాఢనిద్రలో ఉంది హిలాయ్ విల్‌ఫర్ గదిలోకి అడుగుపెట్టి కొంతసేపు ఆగింది తరవాత మేజా సమీపించింది మూడువంతులు మందు ఖాళీకావడం గమనించింది తృప్తిచెందింది మిగిలిన మందు పారపోసింది తరవాత ఆమె భయపడుతూ భయపడుతూ పడకవద్ద తలవొంచి చూసింది కొంతసేపు తటపటాయించి వాలంటిన్ ముఖం పరిశీలించింది ముక్కువద్ద వేలుపెట్టింది ఊపిరాగిపోయింది మెల్లిగా దుప్పటి తొలగించి వాలంటిన్ హృదయంపైన చెయ్యిమోపి చూసింది గుండె ఆగిపోయింది ఒక చెయ్యి పడక ఈవలికి అచేతనంగా వేలాడుతోంది వాలంటిన్ చనిపోయిందని హిలాయ్ రూఢిచేసుకుంది ఇంతటితో తన ఘోరకార్యం పూర్తయిందనుకుంది గబగబ నడిచి వెళ్లిపోయింది

ఉదయమే దాది వచ్చింది పడక సమీపించగానే పైకి వేలాడుతున్న చెయ్యిచూసి కలవరపడింది చెయ్యి పట్టుకు చూసింది కెవ్వన కేక పెట్టింది "ఏమిటేమిటి?" అంటూ డాక్టరు పరుగెత్తి వచ్చాడు విల్‌ఫర్ట్ భార్యను బిగ్గరగా పిలుస్తూ వచ్చాడు పరిచారకులందరూ గుమిగూడారు

డాక్టర్ పడక సమీపించి వాలంటిన్‌ను చూశాడు ఆమెను శవనెత్తాడు "అయ్యో ! ఈమె కూడానా?" అని మూలిగాడు

"ఏమయింది డాక్టర్ ?" అంటూ విల్‌ఫర్ట్ వచ్చాడు

"వాలంటిన్ చనిపోయింది" అన్నాడు డాక్టర్.

విల్‌ఫర్ట్‌కి పైన పిడుగుపడినట్లయింది నిలవలేక పడకవద్ద కూలిపోయాడు పరిచారకులందరూ గుసగుసలాడుకుంటూ వరండాలోకి చేరారు తరవాత అందరూ ఇల్లు విడిచి వెళ్లిపోయారు

హిలాయ్ విల్‌ఫర్ట్ వచ్చింది బొల్లి బొల్లి ఏడ్పులు మొదలుపెట్టింది కాని మేజా వంక చూసేసరికి ఏడ్పు ఒక్కసారి ఆగిపోయింది రాత్రి విషం అంతా పారపొయ్యగా ఖాళీ గ్లాసు ఉంటుందని ఆమె భావించింది కాని నాలుగోవంతు ఇంకా అందులో

(45-వ పేజీ చూడండి)

కోడరికం

1

శ్రీ రావెళ్ల హనుమంతరావు

అమ్మా!—

ఊ .

మరే!— ..

ఏమిటె?

మరే! మన ఒదినెకు—పెరుగయ్యగూడ లేమిటే?

కూతురు సుశీల అమాయకంగా అడిగిన యీ ప్రశ్న తల్లి బుల్లెమ్మ హృదయంలో బాణంవలె గుచ్చుకుంది క్షణం సేపులో బుల్లెమ్మ కళ్లు చింతనిప్పలై పోయాయి. కోడలుకు మజ్జిగ పోసేందుకు తెచ్చి తన తపేళాను అక్కడనే పడేసి కూతురు రెక్క బట్టుకుని బడబడా అవతలకు లాక్కు పోయింది. మజ్జిగజేసే గ్రకు చుట్టి వున్న తాడును వూడదీసి తల్లి కూతురును దండించు తోంది

అమ్మో—చచ్చిపోతానే

చావుముండా-చావు

నీకు దణ్ణపెడుతానేవ్

దణ్ణం ఎవ్వరికి కావాలి నీదణ్ణ? కాస్త ముండకు, కూస్తముండకు అందరికీ పెద్ద పెద్ద మాటలు లోతులోతు ఆలోచనలు చావుముండ చావు

ఇక ఇలాంటి మాటలన నేవ్

ఇట్లా ఎన్ని సార్లయంది? ఒకసారి పప్పలు పెట్టలేదని-మరొకసారి నెయ్యి వేయలేదని-ఇంకొకసారి చద్ది అన్నము పెట్టానని-ఇప్పుడు పెరుగయ్యి లేదని-నీ కెన్నిసార్లు బుద్ధి చెప్పాను మెత్త మెత్తగా చెబుతూంటే నెత్తి కెక్కుతూన్నావు నీరోగం ఇట్లా వదిలిస్తేనే గాని సిగ్గురాదు

కూతురు ఏడుస్తూ బ్రతిమలాడు కొంటోంది. తల్లి తిట్టుచు కొడుతోంది తల్లి బుల్లెమ్మ చల్ల కావమతాడుతో కొట్టడం-కూతురు సుశీల లబోదిబోమని యేడ్వడం-కోడలు సూరమ్మ కళ్లవెంబడి నీళ్లు గిర్రుమని తిరిగాయి ఆమె హృదయం భరించరాని దుఃఖంతో బాధపడింది మనస్సు ఆవేదనతో ఆరాట పడింది

కోడలు కింతబాధ గల్గడం అత్త తనను పెట్టుచూన్న బాధల్ని గురించిగాదు అంతకంటే కోటిరెట్లు అధికంగా తన కొరకు గాను అనవుసరంగా ఒకమాట మాట్లాడి చావుదెబ్బలు తింటూన్న సుశీలను గురించి ఆమె మనస్సు బాధపడింది మజ్జిగతో కలిపెన అన్నమును తినకుండగానే ఎంగిలి చేతిని పళ్లెములోనే కడిగేసి గబగబా అత్త దగ్గరకు పరుగెత్తి కెళ్లింది

వూరుకో-అత్తయ్యా! వూరుకో

చెప్పేవుతే మా గావునీతి అవతలకుపో తల్లీ కూతుళ్ల మధ్య నీ కెందుకు? సర్దడానికి నిన్నెవరూ రమ్మనలేదు-సుశీల వంటిమీద దబదబా మరో నాల్గు దెబ్బలు పడ్డాయి.

“ఇద్దరు మనుష్యులు తగాదాపడి కేకలేసు కొంటూన్నపుడు, వూరు కోండని చెప్పేవాళ్లుంటే ఆకేకలు ఇంకా ఎక్కువవుతాయి గొంతుగూడా పెరుగుతుంది ఏడ్చేవాళ్ల పక్కకు ఓదార్చేవాళ్లు జేరితే ఆ ఏడుపు అధికమై ఇంకా ఇంకా ఎక్కి ఎక్కి ఏడ్వడం జరుగుతుంది అట్లాగే తల్లులు పిల్లల్ని కొడుతూన్నపుడు వద్దని చెప్పే వాళ్లుంటే మరొకదెబ్బ అధికంగా వేయడం జరుగుతుంది తరువాత తల్లి మనస్సు బాధపడినా ఆసమయంలో మాత్రం మరొకదెబ్బ ఎక్కు వేయడమే జరుగుతుంది”

బుల్లెమ్మ గూడా అలాగే చేస్తోంది కోడలు వూరుకో అత్తయ్యా అని బ్రతిమాలినకొద్దీ కూతురు సుశీలవంటిమీద మరో రెండు దెబ్బలను వేస్తోంది కోడలు కొట వద్దని చెప్పినపుడు కొట్టకుండగా మాను కుంటే తను కోడలుమాట విన్నట్లవుతుంది అంతేగాదు ఇకముందు సుశీల ఎప్పుడూ కోడలుపక్షమే వహించి వుంటుంది ఈ రెండు ఆలోచనలు మనస్సునుబట్టి బాధించుతూంటె ఆబాధనుండి ఉపశమనం పొందేందుకు కూతురును మరోరెండు దెబ్బలు వేస్తోంది

దెబ్బల బాధకు సహించలేని సుశీల నేలమీద పడిపోయింది వదినె వైపుకుజూచి బ్రతిమలాడు తోంది-

నీకు దణ్ణం ఒదినా . నన్ను బ్రతికించు ఒదినా చస్తున్నా

ఒదినా చస్తూన్నా

సుశీల పల్కిన యీ పల్కులు సూరమ్మను ఆపాద మస్తకం కదిలించి వేశాయి ఆమెలో నున్న కరుణారసం పెల్లుబికింది మంచులా కరిగిన ఆమె హృదయ సీమలనుండి వెలువడిన దయారసం సెలయేరులా ప్రవహించింది ప్రేమతో, దయతో, కరుణంతో పరవశురాలైన సూరమ్మ అత్తదగ్గర కెళ్లి చేయిబట్టుకుని మరొకసారి బ్రతిమలాడింది వూరుకో అత్తయ్యా—

పడివయస్సులో నుండి, మంచి బలం కలిగివున్న బుల్లెమ్మకు కోపం అధికం కాగా ఆవేశ మెక్కువై చేయిని విసురుగా విదిలించుకుంది ఆ విసురును ఆపుకోలేని కోడలు చేయిపట్టు తప్పిపోగా వెళ్లి దూరంగా క్రిందపడి పోయింది అక్కడ చెంబు వుండడంవల్ల అది నెత్తికి తగులగా పెద్దగాయం పడింది కోడలు క్రిందపడడంతో తల్లి బుల్లెమ్మకు కూతురుపై నున్న కోపం తగ్గిపోయింది చేతిలో నున్న తాడును కూతురుపైపడేసి ఒకసారి కోడలు వైపు-మరొకసారి కూతురువైపు చురచురా జూచుకొంటూ లోపలి కెళ్లిపోయింది ఈ తొందరలో, అప్పుడున్న గుడ్డి ద్వేషంలో ఆమె కోడలుకు తగిలిన దెబ్బను

గాని-ఆదెబ్బ నుండి ధారా ప్రవాహంగా ప్రవహించుతూన్న నెత్తురుగాని చూడనే లేదు తరువాత సూరమ్మ నెమ్మదిగా తనంతట తానే లేచి, పాతగుడ్డ చింపుకొని తలకు కట్టుకొన్నది

2

ఓర్చుకోవాలమ్మాయి ఓర్చుకోవాలి—

ఎంతకాలం ఓర్చుకోవాలి? మహా సముద్రానికైనా అవతలి ఒడ్డు వున్నట్టు భూగోళంలో కనుపించుతుంది గాని మా కష్టాలకు దరీ అంచూ కనుపించదాయె ఈవిధంగా ఇంకెన్నాళ్ళని ఓర్చుకోవాలి?

కష్టాలెప్పుడూ కాపురముండవు ప్రతి మానవునకూ కష్ట-సుఖాలు కావటి కుండలన్నారు అందుచేత కష్టాలున్నంత కాలం ఓర్పు వహించాలి తప్ప నప్పుడేమి చేస్తాము?

ఏమీ చేయలేకపోతే చావటం మేలు ముక్కు మూసుకుంటే మూడు ఘడియలు పట్టదు ముష్టి బ్రతుకు

రాధ యీ మాట అనేసరికి—

అన్న ఆనందరావు, భర్త దాసు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు ఖంగారుతో ఒకరి మొఖం వేరొకరు జూసుకొని ఇద్దరూ కలిసి రాధ వైపుకు జూశారు రాధ మొఖం పూర్తిగా పాలిపోయింది కళ్లనంబడి నీళ్లు కారుతూన్నాయి ఈ విషాద దృశ్యాన్ని జూసి చలితుడైన ఆనందరావు రాధను ఓదార్చబోయాడు

చదువుకున్న దానివి అనేక విషయాలు తెలిసినదానివి నీవే ఇలా అంటే ఎవ్వరేమి చెప్పగలరు? చచ్చిన తరువాత మానవులు చేసే దేముంది? బ్రతికుండగానే ఆలోచించాలి బాధల నివారణ జేసుకోవాలి జీవితాన్ని సుఖమయం గావించుకోవాలంటూ ఆనందరావు చెబ్తూండగానే—

మీకేం మీరలాగే చెబుతారు ఎన్నిసార్లు! ఎన్ని బాధలు! ఒకటా? రెండా? ప్రతినిత్యము వందలకొలది బాధలు తలచుకొంటే దుఃఖం పొంగిపొరలి వస్తుంది

రాధ చీర పమిట చెంగుతో కళ్లనీళ్లు అద్దుకొంటూ చెబుతోంది

నిన్నగాక మొన్న అత్తగారితో చెప్పకుండగా చిన్నబ్బాయికి కొత్త నేయి చేసినందుకు పెద్ద రాద్ధాంతం జరిగింది పెద్దదాన్ని నేను ఎలాగో బాధలు పడుతూన్నాను తినో! తినకనో! కాలం గడుపుతూన్నాను చిన్న పిల్లాడికి నేయి వేస్తేనే తగాదా అయితే బ్రతికేదెలా? అత్తా - కోడళ్లు పోట్లాడుకొంటూంటే ఇరుగుపొరుగువాళ్లు చూసి ఏమనుకుంటారు? అత్తది తప్పని కొందరంటే! కోడలుది తప్పని మరికొందరంటారు బాధలనుభవించుచూ, ఇరుగుపొరుగు వారితో మాటలు పడతూ ఎందుకీపాడు బ్రతుకు బ్రతకటం? వె ం ఏమి జరిగిందో తెలుసునా? దీపావళి పండుగకుముందు పిల్లలు తింటానికని అమ్మ పంచదార లడ్డూలు జేసి పంపించింది అవి తెచ్చే సమయానికి అత్తగారు ఎదురుగుండా కనుపించేసరికి తెచ్చినవాడు వాటిని ఆమెకే ఇచ్చేశాడు ఆమె అమ్మ పంపించిన వాటి నన్నింటినీ దాచుకొని నాల్గంటే నాల్గింటిని మాత్రమే నాచేతి కిచ్చింది ఏమిటీ ఘోరం? ఇంతకంటే అన్యాయం ఏముంది? ఇక్కడ వీళ్లు వండుకున్నవి



సాకూ, పిల్లలకూ పెట్టరు సరే అక్కడ నుండి అమ్మ పంపించినవి గూడా అత్తగారే తీసుకోవడం ఏమిటి?

చెల్లెలు పంచదార లడ్డూలుమాట చెప్పే సరికి అన్న ఆనందరావు ఒక్కసారి తనను తానే తడివి చూసుకొన్నాడు ఈసంగతి తనకు తెలియనే తెలియదు దేన్ని గురించి ఆలోచన లోపలవున్నా అతను బయటకు గంభీరంగానే మాటాడాడు చెగవతిండి తిండిని గురించి తగాదా ఎందుకు?

నీకు తెలువగు అన్నయ్యా పిల్లల్ని పెంచేవాళ్లకు తెలుస్తాయి ఇలాంటి బాధలు ఈ అత్త దగ్గర "కోడరికం" చేసే దానికంటే? ఏ యజమాను రాలిదగ్గరైనా అంట్లు తోముకొని బ్రతకటం మేలు

రాధ యీమాట అనేసరికి ఆనందరావు క్రోధంగా శావమరిది వైపుకు చూశాడు దాసు తప్పుజేసిన వానివలె తలవంచుకున్నాడు తిరిగి ఆనందరావే ప్రశ్నించాడు దాసూ ఈబాధల నివారణకు మార్గమేమాలోచించావు?

అది తెలియకనే అవస్థపడతూన్నాను పెద్దవాడవు, వ్యవహారజ్ఞానం కలవాడవు, నీవే ఏదోఒక ఆలోచన చెప్పమని దాసు అడగగానే—

ఏదైనా వ్యాపారం పెడితే ఎలా వుంటుందని ఆనందరావు ప్రశ్నించాడు

ఏ వ్యాపారం చేయగల్గు తాను? ఈ రోజుల్లో క్రొత్తగా ఏ వ్యాపారం చేయాలన్నా కనీసం పదివేల రూపాయలైనా వుండాలి ఆమాత్రం పెట్టుబడి లేనిదే వ్యాపారం సాగదు ఇంత పెట్టుబడి గావాలంటే ధనం ఎక్కడనుండి వస్తుంది?

మేము కట్నం తాలూకు ఇచ్చిన ధనమేమైంది? అసలు ఎనిమిది వేలు, వడ్డీతో పదివేలు కాలేదా?

ఇప్పుడా సొమ్మేమీ లేదు మీ నాన్నగారు అప్పుడా మొత్తాన్ని మా నాన్న చేతికిచ్చారు ఆ డబ్బును మా నాన్న తిరిగి మా చెల్లెలు వివాహ సమయంలోకట్నంగా ఇచ్చేశాడు

బాగానే వుంది ఆ సొమ్ము ఇప్పుడు అడిగితే .

అడిగేను

సమాధానమేమిటి?

పెళ్లి కావలసివున్న ఆడపిల్ల సంగతి ఆలోచించి, చిన్న పిల్లలుగానున్న ఇద్దరు తమ్ముల కేమివ్వాలో నిర్ణయించి, తన పెళ్లినాడు తనకు కట్నంగా ఇచ్చిన ధనానికి లెక్కగట్టి దాన్ని వేరేదీసి ఆపైన ఈ వ్యవహారం మాట్లాడమన్నాడు

సరే తీగలాగితే డొంక కదిలినట్లుంది పోనీ ఎక్కడైనా ఉద్యోగం చేయరాదు

ఎవ్వరిస్తారు ఉద్యోగం? చదువు సామాన్యము వున్న చదువునుబట్టి నెలకు యాభై రూపాయలుగూడా ఇవ్వరు యాభై రూపాయలు లేనప్పుడ ప్రత్యేకంగా ఇతరచోట కుటుంబ ఖర్చులు గడిపే దెలాగు?

భర్త ఈమాట అనేసరికి రాధ క్రోధంగా అన్నది "అన్నిటికీ అన్ని సమాధానాలు కబుర్లు చెబుతారేగాని క్రియ ఆలోచించరు."

"అవును. అది యధార్థం ,ఈనాడు దేశంలో వున్నట్టి ఆర్థిక-రాజకీయ-సాంఘిక పరిస్థితుల్ని బట్టి అన్నిచోట్లా యువతీ యువకుల గతి ఇలాగే వుంది యువతీ-యువకులు, తమ తమ తలి-తండ్రులు సంపాదించిన ఆస్థి-పాస్థులమీద ఆధారపడి వున్నంతకాలం ఇలాంటి బాధలు తప్పవు ఈనాడు దేశంలో వున్న ఆర్థిక విధానం మారాలి దాని స్థానంలో నూతనంగా సామ్యవాద ఆర్థిక విధానం అమలులోకి రావాలి ప్రతి ఒక్కరికీ పని లభించుతుందనే గ్యారంటీ వుండాలి జీవిత ఖర్చులకు సరిపడునట్లుగా వేతనాలు లభించాలి అప్పుడే యువతీ యువకులు ఆనందమయ జీవితం గడపగల్గుతారు ఇది జరగాలనుకున్నప్పుడు, ఇప్పుడు రాజకీయాధికారంలోనున్న వారు గూడా ఆ పదవుల నుండి వైదొలగిపోవాలి ఆర్థికంగానూ, రాజకీయంగానూ, సాంఘికంగానూ పెద్ద మార్పు రావాలి

అన్న ఆనందరావు చెబుతూన్న యీ మాటలు వింటూంటే వస్తూన్న నవ్వును ఆపుకొని చెల్లెలు రాధ ఇలా అంది

"బేషుగ్గానే వుంది మతాధికారులు-పీఠాధిపతులు-గురువులు తమ భక్తులకిలాంటి బోధనలే చేస్తూంటారు జపాలు చేయండి తపాలు చేయండి ఉపవాసాలుండి పూజలు పునస్కారాలు చేయండి మీ భక్తికి మెచ్చి భగవంతుడు ప్రత్యక్షమై వరాలు కోరుకొమ్మని అడుగుతాడు ఆ సమయంలో మీరు మీకు కావలసిన వరాల నడగండి అప్పుడు మీ జీవితం ధన్యత మవుతుంది మీ కోర్కెలు ఫలించుతాయి కష్టాలు అంతరించిపోతాయి"

ఇప్పుడు నీవు చెప్పేది గూడా ఇలాగే వుంది రాజకీయ విధానం మారాలి సాంఘిక విధానం మారాలి ఆర్థిక విధానం మారాలి సామ్యవాద ఆర్థిక విధానం అమలులోకి రావాలి ఇవన్నీ జరిగినప్పుడు బాగానే వుంటుంది అంతవరకు బ్రతికే దెలాగనే నా ప్రశ్న?

రాధ యీ మాటలనగానే ఆనందరావు తన ధోరణి మార్చుకున్నాడు దాసువైపుకు జూసి కర్తవ్యాన్ని బోధించాడు

"ఇక మరో మార్గం లేదు మీ నాన్న ఎంత ఆస్థిని ఇస్తాడో అంత ఆస్థిని వెంటనే తీసుకో మరొక వృత్తి నాలోచించుకొని స్వతంత్ర జీవితం గడిపే విధానాన్ని యోచించుకో"

3

ఆనందరావు ఇంటికి వచ్చే సమయానికి భార్య తలకు కట్టు కట్టుకొని విచార వదనంతో పనిచేసుకొంటోంది ఆనందరావును జూసేసరికి సూరమ్మకు దుఃఖం పొంగి వచ్చింది కాని దాన్ని ఏ విధంగానూ బయటకు కనుపించనీయలేదు

ఆనందరావే అడిగాడు తలకు కట్టేమిటి?

సూరమ్మ పొంగి పొరలి వస్తూన్న దుఃఖాన్ని అదుపుకొని నెమ్మదిగా సమాధానం చెప్పింది "చెంబుల బల్ల పైనుండి చెంబు పడగా దెబ్బ తగిలింది"

విచార గ్రస్తంగా నున్న వదనం, గద్గదపడుతూన్న గొంతు, నీళ్లు గ్రమ్ముతూన్న కళ్లు చూడగానే ఏదో తంతు జరిగిందనే అనుమానం ఆనందరావుకు గల్గింది అమ్మా-భార్యా ఏదో రకంగా పోట్లాడుకొని వుంటారని ఈ కట్టు అమ్మజేసిన అఘాయిత్య ఫలితమేనని ఆనందరావుకు తెలుసు అయితే ఇది ఎలా జరిగిందో మాత్రం తనకి తెలియదు నిజం చెప్పమని భార్యను మరొకసారి గట్టిగా అడుగుదామనుకున్నాడు

ఇంతలోకే తల్లి వచ్చి పాడు కాకులు ఎప్పుడూ చెంబుల బల్ల మీదనే చస్తాయంటూ అతని ఆలోచనలకు భంగం కలిగించింది

తాను జేసిన మహాపరాధం, దాన్ని బయట పడకుండగా కోడలాడిన మహా అబద్ధం ఇవి రెండూ బుల్లెమ్మ మనస్సుకు కొంతవరకు జ్ఞానోదయాన్ని కలుగజేశాయి ఆ క్షణంలో మాత్రం ఆమె తన కోడల్ని లోలోన ఎంతో ఘనంగా పొగడుకొంది కొడుకు దగ్గర కొచ్చి అడిగింది

రాధ ఏమి జేస్తోంది?

ఇంటి పనులు జేసుకొంటోంది

ఎలా వున్నది?

ఇక్కడ వున్నట్లే వుంది

అందరూ బాగున్నారా?

మనమున్నట్లే వున్నారు

తల్లి బుల్లెమ్మ అడిగిన ప్రశ్నలకు కొడుకు ఆనందరావు వ్యంగ్యంగానూ, చిటకారంగానూ సమాధానం జెప్పి చావిట్లోకి వెళ్లాడు

ఆనందరావు చెప్పిన సమాధానాల్లో వున్నట్టి వ్యంగ్య స్వభావాన్ని తల్లి అర్థం జేసుకోలేక పోయింది అతను చావిట్లోకి వెళ్లి గొడ్లూ మేత-నీరు-నౌఖర్లు చేసినపని-చేయవలసిన పనులన్నింటినీ జూసుకొని బజారు కొచ్చేసరికి పాఠశాలనుండి వస్తూన్న సుశీల కనుపించింది అన్నయ్యను చూడగానే మహా సంతోషంతో పొంగిపోతూన్న సుశీల అన్న నీవిధంగా అడిగింది

వదినె తలకున్న కట్టు చూశావా?

చూశాను గాని-దెబ్బ ఎలా తగిలింది?

సుశీల జరిగిన సంగతి అంతా చెప్పేసింది ఈ సంగతి తెలిసేసరికి ఆనందరావుకు అంతులేని కోపం వచ్చింది అయినా జరిగిపోయిన సంగతిని గురించి ఆలోచన ఎందుకనుకున్నాడు కాసేపు బజారులో కూర్చొని ఇంట్లోకి రాగానే తల్లి బుల్లెమ్మ సంతోషంతో అడిగింది

రాధ గారబ్బాయి ఎలా వున్నాడు?

బాగానే వున్నాడు

ఏమంటూన్నాడు?

అమ్మమ్మ రాలేదే మన్నాడు

నిజంగా నేనా?

నిజమేనా ఏమిటి? నాల్గురోజుల్లో పంపించుతానని చెప్పేవరకు నన్ను బాధించాడు

రాధ ఏమన్నది?

కోతల పనులు రాకముందే నిన్ను రమ్మనమంది

ఈ కబుర్లు బుల్లెమ్మకు చాలా సంతోషాన్ని గలించాయి రాధ పరిస్థితి ఇక్కడ వున్నట్లే వున్నదని ఆనందరావు చెప్పిన సమాధానాల కర్థం, రాధ ఇక్కడ తనదగ్గర వుండగా ఎలాగాగా బంగా తిరిగేదో! పని చేశో! చేయకనో! ఎంత సుఖంగా వుండేదో! ఇష్టమొచ్చిన తిండి తిని ఎంత ఆరోగ్యంగా వుండేదో! అలాగే వుందని అర్థం జేసుకొంది ఆ సంతోషంలో తన కూతురు గొప్పను గురించి-వియ్యపురాలి మంచితనాన్ని గురించి ఇరుగు పొరుగు వారి దగ్గర పొగడటం అధికమైంది త్వరలోనే కూతురు దగ్గర కెళ్తానని చెప్పుకొంటోంది

4

ఏమిటే గందరగోళం? ఎప్పుడూ ఇంట్లో ఇదే గోల అయితే బయట తలెత్తుక తిరిగేదెలా? ఇలాగైతే సంసారం బాగానే వుంటుంది-రామయ్య గొంతును పెద్దదిగా జేసి ఇంటి కప్పు పెంకులు లేచి పోయేట్లు కేకలు వేస్తూన్నాడు

రామయ్య కేకలకు రత్తమ్మ సమాధానం చెబుతోంది "అవును సంసారం గుట్టుగా వుండాలనే ఇలాంటి కోడల్ని తెచ్చి నెత్తిమీద ఎక్కించావు"

"నీవూ ఒకప్పుడు కోడలివే గుర్తుంచుకో"

అవును నేనూ కోడలినే నేను మీ అమ్మ దగ్గిర ఇలాగే "కోడరికం" చేశానా? అప్పటి పనులు-అప్పటి నిబంధనలు ఇప్పుడైతేనా? అలాంటి అత్తగారిదగ్గర "కోడరికం" చేయవలసివస్తే నీ కోడలు నిన్నూ నన్నూ ఇంట్లో పెట్టి బయట తాళం వేసి ఒక్కసారే నిప్పు పెట్టి పోయేది

చాల్లే సంభాషణ సరిపెట్టమని భార్యను గదమాయించి రామయ్య బయట కొచ్చేసరికి వియ్యపురాలు కనుపించింది ఇంతవరకూ ఇంట్లో జరిగిన సంభాషణను బట్టి నిజ సంగతులు వియ్యపురాలు తెల్సుకొనే వుంటుందని గ్రహించిన రామయ్య ముందుగానే అనేశాడు

ఏదో ఇంట్లో అత్తా కోడళ్లు కీచులాడుకొంటూంటే! పెద్ద దానివి సర్దుకపోక పోతే ఎలాగని అత్తనుమందలించుతున్నాను

"దానికేమి లెండని" వియ్యపురాలు సమాధానం చెప్పగానే-

కొడుకు-కోడలు అంతా బాగున్నారా? అని ఒకటి రెండు ప్రశ్నలడిగి రామయ్య బయటికెళ్లెను

వియ్యపురాలు తెచ్చి యిచ్చిన మంచినీళ్లు త్రాగి, ఆమె అడిగిన ప్రశ్నలకు గూడా సమాధానం జెప్పి బుల్లెమ్మ కూతురున్న గదిలో కెళ్ళింది

కూతుర్ని చూసేసరికి బుల్లెమ్మ హృదయం తరుక్కుపోయింది నల్లగా వాడిపోయిన మొఖం-లోతుకుపోయిన కళ్లు-చెదరిపోయిన జుట్టు-మసిపాతవలెనున్న పాతబట్టలు-కూతురున్న దుస్థితిని పరికించేసరికి రత్తమ్మకు ఏడుపొచ్చింది తన కొడుకు తనతో చెప్పిన మాటలకు, ఇక్కడున్న పరిస్థితులకు ఎక్కడా పోలిక పొంతనా లేనేలేదు ఆశ్చర్యంతో ఆమె కూతురు నడిగింది

ఇవ్వాళ ఇలా వున్నావేమిటి?

రోజూ ఇంతే

అయితే అన్నయ్య అలా చెప్పాడే!

ఏమని చెప్పాడు?

రాధ పరిస్థితి ఎలావున్నదంటే ఇక్కడ వున్నట్లే వున్నదన్నాడు

అక్కడ ఎలావున్నది?

ఏమిటి?

మరేమిటి అన్నయ్య అన్నది అక్కడ నీకూ, వదినెకూ ఎలావుంది? వదినెను ఎలా చూస్తున్నావు?

కొడుకు చెప్పిన మాట కర్థం రత్తమ్మకిప్పుడు తెలిసింది అంతేగాదు తన వియ్యంకుడు భార్యను మందలించునప్పుడు నీవూ ఒకింటి కోడలివేనని చేసిన హెచ్చరిక గూడా అర్థమైంది అంతేగాదు నలభై సంవత్సరాల క్రితం తను గూడా ఒక అత్త దగ్గర కోడలుగానున్నప్పుడు అనుభవించిన "కోడరికం" బాధలు గుర్తుకొచ్చాయి. సంఘంపైన, ఆస్తిపైన అధికారం గల్గియున్న పురుషులు స్త్రీలను అణచివేస్తూంటే స్త్రీలు ఒకరినొకరు హింసించుకొనే పాడు పద్ధతి అంతమయ్యే దెప్పుడోనని ఆమె ఆలోచించసాగింది" ★

అల్లా... అల్లా... ఖర్మం!

శ్రీ మానూరు రామకృష్ణారావు

1

"అమ్మా, వెళ్తానే వర్షం అయితే అయింది గానీ" అన్నాడు సీతారామయ్య కిటికీలోనుంచి ఆకాశంవైపుకి తొంగిచూస్తూ, వర్షం తగ్గే సూచనలేమైనా వున్నయేమోనని

"పోనీ వర్షం తగ్గాకే పోదువుగానిలే ఇవ్వాళ కాకపోతే రేపు తొందరేమిటి" అన్నది సీతమ్మ నవ్వుకుంటూ, పెళ్ళాన్ని చూడటానికి కొడుకు పడుతున్న ఆదుర్దా చూచి

"వెధవ ముసురు ఎప్పుడు తగ్గుతుందో? సరిగ్గా సమయానికే పట్టాలీ" అని ప్రకృతిదేవతను తిట్టుకుంటూ సీతారామయ్య "యీజీఛైర్లో" చతికిలపడి కళ్ళజోడు సవరించుకొని ఒక పత్రిక చేతిలో పుచ్చుకొని చదవటం మొదలుపెట్టాడు కాని ప్రియాదర్శనేచ్ఛయే బలవంతముకాగా పత్రిక నలా పారేసి భావి సుఖమయకల్పనలు కల్పించుకుంటూ కళ్ళుమూసుకొని పడుకున్నాడు పాపం వాళ్ళ వూళ్ళో యీపాటికి సరస్వతి మొగుడు సాయంకాలానికి వస్తాడని ఆత్రంతో ఎదురుచూస్తూ వుంటుంది కొత్త అల్లుడువస్తాడు కూతుర్ని అత్తవారింటికి పంపించినతర్వాత తిరిగి దిగబెట్టిపోవటానికి ఏడాదిక్రిందట కాబోలు ఒకసారి వచ్చాడు మళ్ళీ రావటానికి సందర్భము దొరకలేదు ఇన్ని నెలలకుగాను యిప్పుడు వస్తున్నాడు—అని అత్తమామలు ఆనందంతో నిరీక్షిస్తుంటారు ఇప్పుడు వెళ్ళకపోతే ఎలా మరి? ఏమైనా సరే యీ వెధవవర్షానికి జడిసి కూర్చుంటే—సెలవు నాలుగురోజులు గడచిపోయినవంటే తిరిగి వెళ్ళడానికి కాదు యిప్పుడు వెళ్లాలిసిందే ఒక్కరోజు యిక్కడ వున్నంతమాత్రాన చేసేదేమీలేదు నాలుగైదు రోజులు అమ్మదగ్గర వున్నాడుగా ఇక యిక్కడ వృధాగా కాలం వ్యర్థపుచ్చడంకంటే అక్కడికివెళ్తే సుఖంగా గడపవచ్చు ఏమైనా సరే వెళ్లాలిసిందే అని సంకల్పించుకొన్నాడు

నిజానికి సీతారామయ్య అత్తగారింటికి వెళ్లి చాలాకాలమే అయింది కళాశాలలో విద్యాభ్యాసం చేస్తూండబట్టి మాటిమాటికి ఎక్కడికీ—స్వగ్రామానికి కూడా—కదలడానికి వుండదు పోనీ దసరా సెలవులలో వద్దామంటే—రావచ్చును అభ్యంతర పెట్టేదెవరు? కాని సందర్భాలు సమకూడలేదు రావడమ్ము కాలేదు

లేచి పెట్టెతీసి, అందులో బట్టలు సర్దుకొని, తనకొరకు కొన్ని ఆంగ్ల గ్రంధాలు, భార్యకోసం కొన్ని ఆంధ్ర నవలలూపడేసి వంటింట్లోకి వెళ్లాడు సీతమ్మ వంట సిద్ధం చేసి గోవిందనామాలు పాడుకుంటూ కూర్చొనివుంది

"అమ్మా వడ్డించవే టైమైంది" అన్నాడు సీతారామయ్య

"అప్పుడే అయిందిట్రా యింకా రెండు గంటలకేమో ననుకుంటున్నాను" అని లేచి విస్తరివేసి వడ్డించింది కొడుకు భోంచేస్తున్నంతసేపూ తల్లి కోడలికి చెప్పాలిసిందంతా ఏమేమో చెప్తూనేవుంది భోజనానంతరం కాస్సేపు—ఒక పావుగంట—విశ్రమించి, లేచి గొడుగువేసుకొని బయటకు వెళ్లి ఒక ఎద్దుబండి కుదుర్చుకొనివచ్చి పెట్టె అందులో పెట్టించేసు బండి ఎక్కుతూ "అమ్మా వెళ్లివస్తానే" అన్నాడు

"జాగ్రత్త సుమా, వర్షం మరి నేను చెప్పవలసిందేమీ లేదు వెళ్ళగానే ఉత్తరం రాయి అందరినీ అడిగినానని చెప్పు" అని అంటూండేటప్పటికే బండి కదిలిపోయింది

2

ఆకాశమంతా నీలమేఘావృతమై వుంది. రాత్రి అంతా జోరున వర్షంసాగి ఎక్కడచూసినా జలమయం అయిపోయింది ఎటుచూచినా తటాకాలు, అందులో ప్రతిఫలించే మేఘాలు, చెట్లు చేమలూ ఒకవిధమైన గంభీరభావాన్ని దాల్చి రామణీయకంగా కనబడుతున్నై పన్నెండుగంటలైనా సూర్యదర్శనమే లేదు ఏ ఏడుగంటలో అనిపించేట్లున్నది ఉండి ఉండి గాలి వీచినప్పుడల్లా చెట్లమీదనుండి నీరు తుంపరలుగా తపతపమని భూపతనమొందుతున్నది నీటిగట్టునవున్న చెట్లమీదనుండి నీటిలోనికి తుంపరలు పడ్డప్పుడల్లా ప్రశాంతంగావున్న నీరు చెదరి వింతగా ధ్వని కలుగజేస్తూ చిన్న చిన్న వలయాలుగా బయలుదేరి నీటిలో ప్రతిబింబించిన ప్రకృతి దృశ్యాలనన్నిటినీ చెదరగొట్టుతున్నవి తిరిగి మళ్ళా ప్రకృతి ప్రతిబింబాలు నీటిలో కూడుతూనే వున్నై వర్షము పడివుండటంవల్ల చెట్లు మరీ పచ్చగా మెరుస్తున్నయి స్టేషనుకు కొద్దిదూరములో వున్న కొండల మీది రాళ్ళు నల్లగా ప్రకాశిస్తున్నయి వాటి శిఖరాగ్రాలమీదనుండి ధారగా సన్నని జలప్రవాహాలు కొండ శిలవల్లాగా క్రిందకు దిగుతున్నయి స్టేషను చుట్టుపట్ల జనసంచారం అట్టేలేదు ఒకరో యిద్దరో మాత్రం గొడుగులు పట్టుకొనినడుస్తున్నారు

రైలుస్టేషన్లో ఎక్కడచూచినా కాళ్ళకు తగిలిన బురదా నీళ్ళూ ప్రయాణికులు అక్కడక్కడ కూర్చొని మాట్లాడుకుంటున్నారు మన దేశంలో అసహ్యతే అనేది తప్పక ఎటువంటి పరిస్థితులలోనైనా మన దేశీయుడు కాలం గడిపివేయగలడు

రైలు రావడానికి యింకా అరగంట వేళ వున్నది

ఉచ్చస్వరంతో ఒక రెడ్డి మాట్లాడుతున్నాడు అప్పుడప్పుడు నోట్లో చుట్టతీసి పొగవిడుస్తూ "రేత్తిరి మా ఖుల్లోడు బస్తీ కెల్లొచ్చాడు సచ్చిపోయాడంట వాగు దాటలేక సందకాడ నీరొత్తున్నదంట ఎఱ్రగా సుల్లు తిరుగుతా! కల్లు తిరిగిపోనాయంట పడవోళ్ళనడిగితే పడవకట్టమన్నారంట ఒతిమిరాగ ఎట్టాగో ఒకట్టా పడవ మీదనే దాటేతలికీ మా బెమ్మాండమైందంట! వడ్డుకు వచ్చేతలికీ పానాలు సగమైనయి"

"రాత్తిరి మరి ఎంత నీరొచ్చిందో మరీ" అన్నాడు అప్పుడేవచ్చి కూర్చున్న ఒక కాపు చలికి గజగజా వణుకుతూ కొంచెం తడిసినకంబళి ఒకటి గట్టిగా కప్పుకుంటూ

ఇంతలో వర్షం మళ్లీ దబదబాపడటం మొదలుపెట్టింది రేకులషెడ్డుమీద పడే నీటి రొద ఒకరు మాట్లాడే మాట ఒకళ్ళకు వినబడకుండా చేస్తోంది స్టేషనులోనుండి కొండలూ, చెట్లు, రైల్వే ఉద్యోగస్థుల యిళ్లు ఒకటివెంట ఒకటి కనబడకుండా పోయి చివరకు వర్షపునీరు ఒక్కటిమాత్రమే కనబడుతున్నది

ఇంతలో బండి ఒకటివచ్చి నిలిచింది స్టేషనుదగ్గర అందులోనుండి సీతారామయ్య దిగి అలాగే తడుస్తూ లోపలికి వచ్చాడు బండివాడు పెట్టె అతనివద్దపెట్టి బండి బాడుగ పుచ్చుకొని గానహోరుకి తాళం సరిపోయేట్లు ఒక పదం పాడుకుంటూ వెళ్లిపోయాడు 'ట్రెయిను యింకా ఎంతసేపటికి వస్తుందో' అనుకుంటూ సీతారామయ్య ఒక బల్లమీద చతికిలబడ్డాడు వర్షం కొద్దికొద్దిగా తగ్గడం మొదలుపెట్టింది అప్పుడే ఒక మహమ్మదీయుడూ, అతనితో అతని కొడుకు 15, 16 ఏండ్లవాడూ ఒక పెట్టె పట్టుకొని లోపలికివచ్చి సీతారామయ్య పక్కనే ఆశీనులయ్యారు పెద్ద ముసల్మాను బోడితలమీది నీటిని చేతివేళ్ళతో తుడుచుకొని, గడ్డం తడువుకొని సీతారామయ్యతో సంభాషణ కుపక్రమించాడు చూడబోతే విద్యావంతుడిలాగానే వున్నాడు ప్రపంచ వ్యవహారాలనుగురించి వీటినిగురించీ, వాటినిగురించీ ఏవేవో మాట్లాడుతున్నాడు

"కర్మం అదంతా మన కర్మ దానికి మనమేంజేస్తాం లేవయ్యా" అని ఒక రెడ్డిబిడ్డ ఏదో విషయం పక్కవాళ్ళతో మాట్లాడుతూ సీతారామయ్య, సాహెబుల చెవుల్లో ప్రతిధ్వనించేట్లు అరిచాడు

"అవునవును నిజానికి మనమేంజేస్తాం లే! ఎనక జనమలో చేసింది అనుగబయించాలిసిందే" అని కాపురెడ్డి వాదాన్ని బలపరిచాడు

"ఖర్మం ఏమ్టి హాండీ? ఖర్మం గిర్మం అఠంతా మాకీ జాంతానై హది అహంతా చాతాకానివాళ్ళమాటా చాతాహైతే మేము గొప్పా చాతా కాకపోతే ఖర్మం అంటారు మీరు" అన్నాడు సాహెబు సీతారామయ్యవైపు వంగిచూస్తూ అతని అభిప్రాయం ఏమిటో అని

"అలా అనకండి సాహెబుగారూ ఏ వేళకు ఎటొచ్చి ఏ దెలా అవుతుందో ఎవరు చెప్పగలరు? ఈవేళ వున్నవాళ్ళు రేపుంటారని నమ్మకం ఎలా? భగవంతుడనేవాడొకడు వున్నాడనీ, కర్మ అనేదికూడ వుంటుందనీ నమ్మేవాళ్లుకూడా చాలామంది వున్నారు కర్మను మీరు నమ్మినా నమ్మకపోయినా మానవాతీత విషయాల్లో మాత్రం అందరూ విధివిలాసానికి లొంగిపోయి నిస్సహాయంగా వుండాల్సిందే" అన్నాడు సీతారామయ్య

సాహెబు హేళనాసూచకంగా నవ్వి "కోపంవద్దూ సాబ్—మీకీ ఒక్టి అడుగుతాను మేము ఖర్మ నమ్మం మీరూ నమ్తారు ఐతే మీకీ మేం సావగొడ్తే అది మీ ఖర్మం యేగా?" అని విరగబడి నవ్వడం సాగించాడు

"అవును అది నా కర్మమే తిరిగి నేను మిమ్మల్ని చావగొట్టినా అదీ మీ కర్మమే పెడవాదాలకేమిలేండి" అన్నాడు సీతారామయ్య కించిత్కోపంతో

సాహెబు మంచివాడే విద్యావంతుడవడంవల్ల సీతారామయ్య మనస్సు నొప్పించాలనే అభిప్రాయం లేదు అతనికి కాని కేవలం వినోదానికే అన్నాడీమాట సీతారామయ్యమాటకు నవ్వి "మరీ . " అని ఏదో అనబోతున్నాడు ఇంతలో స్టేషన్లో కొద్దిగా కలవరం ప్రారంభమయింది రైలు వస్తున్నదంటే వస్తున్నదన్నారు పెట్టెలు సామానులు సర్దుకొని అందరూ ప్లాట్ఫారంమీదకు పరిగెత్తారు అప్పటికి వర్షం ఆగిపోయింది బండి ఆగీ ఆగడంతోటే జనం దిగేవాళ్ళను దిగనివ్వకుండా తొందరచేసి పెట్టెల్లోకి దూరుతున్నారు ముసల్మానూ, సీతారామయ్యా, కుర్రవాడుమాత్రం కొంచెం సందడి తగ్గాకా ఆగి ఒక చిన్న సౌకర్యమైన కంపార్టుమెంటులో ఎక్కారు మరి రెండు నిమిషాల్లో రైలు బయలుదేరింది

పచ్చటి పొలాల్లో తెల్లగా నీరు నిలిచి వున్నది కొంగలు గుంపులు గుంపులుగా పొలాల్లో అక్కడక్కడ విశ్రమించి వున్నయి రైలు హోరు వినిఐనా లేచిపోకుండా అంబరవీధిని కాలమేఘ సమూహాలు పందాలు వేసుకొని పరుగెత్తున్నయి. వాయుదేవుడు తన ప్రచండప్రభను వీడి సౌమ్యత్వాన్ని దాల్చాడు

"ఇందాక ఏదో చెప్పబోయారు సాయెబుగారూ ఏమిటీ?" అని అడిగాడు సీతారామయ్య తీరిగ్గా కూచొని

"ఆఁ—ఏమీలేదు మరి మేం ఖర్మగిర్మ చెప్పం మరీ మేం బతకడంలేదూ?" అన్నాడు సాయెబు ననకటి హాస్యధోరణిఆపి

"బతక్కేం! బతుకుతారు కాని విద్యావిహీనుడు భూమి గుండ్రంగా వున్నదని నమ్మినంతమాత్రాన బతకటంలేదా? పాశ్చాత్యులు మన శాస్త్రాలనంతా నమ్ముతున్నారా? ఇప్పుడిప్పుడు పరిశోధనలుచేసికాదా కొద్దికొద్దిగా నమ్ముతున్నారు! అయితే యింతకాలం వాళ్లు బతకలేదా? యిక ముందు బతకరా? ఎవరి నమ్మకాలూ, విశ్వాసాలూ వాళ్ళవి నమ్మినా నమ్మకపోయినా నా అభిప్రాయమటుకు—మీరు విధివిలాసం అనండి కర్మ అనండి—ఇంకా ఏమైనా అనండి—ఆ మానవాతీతమైన శక్తినిమాత్రం మనం జయించలేము" అని దృఢంగా చెప్పాడు సీతారామయ్య

సాహెబుకు యీ ధోరణి నచ్చలేదేమో, కొద్ది అయిష్టతతో "పోనీవండీ—మీతో మాట్లాడలేను—కర్మం గిర్మం నాకే నచ్చదు—పోదు వానా చూచారూ? మా తాలూక్ ఫైర్ పంటల్ ఖరాబ్ కావడానిక్కి" అన్నాడు

"అవును వర్షం చాలా జాస్తిగానే కురుస్తున్నది నిన్నటినుండీని" అన్నాడు కిటికీ వైపు తొంగిచూస్తూ సీతారామయ్య

సాహెబు మెల్లిమెల్లిగా కళ్లుమూసుకొని కొద్దిసేపు కునికిపాట్లుపడి చివరకు బల్లమీద పడుకొని నిద్రపోయాడు చిన్న సాహెబు అంతవరకూ కిటికీదగ్గర కూర్చుండి బయటి దృశ్యాలు చూస్తున్నవాడు—లేచి సీతారామయ్యను కిటికీవద్ద కూర్చోమని తను సీతారామయ్య స్థలంలో పడుకుంటానని ప్రార్థించి అక్కడే పడుకొని నిద్రపోయాడు

3

రైలు పొగలువిడుస్తూ మహావేగంగా తన గమ్యస్థానాన్ని చేరుకోడానికి త్వరపడుతూ పరుగెత్తుతోంది ఊరుదాటి సుమారు ఐదు మైళ్లు వచ్చింది పక్క స్టేషను యింకా ఆరుమైళ్ళున్నది అరమైలులో వాగు తగులుతుంది అడవి ప్రదేశం ఊళ్లు తక్కువా—స్టేషన్లమధ్య దూరం ఎక్కువా ఎంతమనోహరంగా వున్నది ప్రకృతి వర్షంపడ్డ తర్వాత మరీను కొన్నికొన్ని చోట్ల నీరు పట్టాలదాకావచ్చి నిలచివున్నది సీతారామయ్యకు యీనాడు ప్రకృతి ఎన్నడూ కనబడనంత అందంగా కనబడ్డది రైలుబండి దాదాపు వాగుదాకా వచ్చేసింది అక్కడే ఒక మలుపుతిరగాలి తిరగంగానే వాగుమీది బ్రిడ్జిమీదుగా రైలు పోవలసివుంటుంది డ్రైవరు వడి కొద్దిగాతగ్గించి జాగ్రత్తగా నడుపుతున్నాడు బండిని

రైలు మలుపుతిరిగింది ఎదురుగా బ్రిడ్జి కనబడుతున్నది కాని అదేమిటి? బ్రిడ్జి సగంవరకు సరిగానే వున్నది మిగిలినదంతా ప్రచండ ప్రవాహంలోబడి సాగరాభిముఖంగా పోయింది ఎప్పుడో? నదీప్రవాహం ఉరకలువేసుకుంటూ మహాభయంకరంగా ప్రవహిస్తోంది రాత్రిపడ్డ వర్షం సామాన్యం గాదు!!!

డ్రైవరు కండ్లు తిరిగిపోయినవి తక్షణం బ్రేకువేశాడు గూబలు పగిలేటట్లు కూయించాడు యింజను చేత కాని యేం లాభం? రైలు అప్పటికప్పుడే బ్రిడ్జి సగానికి వచ్చేసింది మరుక్షణానికి పట్టాలు వదిలేసి అధోగామియై పోవడానికి మొదలుపెట్టింది మొదట యింజను దిగి వెళ్లిపోయింది మొదట జలదేవతకు ఆహుతి అయింది డ్రైవరూ ఫైర్‌మనున్నూ!

* * *

కూత వినేటప్పటికి దెబ్బతిన్నట్లు లేచి కూర్చున్నాడు పెద్ద సాహెబు మొదట కనబడ్డది అఖండ జలప్రవాహము విరిగిపోయిన బ్రిడ్జీ అరక్షణంలో సాహెబు గ్రహించేసాడు స్థితినంతా ఒక్క పెట్టున కిటికీలోనుండి దూకేశాడు వెళ్ళివెళ్ళడం బ్రిడ్జీ కమ్మీలకువెళ్లి తగిలాడు కాని రైలు బ్రేకు వేయబడివున్నందున వడితగ్గి నీటిలోనికి పోతూవుండడమువల్ల అట్టే దెబ్బ తగలలేదు మహా ప్రయాసతో తిరుగ తన పెట్టెదగ్గరకు దుమికి కిటికీలోనుండి కనపడుతున్న చెయ్యిపట్టుకొని ఒక్క పెట్టున బలమంతా వినియోగించి లాగివేశాడు అతని పిల్లవాడు అతను నిద్రపోయేదాకా అక్కడ కూర్చొనివున్నాడు పుత్రప్రేమ యెంతైనా చేయిస్తుంది కాకపోతే అఖండ జలవాహిని లోనికి దిగిపోతున్న ఆ రైలుపెట్టెలోనున్న యితర ప్రాణిని, తన ప్రాణాల్నికూడా లక్ష్యంచేయక రక్షించడానికి ఎందరు పూనుకుంటారు?

లాగీ లాగడంలో పెట్టెలోనుండి వూడిపడ్డాడు మనిషి తుపాకీలోనుండి తూటా వూడిపడ్డట్లు ఆ వూతకు యిద్దరూవెళ్ళి మళ్లీ వంతెనకు తగిలారు కొంచంసార్లు దెబ్బతిన్న సాహెబుకు తల తిరిగిపోయింది తెప్పరిల్లిన తర్వాత రెండోవ్యక్తిని గట్టిగా కౌగలించుకొని ఆనందబాష్పాలు విడిచాడు కృతజ్ఞుడైనట్లు కండ్లుమూసుకునే

రెండోవ్యక్తి, కమ్మీలమీద పడడం నుండి తగిలినదెబ్బన వేదనతో నిరుగుకుంటూ "అబ్బా' అని మూలిగాడు సాహెబుకు యీ స్వరం వింతగా ప్రతిధ్వనించింది వీనుల్లో ఆశ్చర్యంతో చూశాడు ఆ వ్యక్తిని పై ప్రాణాలుపైన లేచిపోయినట్లయినవి ప్రాణాధికుణ్ణిగా ప్రేమించి పోషించిన ప్రియతనూజుని కాదు తాను ప్రాణాన్నికూడ లక్ష్యంచేయక రక్షించింది తనతోటి ప్రయాణీకుడైన సీతారామయ్యని!!! తన ఏకైక పుత్రుణ్ణి, అల్లారుముద్దుగా పెరిగిన పసికూనని నదీగర్భానికి సమర్పించాడు తాను సమర్పించినదేమిటి? సందర్భం అలా సమకూడింది!

సాహెబుకు కంటివెంట ఒక్క అశ్రుబిందువుకూడ వెలువడలేదు కంఠముమాత్రం రుద్ధమైంది ఒక్కమాటా మాట్లాడలేదు అతని అర్ధనిమీలిత లోచనాలు గగనము వైపుకు దృష్టిని సారించి అట్లే నిలిపినవి ఆ తర్వాత అతను చేతులుజోడించి అట్లే నిలచిపోయాడు కొంతసేపైన తర్వాత అతని కంఠంలోనుండి అస్పష్టంగా అసంపూర్ణ వాక్యాలు కొన్ని వెలువడ్డాయి

"అల్లా అల్లా ఖర్మం ఖర్మం"★

మానలమ్మ మనసు

మొదటి రంగం

[ఉదయం 6 గంటలకు జానకమ్మ పాటబాడుతూ పంపుదగ్గిర నీళ్లు పడుతూ ఉంటుంది]

జాన పాట

విరల శ్రీకృష్ణ-విజయ సారథికృష్ణా!
మాయలో పడియున్న-మమ్మేలు కృష్ణా
ద్రౌపదిని బ్రోచినా-ద్వారకాపురి కిష్ణ
దయయుంచి మమ్మేలు-దీనజన కృష్ణా!
దురభిమానము చేత-దూరమైతిమి కృష్ణ,
దురితంబులను బాపి-దరిజేర్చు కృష్ణా!

దుర్గమ్మ (ప్రవేశించి) ఏమండోయ్ మామ్మగారూ! కాస్త ఈ బిందెడు నీళ్లు పట్టుకోనిస్తారూ?

చేసుకోలేక అవస్థపడుతున్నావని, అన్నింటిలో నీళ్లు పడుతూవుంటే, పైగా ఎవరు పట్టమన్నారంటావా?

శాంత మొదలు ఆవిణ్ణి నీళ్లు పట్టకోనియ్యండి మీ కెందుకు మీరు పట్టుకు వెళ్లండి దుర్గమ్మగారూ, ఆవిడతో ఏమిటి?

దుర్గ ఇందాకటినుంచి బ్రతిమాలుతున్నా, పంపు దగ్గరకు రానివ్వలేదు చూశారా శాంతమ్మగారూ!

జాన ఇంకేం శాంతమ్మగారు పట్టకోమందిగా పట్టుకోండి [ఈసడింపుగా] మాలావ్ ఎలాగైతేనేం దొరికింది శాంతమ్మ ఇరుగుపొరుగువారందరికీ అలుసిచ్చి, నలుగురిలో నన్ను పురుగును విదలించినట్టు విదలిస్తావుషే ఔరా!

కాలా? చేతులు నొప్పిపుట్టేట్టు గట్టిగా పట్టుకుంటానుషే! (సాధింపుగా) మహాలావ్! నీవేకన్నావు పిల్లల్ని మేమేమైనా ఎరుగుదుమా? నేను పిల్లలను పెంచినదాన్ని గానషే శాంతమ్మా?

శాంత చాల్లే ఇహ లోపలికి రండి

జాన వస్తాలే అంట్లు తోలచి

శాంత అబ్బ! అంట్లు నేను తోలుచుకుంటా లెండి

జాన నేను పిల్లలను మాత్రం ఎత్తుకోలేను బాబూ!

శాంత సరే మీ ఇష్టం, వచ్చినట్లు చేసుకోండి

[కాస్త నిశ్శబ్దం తర్వాత]

జాన పాట

గోపాలకృష్ణుడమ్మా! మాయమ్మ
గోవర్ధనోద్ధారుడమ్మా!
అపవాదు తోలగగానమ్మా! మాయమ్మ
ఆ భల్లూకమును గూల్చెనమ్మా!
జాంబవతిని పెండ్లాడెనమ్మా! మాయమ్మ
జాగుసేయక వేగమమ్మా!
శమంతకమణి ఇచ్చెనమ్మా! మాయమ్మ
సత్యభామను బడసెనమ్మా!

ఇదుగో అమ్మా! ఈ అన్నపుగిన్నె మసి సరిగ్గా వదల్లేదు మళ్లీ తోము ఈ కంచానికి జిడ్డేవదల్లేదు ఏమిషే నీ మొహం తోమటం

పనిమనిషి ఏంటి తల్లీ మళ్లా తోమమంటావు, ఇంత తెల్గా తోమినా?

జానక నేను తోమి చూపెంచుతా

శ్రీ సింగరాజు లింగమూర్తి

జాన ఓ నిమిషం ఆగండి, నేను వెళ్లాక పట్టుకుందురు కాని

దుర్గ అయ్యో! పొయిమీద కూర మాడిపోతుంది మామ్మగారూ, కాస్త పట్టుకోనిద్దురూ

జాన పొయిమీద కూర పెట్టుకోని ఎట్లా వచ్చావమ్మా? కాస్త తాళు మరి, ఈ రెండు గిన్నెల్లో పట్టుకోని వెడతా తర్వాత మీరెన్ని బిందెల నీళ్లైనా పట్టుకోండి

దుర్గ కాస్త పట్టుకోనియ్యండీ, మీకెంతైనా పుణ్యముంటుంది అదుగో పిల్లకూడా ఏడుస్తున్నది ఇంతింత చిన్న గిన్నెల్లోకూడా నీళ్లు పడుతూ కూర్చుంటే ఎట్లా?

జాన నేను ఎన్ని గిన్నెల్లో పట్టుకుంటే మీకేం? మీ సిరేమైనా ఎత్తుకుపోతున్నానా ఏమిషీ?

శాంత [లోపలినుంచి వస్తున్నట్లు గొంతు వినబడాలి] ఇదేమిటం డత్తయ్యగారూ! [స్పష్టంగా వినబడాలి] నలుగురూ వాడుకొనే పంపుదగ్గర పేచీలు పెడుతూ కూర్చున్నారూ? అసలు మిమ్మల్ని నీళ్లెవరు పట్టమన్నారూ?

జాన [ఈసడింపుగా] ఆఁ వచ్చావూ తీర్పుకత్తెవు పోనీ పాపం, పిల్లలతో

శాంత లేకపోతే ఏమిటండీ! కూరలు వండుకునే గిన్నెల్లోనూ, పప్పు గిన్నెల్లోనూ నీళ్లు పట్టడ మ్దేనికి? హాయిగా తిని కూర్చోక, ఎందుకొచ్చిందంట మీకీ లేనిపోని రభస? ఏం నేను నీళ్లు పట్టుకోలేనా? ఒంట్లో ఓపిక లేకపోయినా అన్నిటికీ తయారవుతారు లోపలికి రండి కాస్త చంటదాన్ని ఎత్తుకుందురుగాని

జాన ఆ చంటిదానికి నన్ను చూస్తేనే అసహ్యం కాసేపు కూడా దగ్గరుండదు

దుర్గ ఇక మీరు ఎన్ని నీళ్ళయినా పట్టుకోండి మామ్మగారూ, నేన వెళుతున్నా

జాన హుఁ! ముసలిదాన్ని చూస్తే అందరికీ ఎద్దేవాయే!

శాంత సరే లే. రండి చంటిదాన్ని ఎత్తుకుందురుగాని ఇంకా చాలా పని కావాలి

జాన అది నా దగ్గర ఉండదంటే, తీసుకోమంటా వేమిషే?

శాంత దగ్గర కూర్చోపెట్టుకోని ఆడిస్తే ఎందుకుండదూ? ఒళ్లో ఇరికించికోని, కదలనీయకుండా గట్టిగా పట్టుకుంటే లేతచేతులుకదా, నెప్పిపుట్టి ఏడ్వదుటండీ

జాన అయ్యో నా అమ్మకడుపు

నుండు . కూ వాళ్ళకి ఈ మనుషులు ఎక్కడ దొరుకుతారోగానీ, చేయి అన్చి, గిన్నెను తోమనే తోమరు ఒసేవ్ నీ అమ్మ కడుపుకాల, కాస్త నెమ్మదిగా తోలవ్వే గిన్నెల్ని. ఆ చిందులన్నీ నా మీదే పడుతున్నాయి

పనిమనిషి ఏంటమ్మా తిడుతున్నావ్? పెద్దదానివని మాట్లాడకుండా వుంటే

జానక ఆ సిభడవా! ఇంకా మాట్లాడుతున్నావా?

పనిమనిషి ఏంటమ్మోవ్ మళ్లీ తిడుతున్నావు తిడితే ఒరూరుకుంటారు

[శాంతమ్మ ప్రవేశం]

శాంత నీ కెందుకు నీవు ఊరుకో సత్యమ్మా ఆమెతో ఏమిటి

పనిమ సూడండి సిన్నమ్మగోరూ! నా అమ్మకడుపుకాలా అంటున్నది

జాన రోషం చాలానేవుంది అంత రోషం కలదానివి అంట్లు సరిగ్గా తోమరాదూ!

శాంత చాల్లే ఊరుకోండి, ఎవరైనా వింటే నవ్వుతారు సరిగ్గా తోమకపోతే నిదానంగా చెప్పి చేయించుకోవాలిగానీ తిడుతారుటండీ! తిరిగి వాళ్ళు మనల్ని తిడితే!

జాన ఆఁ మహాలావ్, నీతిమంతురాలివి బయలుదేరావు సిగ్గులేక పనిదాన్ని వెనకేసుకొస్తున్నావా?

[బూట్లచప్పుడు రాజయ్య ప్రవేశం]

రాజయ్య ఏమిటమ్మా గొడవ?

జాన గొడవ కాకేముందీ నేను బ్రతికున్నంతవరకూ గొడవగానే వుంటుంది నేను అందరికీ అలాహమైపోయాను

శాంత ఏమి అనకుండా, ఎంత నోరు నొక్కుకున్నా, మీ అమ్మగారికి ఇట్టె కోపం వస్తుంది ఎవర్నిపడితే వాళ్ళను డీతిడితే ఊరుకుంటారుటం?

రాజ నీకెందుకమ్మా లేనిపోయిందంతా! హాయిగా కృష్ణా, రామా అనుకుంటూ కూర్చోక ఒకరిజోలి నీ కెందుకు?

జాన నే నెవరిజోలికి పోయాను, ఎట్లో వాళ్ళ జోలికి

రాజ పెద్దతనం వచ్చినకొద్దీ నీకు మతి చెడిపోతున్నదమ్మా!

జాన అవును నీవూ, నీ పెళ్లాం, పిల్లలూ మంచివాళ్ళు నేనే చెడ్డదాన్ని ఈ ముసలిది ఎప్పుడు విరగడైపోతుందా అని చూస్తున్నారు నాకెందుకు, నేను వెళ్ళి దుర్గమ్మగారింట్లో కూర్చుంటా

శాంత హాయిగా కూర్చోండి వద్దన్నదెవరు?

రాజయ్య సరే! ఇహ నే వెడతాను శాంతా! వేళైంది

శాంత మధ్యాహ్నం వచ్చేప్పుడు పళ్లేమైనా తెండి

రాజ సరేలే, [వెళ్లినట్లు బూట్లధ్వని]

రెండవ రంగం

[ఆ రోజు మధ్యాహ్నం 12 గంటలకు]

జానకమ్మ నీకేం తెగులొచ్చిందే నా మాట విప్పుతున్నావ్?,

శాంతమ్మ ఏం లేదత్తయ్యగారూ, నా రిబ్బన్ [illegible]తే మీ మాటలో



ఉందేమోనని చూస్తున్నా

జానకమ్మ నీ రిబ్బను నా మూటలో కెందుకొస్తుందే సత్తెప్పాల ముఖమా? అయినా నన్ను అడిగితే యేడనూ, నీవు మూట విప్పటం దేనికి?

కాంతమ్మ మీరు అలిగి దుర్గమ్మగారింట్లో కూర్చున్నారుగా అయినా, అడిగితే మీ కిస్తారా? ఇవిగో! నేను పెట్టుకునే తలపిన్నులు, పిల్లల గోచీగుడ్డలు, బలపాలూ, మేకులూ, కరక్కాయలు ఎందుకండీ, ఇవన్నీ మీ మూటలో? ఇవిగో! నా రిబ్బన్లు కూడా ఉన్నాయి

జానకమ్మ ఏమో, ఏ పిల్లలు పెట్టారో! ఇవన్నీ నేనేం చేసుకుంటా? ఇందుకోసమని నా మీద దొంగతనం కడ్తావా? ఇదుగో, చూశారా దుర్గమ్మగారూ! మా కోడలు నా మీద దొంగతనం వేస్తున్నది రామ రామ! కాస్త మీరైనా చెబుదురూ దీనికి బుద్ధి మరీ గడ్డితింటున్నది

కాంత మీరు దొంగతనం చేశారని నేనన్నానుటండీ? లేనిపోయింది ఏదో ఒక గోల పెడ్తారు

జాన. గోలా? నేను చేసిదంతా గోలానూ, నీవు చేసేదంతా మంచీనా? చూశారా దుర్గమ్మగారూ! నన్ను ఎట్లా ఆడిపోసుకొంచున్నదో? నేను ఒకరి జోలికి పోయేదాన్నా యేమన్నా? ఉత్త పుణ్యానికి నన్ను ఉడికించి తమాషా చూద్దామనుకుంటుంది

దుర్గమ్మ పోనీండి మామ్మగారూ! ఆమె ఏదో పొరపాటున అన్నదిలెండి [నవ్వు ఆపుకుంటూ] అయినా, అదేమిటండీ కాంతమ్మగారూ! పెద్దవారిని అలా అంటారా?

కాంత ఈవిడ పిచ్చిగానీ, లేకపోతే ఇవన్నీ ఈమూటలో ఎందుకు చెప్పండి! ఇదుగో చూశారా! పటిక బెల్లం పొట్లం ఇది తింటే తనకు పడదని తెలుసుకదా, వారినీ వీరినీ బ్రతిమాలి ఎందుకు తెప్పించుకోవాలి చెప్పండి

జాన నా కెవరు తెచ్చిపెడతారు? ఒక్క రాగిడబ్బు కూడా మీరు నా కివ్వరే?

కాంత ఎప్పుడైనా ఖర్మంచాలక ఇస్తే ఇదేగా వరస రహస్యంగా తెప్పించుకొని తినకపోతేనేం? ఈమె కు ఈ పటిక బెల్లంతింటే, ఒంటిమీద స్పృహ ఉండదు దుర్గమ్మగారూ? ఇంట్లో పిల్లలు డబ్బులు ఎక్కడైనా వదిత్తే చాలు, గప్‌చిప్‌గా దాచేసుకుంటుంది మా పెద్దబ్బాయి భీముడికీ, ఈమెకీ ఏం భేదముంది చెప్పండి దుర్గమ్మగారూ! వాడూ ఇలాగే చేస్తుంటాడుగా

జాన అదుగో చూశారా! మళ్ళీ దొంగతనం అంటకడుతున్నది

దుర్గమ్మ ఆ ఏదో మిమ్మల్ని ఉడికిస్తానికి అంటున్నదిలెండి అయినా, ఆమెకేం ఖర్మం కాలిందండీ దొంగిలిస్తానికి? ఇహ పటిక బెల్లమంటారా, ఏదో కాస్త నోటిరోతకు తెప్పించుకుందేమోలెండి

జాన మా అమ్మ! మీరు మంచివారు కాబట్టి సరిపోయింది లేకపోతే విన్నవాళ్లు నిజంగానే ముసల్ది దొంగతనం చేసిందని అనుకోరుటండీ! నా తల్లి నీ మేలు మరచిపోను దుర్గమ్మతల్లీ నీవు నా కూతురితో సమానం!

దుర్గమ్మ అయ్యో ఇదేమిటి మామ్మగారూ, నన్ను కౌగలించుకుంటారేం?

కాంత అబ్బ! ప్రేమ పొలిగిపోతున్నది ప్రొద్దున పంపుదగ్గర ఈ ప్రేమ ఎక్కడికి పోయిందో?

జాన అమ్మ గడుగ్గాయీ!. నన్ను అంతలేసిమాట లంటావా? ఇవాళ్ల నీ ఇంట్లో అన్నంతింటే మట్టితిన్నట్టే జానకమ్మ అంటే పౌరుషంతో పుట్టిందనుకో

[రాజయ్య ప్రవేశించిన ధ్వని]

జాన ఒరేయ్‌ కుర్రాడా! నిన్నేరా! • ఇలా చూడూ నీ ఇంట్లో పచ్చిగంగ కూడా పుచ్చుకోను అమ్మా! అది నన్ను అంతలేసిమాట లంటుందా?

రాజ సరే! ఇది నీకు మామూలేగా! అన్నం మానుకుంటే సోషవచ్చి పడిపోతావు అన్నంతిని నీ ఇష్టం వచ్చినన్ని శాపనార్థాలు పెట్టు

జాన ప్రాణం పోయినాసరే, నేను అన్నం తినను నూరుసార్లు చెప్పినా, వెయ్యిసార్లు చెప్పినా, పెళ్లాన్ని వెనకేసుకురావడమేగానీ, పెద్దదాన్ని తిట్టిపోస్తున్నది కదా, కాస్త బుద్ధిచెబుదామని నీ కుండద్దుట్రా రాజయ్యా! మరీ చవటవై పెళ్లానికి అడుగులకు మడుగులొత్తుతూ కూర్చుంటావా? అందుకే అన్నారు పెద్దలు, పెళ్లాం బెల్లం, తల్లి విషం అని హుఁ! అడ్డాలనాడే బిడ్డలుగానీ, గడ్డాలు వచ్చినతర్వాత బిడ్డలా, నా పిచ్చిగాని

కాంత ఇంటికివచ్చిన వ్యవధి లేదు, పోట్లాటకి తయారు పదండీ లోపలికి

రాజ ఇహ చాల్లే ఊరోక్కవమ్మా! మరీ రెచ్చిపోతున్నావు నీ సంగతి ఎవరికి తెలియదూ, ఊ అంటే తప్పు ఆ అంటే తప్పు ఎట్లాగమ్మా నీతో ఇహ లేచిరా, భోజనం చేద్దాం

[కాస్త నిశ్శబ్దం]

కాంత (నవ్వుతూ) అదేమిటండీ అత్తయ్యగారూ! పట్టుబట్ట చేత్తో పట్టుకొని, మళ్ళీ వెనక్కు దాచుకుంటారేం, నన్ను చూసి హుఁ ఎంతబెట్టు మా భీముడూ ఇంతే దుర్గమ్మగారూ! వాడు అలిగాడంటే, సరదీయలేక మా పుటమారుతుంది

దుర్గ నాగురించైనా, మడికట్టుకుని భోజనం చేయండి మామ్మగారూ!

జాన నాతల్లి నీవు కాబట్టి ఆమాట అన్నావు మా కోడలు కొరివేనైనా అందేమో చూడు ఈ ముసల్ది తినకపోతే తన కేమనుకుంది

దుర్గ: ఆవిడతో లెక్కేమిటి మామ్మగారూ! మీ అబ్బాయిసొమ్ము మీరు తింటున్నారు, మధ్య ఆమె కేముంది? క్షమించండి శాంతమ్మగారూ! ఊ లేవండి మామ్మగారూ!

జాన: నీమాట వినకపోతే కళ్లు పోతాయి! మా అమ్మ బంగారుతల్లివి

మూడవ రంగం

[ఆ రోజు సాయంత్రం]

జాన: ఆయన చచ్చి ఎక్కడున్నారో గానీ, ధర్మరాజువంటివారు మీరు నమ్మితాగో నమ్మరో గాని దుర్గమ్మగారూ? ఆ మహారాజు పల్లెత్తుమాట అనేవారు కాదు అందుకే ఆయనను నెత్తిని పెట్టుకొని పూజించేదాన్ని.

దుర్గ: అలాగా మామ్మగారూ!

జాన: మరేమిటనుకున్నావ్? ఒక రోజున ఏమైందనుకున్నావ్ మా ఇంటి పక్కన ఉండేవారబ్బాయి ప్రతిదినం మా పెరటిలోని తులసిమొక్కలన్నీ పీకి పారేస్తుండేవాడు అక్కడికీ చిన్నపిల్లవాడుకదా అని ఓర్చుంటూనే వచ్చాను కానీ ఎన్నాళ్ళని సహిస్తాం చెప్పమ్మా!

దుర్గ: నిజమే లెండి

జాన: ఒకరోజు ఆపిల్లవాని తండ్రి చూస్తుండగానే, గదమాయించాను ఆయన తమ తప్పని ఊర్కొవచ్చునా?.. ఊహూ!, పైగా 'ఏమమ్మోయ్, పిల్లవానికేం తెలుసమ్మా, అలా గదమాయిస్తావు' అన్నాడు చెప్పద్దూ, నాకు ఒళ్లుమండిపోయిందంటే నమ్మమ్మా? ఆపళంగా, గదమాయించడమే కాదు, చెంప పగలగొట్టానన్నాను ఆ పెద్దమనిషి నన్ను 'నోరుమూసుకో' అన్నాడు నాకు అరికాలిమంట నెత్తికెక్కింది ఆ పెద్దమనిషిని ఫెళ్లున చెంపమీద బలంకొద్దీ కొట్టాను

దుర్గ: ఆయన మీదే చేయిచేసుకున్నారా! ఎంత ధైర్యమండీ! ఆ పెద్దమనిషి ఊరుకున్నాడా మామ్మగారూ?

జాన: ఊరుకోక ఉరిపెట్టుకుంటాడా? సిగ్గుతో తలవంచుకొని లోపలికి వెళ్లాడు

దుర్గ: మీ వారు ఉండగానే కొట్టారా?

జాన: ఆఁ నాకేమన్నా భయమా? అటువంటివాటికి ఆయనేం కలిగించుకొనేవారు కాదు ఒకవేళ కలిగించుకున్నా వద్దంటే ఊరుకుంటారు

దుర్గ: నిజంగా ఆయన ధర్మరాజే మామ్మగారూ!

జాన: సరేకాని దుర్గమ్మగారూ, కాస్త బెల్లంముక్క పెట్టమ్మా! ప్రొద్దుటి నుంచీ మనసు ఊరికే పీకుతున్నది తినాలని మధ్యాహ్నం ఆ పటికిబెల్లం పొట్లం కాస్తా మా కోడలు తీసి ఎక్కడో దాచిపెట్టేసిందికదా

దుర్గ: అయ్యో! ఇంట్లో నిండుకుంది మామ్మగారు! లేకపోతే ఏం భాగ్యం, కాస్త ముక్క ఇచ్చేదాన్నే

జాన: పోనీ, కాస్త చక్కెరన్నా పెట్టమ్మా! నోరు అసహ్యంగా ఉంది

దుర్గ: అది కూడా అయిపోయిందండీ ప్రొద్దుట కాఫీలోకి లేక మీ కోడల్నే బదులడిగా

జాన: సరే అయితే వస్తా మీ వారు వచ్చేవేళ్ళ అయినట్టుంది

దుర్గ: ఆఁ

నాల్గవ రంగం

[ఆ రోజు రాత్రి 12 గంటలకు]

జాన: ఉష్! అబ్బ! ఈ దిక్కుమాలిన తేలు నా ప్రాణానికి ఎక్కడ దాపురించింది భగవంతుడా?

[కాస్త నిశ్శబ్దం తర్వాత]

అమ్మ బాబోయ్! తేలు కాటేసిందర్రోయ్! [బాధతో ఏడుస్తుంది]

రాజ: [ఆవులించి] ఏమిటమ్మా! ఎక్కడ కుట్టింది తేలు?

జాన: [బాధపడుతూ] దొడ్లోకి వెడితే అక్కడ ఈ రెండు చేతివ్రేళ్ళకీ కుట్టిందిరా తండ్రీ!

శాంత: చేతివ్రేళ్ళకి ఎట్లా కుట్టింది అత్తయ్యగారూ?

జాన: ఎలా కుట్టిందేమిటి నీ తలకాయ ప్రశ్న? [బాధపడుతూ] మొదలేమైనా మందు వేయరా బాబూ! అబ్బ అమ్మ చచ్చిపోతున్నారా తండ్రీ!

రాజ: ఉండు పెట్టెలో ఒక కుప్పె ఉండాలి చూస్తాను

[కొంత నిశ్శబ్దం]

రాజ: వంటఇంటి తలుపు వేయలేదుటే శాంతా?

జాన: వేయకపోవడమేమిటండీ? నేను పడుకోనేటప్పుడు ఒకసారికి రెండు సారు చూసి మరీ పడుకున్నా. [లోపలికి వెళ్లినట్లు ధ్వని]

రాజ: మరి తలుపెవరు తీశారంటావు?

జాన: ఏమో? [రహస్యంగా] ప్రొద్దుటి నుంచీ బెల్లంముక్క పెట్టమని మీ అమ్మ దుర్గమ్మగారిని వేధించిందట పాపం! ఒకవేళ ఉండబట్టలేక, అంతా పడుకున్నారుకదా అని, బెల్లంముక్కకోసం వంటింట్లోకివచ్చి తిరగమోతలుడబ్బాల పెట్టె సొలుపులో చేయిపెట్టిందేమో, అక్కడే తేలుకుట్టిందనుకుంటా! దొంగతనం బైటపడుతుందని ఇవతలికి వచ్చి కేకలుపెట్టింది

రాజ: అంతే అయిఉంటుంది

జాన: ఏమర్రోయ్! నా మొరేమైనా ఆలకిస్తారా లేదా? అబ్బ! ఇస్! . అబ్బ! మీ మాటలు తర్వాత మాట్లాడుకోవచ్చులే, మొదలు మందు తేరాకూడ్రాడా!

రాజ: పెట్లో మందు కనబడలేదమ్మా!

శాంత: చేసుకున్నందుకు అనుభవించండి! ఆ వంటింట్లోకి పోకపోతే తేలు కుట్టేది కాదుగా

జాన: ఏదో నోటిరోతకోసం ఉండలేక వెళ్లానేమో, అక్కడే కుట్టింది శాంతమ్మతల్లీ!

రాజ: ఆమె అసలే బాధపడుతూంటే, మధ్య నీ డప్పి పాడుపులేమిటే [నవ్వుతూ] నా చిన్నప్పుడు మధ్యాహ్నం పూట నీవు పడుకొనివుంటే, నేను వంటింట్లోకి సెనగపప్పుకోసం వెళ్లానని కొట్టావు కాదమ్మా! ఇప్పుడే వస్తానమ్మా! అవతలి వీధిలోని సోమసుందరాన్ని పిలుచుకొనివస్తా ఒక్క మంత్రం వేశాడంటే ఇట్టే తగ్గిపోతుంది!

శాంత: తొందరగా రండి

జానకి: చెప్పులు వేసుకొని వెళ్లరాకూడ్రాడా! ★

పెద్దకథ

అపశ్రుతి

శ్రీ యన్ ఆర్ నంది

అరుగుమీద జానకిని చూసి, మెట్లెక్కుతున్నవాడల్లా కళ్లెం వేసినట్టు ఆగిపోయి అలానే ఆమెకేసి తేరిపారచూస్తూ వుండిపోయాడు జానకి చిరునవ్వునవ్వుతూ బుచ్చిబాబు దగ్గరగా వచ్చి అంది

"అలా తేరిపార చూస్తావేం, నేనే జానకిని"

"అవును నువ్వేలే— కాని ఎక్కణ్ణుంచని ?"

"తర్వాత చెప్తా, ముందు లోపలికి రా"

బుచ్చిబాబు ఆతృత తగ్గలేదు మళ్లా అడిగాడు "నువ్వొక్కదానివేనా లేక శేఖరం గూడా వచ్చాడా ?"

జానకి సమాధానం చెప్పకండా లోపలికి రెండడుగులు వేసింది ఇంకా బుచ్చి మెట్లమీంచి పైకి రాకపోవడంతో మళ్లా వెనక్కి తలతిప్పి "బ్యాంక్ లెక్కల్లో బుర్ర పాగుజేసుకొని యిప్పుడే వస్తున్నట్టున్నావ్ లోపలికి ముందొచ్చి స్నానం చెయ్ తర్వాత సావకాశంగా కూచోని విందువుగాని" అంది

లోపల ఎలాంటి దుగ్ధ వున్నప్పటికీ, బుచ్చి అప్పటికిక మాట్లాడలేక, ఆమె ననుసరించి లోపలికి వెళ్లాడు

స్నానానికి నీళ్లుతోడి నూతిదగ్గర జానకే స్వయంగా పెట్టింది బుచ్చి వచ్చాడు స్నానం చేస్తున్నంతసేపూ యిదే ఆలోచన, కనీసం ఉత్తరమన్నా లేకండా జానకి యింత అగస్మాత్తుగా వచ్చేసిందేమని! ఊహించగలిగినంతవరకు వూహాగానం చేశాడు కాని లాభం లేకపోయింది

స్నానం పూర్తయినతర్వాత బుచ్చి లోపలికి వచ్చాడు భోజనం గూడ జానకి స్వయంగా పెట్టింది అప్పుడే పక్కింటి నించి వచ్చిన తల్లి గుమ్మందగ్గర నిలబడి, వడ్డిస్తున్న జానకికేసి చూస్తూ వుండిపోయింది బుచ్చి భోజనానికి వుపక్రమించాడు జానకివచ్చి స్టూలుమీద కూచొంది తల్లిదృష్టి మాత్రం జానకిమీదే వుంది కాని జానకి మాత్రం ఎవరినీ చూడలేదు తెల్ల గోడకేసి చూస్తు మూగప్రతిమలా వుండిపోయింది సరిగా ఆ సమయానే ఎందుకో ఆమె కళ్ళనించి నీళ్ళు సన్నగా తిరిగాయి

"ఎందుకే ఆ చేతగాని యేడుపు? చెప్పేదేదో సరిగా చెప్పు"

గుమ్మం దగ్గరనించి తులసమ్మ మాటలు వినిపించేసరికి, బుచ్చి చప్పున తలెత్తి యిద్దరికేసి చూశాడు కాని దృష్టి జానకి మీద పడేసరికి ఆ దృష్టీ, ఆ తెరచిన నోరూ అలానే కాసేపటివరకు వుండిపోయాయి

కళ్ళనించి ఝల్లున రాలిన కన్నీటి బొట్లని, చీరచెరగుతో తుడుచుకుంటూ జానకి— "అవునమ్మా నాకు దేవుడు ఏడుపే రాశిపెట్టాడు" అంది అస్పష్టంగా

తల్లికి ఆవేశం ఆగింది కాదు గడప యివతల కాలితో పెద్ద ధ్వని చేస్తూ "దేవుడు కాదు నీకు రాశి పెట్టింది, మనుషులే ఈ మనుషులకి కావలసినంత బుద్ధీ, జ్ఞానం వుండిగూడ మూర్ఖులైపోతారు వాళ్ల మీద పడి ఏడవక, ఎవరో, ఎవరో అంటూ ఏడుస్తావేం!" అని అరచింది

"అసలు ఏమయిందో చెప్పకండా ఈ రాద్ధాంత మేమిటి ?" చిరాకుగా బుచ్చి అన్నాడు

తల్లి తోకతొక్కిన తాచులా బుసలు కొట్టింది "చేసిన ఘనకార్యానికి సిగ్గుపడకండా ఏమిటీ చిరాకులు?—"

పరిస్థితి చాలావరకు పోతుందని జానకి స్టూలుమీంచి లేచి ఛప్పున తల్లి నోరు మూసేసింది అయినా తులసమ్మ మండిపోతున్న గుండె చల్లారలేదు జానకి యిటు బుచ్చికేసి చూసింది అతని ముఖంలో రంగులు మారటం కనిపెట్టి అతని ప్రశ్నకి సమాధాన మిస్తున్నట్టు అంది

" నేను ఆ యిల్లు వదలి వచ్చేశాను బుచ్చీ"

"హాఁ" అన్నాడు ఆశ్చర్యంగా

"అవును, ఇంకెప్పుడూ ఆ గడప తొక్కనని వచ్చేశాను వాళ్ళతో మన కిక ఎలాంటి సంబంధమూ లేదు"

తను భోంచేస్తున్నట్టే మరచిపోయాడు బుచ్చి ఎత్తినముద్ద అలానే వుండిపోయింది గుండె తీవ్రంగా కొట్టుకొంటోంది కళ్ళల్లో, ముఖంలో మచ్చుకో నెత్తురు చుక్కైనా లేదు!

"అవును బుచ్చీ, నన్ను చీకట్లో తోసేశారు కళ్లు కనిపించక అందులో నా శక్తికొద్దీ దేవులాడాను, కాని లాభం లేకపోయింది విరక్తిపుట్టి అట్టడుగున పడిపోవాలనుకున్నాను కాని పాదాలకి అడుగ దొరకలేదు వెలుతురు కోసం తలెత్తితే-

చివరికి నాకు కనిపించింది యిదొక్కటే దారి"

ఈమాటల్ని కతల్లి సహించలేకపోయింది చేతుల్లో కూతుర్ని ఒక్క తోపు తోసేసింది

"ఛీ! ఏ ముఖంతో ఎవరింటికి తల దాచుకోడానికి వచ్చావ్? ఎవరిల్లే యిది? ఫో- ఆ గోదాట్లో పడు"

జానకి తల్లిదగ్గరికి వచ్చి విసురుగా అంది "ఎందుకమ్మా నీకాకోపం? బుచ్చిమాత్రం నాకు పెళ్లి చేసేప్పుడు, చివరికిలా జరుగుతుందని కలకొంచాడా? తనకి తెలిసుంటే, చెల్లెల్ని యిలా పీక పిసకడానికి ఒడిగడతాడా?"

"చెల్లెలు, ఎవరికి!" వెటకారంగా ఆ మాటల్ని వుచ్చరించి, ఊర్ధ్వస్వరంతో "ఎవరికే చెల్లెలివి? నువ్వతగాడి స్వంత చెల్లెలివైతే నీ పీక చూస్తూచూస్తూ కోసేస్తాడా?" అరచింది

జానకి తల్లి నోరు మూసేసింది "పోనీలే అవన్నీ యిప్పుడెందుకు వూరుకోండూ" అంది ప్రాధేయపడుతూ

తులసమ్మ వూరుకోలేదు గొంతుక మరింత పెద్దదిచేసి ఉరిమింది "ఇహ వూరుకోకపోతే వురెట్టుకొంటానా ఆ వాళ సంబంధం తెచ్చినపుడే నేను వద్దన్నాను- పోనీ, అప్పుడు నేనెవర్తిని, ఈ యింట్లో గులాంలా, దాసీముండలా వచ్చాను, కాని మీ నాన్నగారు కూడా వద్దని శతపోరు పెట్టారు విన్నాడా ఈయనగారు? ఎంతో తనమాటే వెల్లాలనే పంతంతో నన్ను కాదని ఆ త్రాపిముఖాలతో ఈ సంబంధం కుదిర్చాడు"

"పోనీమ్మా, అవన్నీ ఎందుకు తవ్వడం"

"తవ్వడమా? కడుపులో గరళం మండిపోతుంటేను నేను ఆ వేళే చిలక్కి చెప్పినట్టు చెప్పాను మన హోదాకు వాళ్లు సరిపడరని, మనకీ వాళ్ళకీ చుక్కెదురని వింటే కదూ? అన్నా, నా మాటమీద నిలబడవలసినవాళ్లు, వీళ్ళా ఎదిరించడమని పంతానికి మరి కట్టబెట్టాడు"

ఇక లాభంలేక జానకి తల్లి చేతులు పట్టుకొని లోపలికి తీసుకవెళ్ళబోయింది

ఇంతలో జోళ్లు చప్పుగు చేసుకొంటూ పంతులుగారు వచ్చారు వస్తూనే "ఏమిటోయ్, మీ అరుపులు గోదావరి గట్టువరకూ వినిపిస్తున్నాయ్ అంత అరవవలసినంత రాపిడివిషయం ఏమిటో నాక్కూడా కొస్త వినిపిస్తరూ"అంటూ భార్య పక్కనున్న పిల్లను చూచి, ఛప్పున గుర్తు పట్టలేక దగ్గరగా వచ్చారు ఆమెను ఆపాదమస్తకం పరీక్షగా చూసి—

"అరే! నువ్వా తల్లీ! ఎప్పుడు రావడం! శేఖరం ఏడి? అందరూ కులాసాయేనా?" ఒక్కసారిగా ప్రశ్నలవర్షం కురిపించారు

జానకి నించి సమాధానం లేదు అర్ధాంగి మాత్రం రాద్ధాంతం చేస్తూ సమాధానం వెటకారంగా యిచ్చింది "ఈ ముద్దులుకూతురికి తోడుగా మరో మనిషి కూడానూ! ఎందుకు? అసలు ఏ ముఖంతో ఎవర్ని చూడానికి రావాలి? ఒంటరిగానే శాశ్వతంగా వుండిపోడానికి వచ్చిందట ఎవరిక్కడ వున్నారనో! ఎవరు దీన్ని పోషిస్తారనో!"

పంతులుగారికి భార్య చిందులు అర్థంకాలేదు 'కాసేపు కూతురుకేసి, ఆమె కేసి చూశారు ఇంతకీ వీళ్ళ కోపాలు అర్థంగాక అడిగారు "అసలింతకీ ఏంజరిగిందో చెప్పకండా ఈ దుమార మేమిటే?"

ఈసారి తులసమ్మ నోటినుంచి నిప్పులు రాలాయి ఇది రాజీ వెంటనే యిల్లంతనీ నానా పాడూ చేసేస్తుందని భయపడింది తండ్రి చెయ్యి పట్టుకొని అవతల గదిలోకి తీసుకపోయింది

"అసలు విషయం ఏమిటి తల్లీ?"అనడిగా రాయన

"తర్వాత చెప్తాను వూరుకోండి నాన్నా అమ్మ సంగతి మీకు తెలిసిందే కదా"అని ఆయన్ని అక్కడే వుంచి, తిరిగి ఈ యింట్లోకి వచ్చింది

బుచ్చి లేడు! పెట్టన అన్నమంతా విస్తట్లో అలానే వుండిపోయింది తల్లి చిరాకు, కోపం యింకా ఉపశమించలేదు

బుచ్చిని తలచుకొనేసరికి జానకికి కళ్ళనీళ్లు తిరిగాయి కోపంగా తల్లిదగ్గరకు వచ్చింది

"సరా! నీ కడుపు నిండిపోయిందమ్మా?— భోజనం పెట్టి ఎదురుగా నానా? మాటలూ అంటె యిహ వాళ్ళకా ముద్ద ఏం సయిస్తుంది?"

"సయించడమా? నా కూతురు గొంతుక పిసికి, నా గుండెల్లో ఆరని చిచ్చుపెట్టిన అతగాణ్ణి "

"సరేలేమ్మా, చాల గొప్పపని చేశావ్ క ఇందులో అసలు విషయాన్ని తెలుసుకోకండా నీయిష్టం వచ్చినట్టు కోపంతో వున్న వాళ్ల మీద విరుచుకుపడుతున్నావ్ అసలిందులో బుచ్చిదేం తప్పుంది? ఆ కొంపలో యిహ వుండలేక నా మటుకి నేను వచ్చేశాను గాని—"

కూతురు కంఠంలో వణుకు వినేసరికి, యింకా తులసమ్మనోటినించి రాలవలసిన పిడుగులు అలా నేచల్లబడిపోయాయి. ఈసారి తలతిప్పి కూతురిని మందలిస్తున్నట్టు అంది·

"నువ్వు అసలు మర్మం తెలుసుకోలేక అపోహ పడుతున్నావమ్మా ఆవాళ ఈ సంబంధం తీసుకవచ్చినపుడే నేను చెప్పాను కాని అతగాడి మాట ఎదిరిస్తామా అనే పంతంకొద్దీ ఆ గోతిలో నిన్ను తోసేశాడు నీమీద అతనికి కొద్దిగానైనా ప్రేమ వుండి వున్నట్టయితే, ఈ విషయమే ఆలోచించు కట్నం దగ్గర వచ్చిన పేచీకి రాజీపడి తల ఒంచుకొంటాడా?"

ఉండగా వుండగా తల్లిస్వరం హెచ్చిపోతోంది తను ఈ సమయంలో ఏం చెప్పినా తల్లి సరిగా వినిపించుకోదు అవ

న్నగారి మనస్సుకూడా కలత చెందుతుందని తల్లి చేతులు పట్టుకొని "పోనీ, కాసేపు వూరుకోమ్మా ఈ విషయాలన్నీ చెప్పి నాన్నగారిని బాధించొద్దు" అంటూ లోపలికి తీసుకపోయింది

చీకటి పడింది ఎవరిమటుకు వాళ్ళు భోజనాలు చేసి పక్కలు వేసుకొన్నారు పదకొండు వేశారు ఒక్కొక్కరు నిద్రాముద్రితులవుతున్నారు కన్ను యిలా మూయకండా సతమతమవుతున్న జీవి ఒక్క జానకి మాత్రమే ఇంకా బుచ్చి రాలేదు ఎక్కడికి వెళ్ళిందీ అంతుచిక్కటం లేదు ఆఫీసునించి వచ్చి విస్తరిముంగు యిలా కూచొనేసరికి, తనెంతో మునిగిపోతున్నట్టు కంట తడి పెట్టుకొంది అది చూసి అమ్మ మరింత రెచ్చిపోయింది అసలే బుచ్చి మనస్సు కోమలమైంది ఈ మాటలకి పూర్తిగా వికలమై, ఆకలితోనే లేచి వెళ్ళిపోయాడు

ఆలోచించే కొద్దీ జానకిమనస్సు తన బాల్యజీవితంకేసి పోతోంది అప్పుడు బుచ్చి, తను ఒక్క కడుపున పుట్టినట్టే తిరిగేవారు తనకీ బుచ్చికీ ఎనిమిదేళ్లు తేడా అతనికి కాస్త ఊహ తెలుస్తున్న సమయానే తల్లి పోయింది తల్లి పోవడం అతనికి బాగా తెలుసు నాన్నగారు రెండో పెళ్లి చేసుకొన్నారు ఈ కొత్తగా వచ్చిన స్త్రీని అప్పటికే తన తల్లి కాదని తెలుసుకొనే వయస్సులోకి వచ్చేశాడు బుచ్చి అమ్మా అని పిలవడానికి సంకోచించేవాడు పిన్నీ అని అప్పుడప్పుడు పిలిచేవాడు తను స్కూల్ ఫైనల్ పాసయ్యేసరికి వయస్సు పదిహేను సంవత్సరాలు

ఇంతలో అడుగులచప్పుడు వినిపించింది కళ్లు పెద్దవిచేసి చూసింది బుచ్చి మాటాడకండా లోపలికి వెళ్లిపోయాడు జానకి పరుపుమీంచి లేచి తనూ లోపలికి వెళ్లింది కాని ఏమీ మాటాడలేక అతని వెనకనే వుండిపోయింది చివరికి ధైర్యం చేసి—

"భోంచెయ్యకండా వెళ్లిపోయావ్!" అంది

బుచ్చి మాటాడలేదు

"నీకోసం పాలుంచాను అవి కాస్త"

"వద్దు"

జానకి ఆగిపోయింది క్షణంసేపు నిశ్శబ్దంగా వుండి, ఒక గుటకవేసి మెల్లగా అంది

"కోపమా బుచ్చి?"

"కోపం ఎందుకు?"

"ఇందాక అమ్మ ఏదో అందని"

ఆమె మాట పూర్తి గాకండానే బుచ్చి వెనక్కి గిరుక్కున తిరిగాడు ఏదో అనాలని నోరు తెరిచాడు గాని, మాటలు నోటినుంచి పెగలేదు జానకే అంది

"బుచ్చి! అమ్మసంగతి నీకు తెలియంది కాదు అప్పటికేదో పిచ్చిగా మాటాడుతుంది గాని, దాని మనస్సులో ఎలాంటి కోపమూ వుండదు సాయంకాలం ఆతృత కొద్దీ ఏదో అనేసింది—కాని నా బాధ తనకేం తెలుసు? అది పట్టుకొని పెట్టిన అన్నాన్ని అలానే వదిలి లేచిపోయావ్!"

బుచ్చి ముఖం వివర్ణమైపోయింది సగం మాటల్ని మింగేస్తూ—"అదికాదు జానకి'

"అదీ కాదు యిదీ కాదు ముందా పాలు తాగు"

కాదనలేకపోయాడు జానకి గ్లాసులో పాలు తెచ్చియిచ్చింది మెల్లగా చెయిచాచి గ్లాసు అందుకొని జానకి కేసి చూశాడు మరి ఆ దృష్టిలో ఏం విద్యుత్తు ప్రసరించిందో, గడగడ తాగేశాడు ఖాళీ గ్లాసు తీసుకొంది జానకి అక్కణ్ణించి గ్లాసు తీసుకొని వెళ్లిపోతుందని ఆశించాడు గాని ఆమె అలానే వుండిపోయింది చాలసేపటివరకూ యిద్దరిమధ్యా నిశ్శబ్దమే నిరంకుశపరిపాలన చేసింది డ్రాయరు నానుకొని జానకి, కుర్చీమీద కూచొని బుచ్చి మూగప్రతిమల్లా వుండిపోయారు చివరికి జానకి ఒక నిట్టూర్పు విడచి అంది

"ఇందులో నీ తప్పు వుందని నేను అనలేను బుచ్చీ శేఖరం నీ స్నేహితుడని, ఏవో కొన్ని ఉన్నతభావాలు వున్నవని, నువ్వు ఆవాళ నాతో మాటల సందర్భాన చెప్పావు చదువుకొన్న దానవని, నామీద నీకున్న ప్రేమవల్ల అతన్ని పెళ్లాడితే నిజమైన సుఖం నాకు లభిస్తుందనీ అన్నావ్ అప్పటికి నాకు పెళ్లిళ్ళమీద ఎలాంటి అభిప్రాయాలూ లేవు కనీసం ఆయన్నైనా నేను చూసి ఎరగను ఎంత చదువుకొన్నప్పటికీ నా పెళ్లిమాటలు మాత్రం తల్లిదండ్రుల్లోనే జరిగి, నిశ్చయమైపోయాయి అమ్మ ఏదో ఆటంకపరచానంటుందిగాని నాకు నమ్మకం లేదు చివరికి అందరిలానే పెళ్ళయింది అత్తవారింట్లో అడుగు పెట్టాను ఒక ఏడాది వరకూ నాకు ఎలాంటి విరక్తి పుట్టలేదు తర్వాతే ప్రతీ విషయం నన్ను బాధించ మొదలుపెట్టింది

జానకి ఆగింది చేతిలో గ్లాసు బరువుగా తోచిందో లేక మాటలురాక యధాలాపంగా ఆ గ్లాసుకేసి చూసిందో—దాన్ని డ్రాయరు మీద వుంచి గడియసేపు దాన్నే చూస్తూ వుండిపోయింది తర్వాత ఒక నిట్టూర్పు విడుస్తూ అంది

"శేఖరం వ్యక్తిగతంగా చాల గొప్పవాడే ఉన్నతభావాలు కలవాడే కాని ఆయనలో సాహసం లేదు ప్రతి చిన్న విషయానికి కోపిష్టి ఐపోతాడు దాంతో ఎక్కడ "వీక్ పాయింట్" వుంటుందో అక్కడ తన అక్కసుని తీర్చుకొంటాడు ఆ సమయంలో తను మనిషిననే ఇంగితజ్ఞానం లేకండా పశువులా ప్రవర్తిస్తాడు అప్పుడే అగ్గికి ఆజ్యం తోడవుతుంది"

బుచ్చిబాబు నోట మాటలేదు ఆమెకేసి చూస్తూ వుండిపోయాడు విషయాన్ని అవగాహన చేసుకోవాలని తాపత్రయపడుతున్నాడు గాని, భావోద్వేగం మాత్రం మనఃశక్తుల్ని విసిరికొడుతోంది


"నేనూ చదువుకొన్నదాన్నే నన్ను స్కూళ్ళకి పంపి, బయట మనుష్యుల్ని, ప్రదేశాలని కాస్తో కూస్తో అర్థం చేసుకొనేంత జ్ఞానాన్ని నాకిచ్చారు కాని మగవాళ్లు ఎంతచదువుకున్నా, ఆడది వంటింటి కుందేలనే భావంతోనే "ట్రీట్" చేస్తున్నారు"

జానకి కళ్లు తుడుచుకొని మళ్లా ప్రారంభించింది

"ఇలాంటి పరిస్థితుల్లో నాన్నగారు నన్ను ఎందుకు చదివించారో! ఎలాంటి జ్ఞానం లేకండ, పాకీవాళ్లలా, బురద పందుల్లా నన్నూ పరదాల వెనక వంటలక్కలా పెంచివుంటే—ఈ వాతావరణాల్లో పెరిగే పురుషులకి అడుగులకి మడుగులొత్తుతూ 'ఇల్లాలు' జీవితాన్ని గడిపి వుండేదాన్ని—"

ఈ కటువైన పదజాలాన్ని బుచ్చి వినలేక "జానకి" అంటూ వారించాడు

(47-వ పేజీ చూడండి)



సంధ్యాక్రీడ

రచన శుభశ్రీ

★

రండోయి! బాలలూ ఆడుకుందాము,
తెల్లనిమల్లెలు పూచేటిచోట,
చల్లనిగాలులు వీచేటిచోట,
పచ్చని పచ్చిక మొలచినచోట,
కోయల'కూ'యని కూసేటిచోట,
పిల్లలంతాచేరి ఆడుకుందాము,
రారండు! బాలలూ ఆడుకుందాము.

* * *

మాబావ తెచ్చాడు ఈ రైలుబండి.
మానాన్న యిచ్చాడు ఈ చిన్నబొమ్మ,
మా అమ్మ యిచ్చింది ఈ లడ్డువుండ;
మాఅక్క యిచ్చెను ఈ పూలబుట్ట,
మా అన్న తెస్తాడు మామంచిబంతి,
మా తమ్ముడేడ్చును ఇవన్ని చూసి.
రండోయి! బాలలూ ఆడుకుందాము.

హాయిగా పాడుతూ ఆడుకుందాము,
రా - చెల్లెలూ మనము ఆడుకుందాము,
ఆడుకుందామమ్మ ఆడుకుందాము,
మన తోటలో మనము ఆడుకుందాము,
దాగుడుమూతలు ఆడుకుందాము,
చల్లగా మెల్లగా పాడుకుందాము,
రారండు! బాలలూ ఆడుకుందాము.

* * *

పక్షులు 'గూళ్ళ'కు చేరునందాక!
'అంబా'ల అమ్మలువచ్చేటివరకు!
మనఅమ్మ మనలను పిలిచేటివరకు!
మననాన్న యింటికి వచ్చేంతవరకు!
ఆడుకుందామోయ్! ఆడుకుందాము.
రండోయి! బాలలూ ఆడుకుందాము.
రారండు! బాలలూ ఆడుకుందాము.

★

జంతువులు



తాబేలు

కుందేలుతో పరుగుపందం వేసి నేనే గెల్చాను.

మెట్టతాబేలు.

ఈ తాబేళ్లకు నేలమీద నడవటానికి తగిన కాళ్లుంటాయి అతి సాధువులు, ప్రశాంతంగా వాటి మానాన అవి బతుకుతాయి ఇవి చాలాకాలం బతకగలవు 150 ఏళ్లు బతికిన తాబేళ్లుకూడా ఉన్నాయట. నీళ్లు తాగవలసి వచ్చినప్పుడు నీళ్ల కోసం వెదుక్కుంటూ రాత్రిం బగళ్లు ప్రయాణం చేస్తాయట. వీటి వేగం ఎంతో తెలుసా? నిమిషానికొకగజం అంటే గంటకి 60 గజాలు! ఆడతాబేలు ఇసుకలోపల గుడ్లు పెడుతుంది. ఈగుడ్లు తెల్లగా గుండ్రంగా, రాతివలె గట్టిగ ఉంటాయి.

కొండచిలువ


భారత దేశంలోని కొండ చిలువలు ప్రపంచంలోకల్లా పెద్దవి 30 అడుగులదాకా పొడుగు పెరుగుతాయి ఈపాము ఎంత పెద్ద మృగానైనా చుట్టచుట్టి నొక్కి నొక్కి చంపగలదు మృగం చచ్చిపోయాక తలతో మొదలుపెట్టి క్రమంగా శరీరాన్నంతా మింగేస్తుంది నమలటం వగైరా ఏమీ లేదు ఇక తరవాత ఆహారం జీర్ణమయ్యేదాకా ఏ చెట్టుకో చుట్టుకుని మత్తుగా ఉంటుంది అప్పుడు కదలా లేదు, మెదలా లేదు. మామూలుగా కుందేళ్లు, చిన్నచిన్న దూడలు, జింకలు దీని కాహారం. కాని దీని కౌగిలింతలోచిక్కిన ఎంత పెద్ద మృగమైనా విడిపించుకో గలగటం వట్టిది.



కొండచిలువ

అమ్మో, ఎంత పెద్దపామో!

పక్షులు




బెగ్గరు కొంగలు

కొంగలు

ఇవి చాలా సామాన్యమైన పక్షులు ప్రపంచంలో చాలా దేశాల్లో ఇవి కనిపిస్తాయి చేపలు, కప్పలు, చిన్న చిన్న పాములు, పురుగులు వీటి ఆహారం గుంపులు గుంపులుగా జీవిస్తాయి ఎగిరేటప్పుడు కాళ్లు వెనక్కి, మెడ ముందుకు ఒకే రేఖలో చాచి ఎగురుతాయి చాల ఎత్తున ఎగరగలవు వీటికికూడా వికృత నృత్యాలు చేసే అలవాటున్నది ఇవి 15 నుండి 36 ఏళ్లవరకూ జీవించగలవు

బెగ్గురుకొంగ

ఈకొంగ ఇండియా, బర్మా, మలయా, ద్వీపకల్పాలలో కనిపిస్తుంది దీని తల, మెడ బోసిగా వుంటాయి బట్టతలగల ముసలివాడి వలె వుంటుంది చూట్టానికి రాబందులు, గద్దలు మొదలైన పక్షులతోపాటు ఇదికూడా శ్మశానాలలో కనిపిస్తూంటుంది పెంటకుప్పల్ని పరీక్ష చేస్తూనో, బురద గుంటలు, మడుగులు కెలుకుతూనో తరుచు కనిపిస్తుంది దీనికి ఆకలి ఎక్కువ కడుపు పట్టుతుందా లేదా, మింగుడు పడుతుందా లేదా, అని ఆలోచించకుండా ఆబకొద్దీ సీమ కుందేళ్లను, కోళ్లనుకూడా మింగాలని చూస్తుంది.



మామూలు కొంగ



(బొమ్మలు వాల్ట్ డిస్నీ ప్రొడక్షన్స్,
ఆర్ కె ఓ రేడియోవారి సౌజన్యంతో)

జరిగినకథ :

మాకు బ్రిస్టల్ నగరసమీపంలో ఒక హోటల్ ఉంది ఒకరోజున మా హోటలుకు 'బిల్' అనే సముద్రపుదొంగ తనతోటి దొంగలనుండి తప్పించుకుని పారిపోయివచ్చాడు అతడు మా హోటల్లో ఉన్నాడని మిగతా దొంగలకు తెలిసి, అతన్ని చంపేస్తామని బెదిరించారు అతడు ఆ బెదిరింపుకే భయపడి చనిపోయాడు . అతనిపెట్టెలోనే మాకు కాంచనద్వీప పటం దొరికింది ఆపటాన్ని మా డాక్టరుగారికి, జమీందారుగారికి చూపాను వెంటనే అక్కడి ధన నిక్షేపాలు సంపాదించే ఆశతో అక్కడికి ప్రయాణమయ్యాము జమీందారుగారొక ఓడను సిద్ధం చేశారు స్మాలెట్ అనే అతన్ని కెప్టెనుగాను, లాంగ్ జాన్ సిల్వర్ అనే వాణ్ణి వంటవాడుగాను కుదిర్చారు సిల్వర్ అసలు సముద్రపు దొంగల్లో వాడే అయినందున, మిగతాకళాసులందరితో కలిసి మమ్మల్ని చంపడానికి పెద్దకుట్ర పన్నాడు ఆకుట్ర నెదుర్కోటానికి మేము ఎదురు సన్నాహాలు చేసుకున్నాం ఇంతలో కాంచనద్వీపం చేరాము ద్వీపంలో నేను ఒంటరిగా తిరుగుతుండగా బెన్ గన్ అనే అడవిమనిషి కనిపించాడు తన్ను తిరిగి ఇంగ్లండుకు ఓడలో తీసుకుపోయేట్లయితే గుప్తధనమంతా మాకిచ్చేస్తానన్నాడు. నేను నామిత్రులతో ఈ విషయం మాట్లాడతానని వాగ్దానం చేశాను ఈలోగా నా మిత్రులు అవసరమైన సామగ్రి అంతటితోను ఓడను వదిలి ద్వీపంలోవున్న మట్టికోటను ఆక్రమించుకున్నారు అక్కడవాళ్లనికలుసుకున్నాను ఆమర్నాడు కుట్రదారులు మట్టికోటను ముట్టడించారు నామిత్రుల్లో ముగ్గురు,శత్రువుల్లో పలువురు చనిపోయారు కాని చివరికి విజయం మాకే లభించింది శత్రువులు పారిపోయారు

25 ఇజ్రాయెల్ హాండ్స్

గాలిపాటు అనుకూలంగా ఉన్నందువల్ల మా ఓడ ద్వీపం పడమటితీరం వెంబడే ఉత్తరంగా ప్రయాణం చేసింది ఉత్తర సింధుశాఖను సమీపిస్తున్నాము. సరంగు ఇజ్రాయెల్ ఎప్పటికప్పుడు నాకు ఇచ్చే సలహాలనుబట్టి ఓడను నేనే ఎక్కువభాగం నడుపుతున్నాను.

"కెప్టెన్!" అన్నాడు హాండ్స్, సరంబీమీదనే ఉన్న రెండోకళాసీ శవాన్ని చూపుతూ. "ఓబ్రియన్ ఎల్లాగూ చావనే చచ్చాడు వాడిశవం కూడా ఇక్కడెందుకండి దిష్టిబొమ్మలాగ. కాస్త ఎత్తి సముద్రంలో పారేస్తారా?"

"నేనా? అంతబరువు మొయ్యలేను, అదీగాక నాకు శవాల్ని మొయ్యటం అలవాటులేదు. అక్కడే ఉండనీదాన్ని," అన్నాను

"ఇంత దరిద్రపుఓడ నెప్పుడూ చూడలేదండి కెప్టెన్! మనం బయల్దేరిన వేళా విశేషమేమిటో గాని ఈహిస్పానియోలా మీద చాలామంది కళాసీలు పాపం చచ్చి పోయారండి ఒకమాట అడుగుతాను కెప్టెన్! ఈ ఓబ్రియన్ చచ్చిపోయాడు కదా! నిజంగా అంటే, పూర్తిగా చచ్చి పోయాడంటారా? లేకపోతే దెయ్యమై మళ్ళీ వస్తాడంటారా? మీరు చదువుకున్నారు గదండి, అందుకని అడుగుతున్నా"

"ఇజ్రాయెల్! శరీరాన్ని చంపగలవు గాని ఆత్మని చంపలేవు. ఆత్మదెయ్యమై ఇంకో లోకంలో ఉంటుంది ఓబ్రియన్ అక్కణ్ణించి మనల్ని చూస్తూ వుండి వుంటాడు," అన్నాను

"నిజంగానా కెప్టెన్? అయితే మనుషుల్ని చంపటంవట్టి దండగే నన్నమాట అదేదో, మీరు చెప్పిన ఆత్మ—బతికివుంటే ఇహ ఎందర్ని చంపి మాత్రం లాభమేమిటి?—" ఇజ్రాయెల్ హాండ్స్ ఇంతసేపు నావంక చూడకుండా, నా చూపుల్ని తప్పించుకుంటూనే మాట్లాడుతున్నాడు ఇప్పుడు ఆగి నావంక ఒక్కసారిచూసి మళ్ళీ కళ్లు తిప్పుకున్నాడు. ఆ చూడటంలో వాడిలోవున్న ద్రోహబుద్ధి వ్యక్తమైంది మళ్ళీ అన్నాడు ఇజ్రాయెల్ "కెప్టెన్! ఈరమ్ మరీ ఘాటుగా ఉందండి. బుర్ర తిరిగి పోతోంది.

అనువాదం: శ్రీ నండూరి రామమోహనరావు

కాస్తంత ఆ కిందగదిలోకి వెళ్లి బ్రాందీ సీసాఉంటే తెచ్చిపెట్టండి మీకు పుణ్యం వుంటుంది ”

ఇజ్రాయెల్ మాటల్లో ఒక్కదాన్నీ నేను నమ్మ లేదు. ఎప్పుడూ రమ్ తప్ప మరేమీ తాగనివాడికి అది ఘాటు కావటమేమిటి? ఇదంతా ఏదో మోసపు ఆలోచనే నన్ను సరంబీనుండి కిందకి పంపించి ఏదో చెయ్యాలనుకుంటున్నాడు. వాడి బెదురుచూపులు, విషంతోకూడిన చిరునవ్వు ఇవన్నీ చూస్తే నా అను మానం మరింత దృఢపడింది

“బ్రాందీ కావాలా? అల్లాగే, తెస్తానాగు,” అన్నాను.

సరంబీ మెట్లుదిగి ఓడగదికి వెళ్లేనడవలో ఆగాను ఇజ్రాయెల్ ఏం చేస్తాడో చూడాలనుకున్నాను నేను ఓడగదిలోకి వెళ్లివుంటాను గదా అని ఇజ్రాయెల్ గబగబ కూర్చున్న తావునుండి లేచాడు లేవడంలో తొడలోని గాయం నొప్పెట్టిందేమో, భీకరంగా మూలి గాడు. లేచి ఓ బ్రియన్ శవం దగ్గిరికివెళ్లి దాని కింద వున్న బాకుతీశాడు. దానిమీద రక్తం గడ్డ కట్టుకుని వున్నది. ఒక్కక్షణం దానికేసిమూసి చొక్కాలోపల దాచుకున్నాడు మళ్ళీ ఏమీ ఎరగనట్టు తను మొదట కూర్చున్నచోటికే వెళ్లి ఇందాక కూర్చున్నమాదిరి గానే కూర్చున్నాడు.

నేను తెలుసుకోదలచింది ఇంతే ఇజ్రాయెల్ లేచి నడవ గలుగుతున్నాడు, వాడిదగ్గిర ఒక ఆయుధం వుంది. కనుక వాడిచేతిలో నాకు అపాయం తప్పదు జాగ్రత్తగా ఉండ వలిసిందే కాని ఒక విషయంలో మాత్రం వాణ్ణి నమ్మాను ఓడ ఉత్తర సింధు శాఖలోకి సురక్షితంగా చేరడం నాకెంత అవసరమో వాడికీ అంత అవసరమే వాడి సహాయంలేందే నేనుగాని, నా సహాయం లేందే వాడుగాని ఓడను నడిపే స్థితిలో లేము. అందుచేత ఓడ రేవును చేరేదాకా వాడు నాకేమీ హాని తలపెట్టడనుకున్నాను.

ఇలా ఆలోచిస్తూ ఓడగదిలోకి వెళ్లి బ్రాందీ సీసాను వెదికి తీసుకున్నాను సరంబీమీదికి వచ్చి కొంతదూరంలో నుంచుని సీసాను హాండ్సు కందించాను సీసామూతి పగలగొట్టి అతడు కొంత తాగాడు.

తరవాత జేబులోనుంచి పొగాకు తీసి చుట్ట చుట్టు, కున్నాడు.

ఇంకా మేము రెండుమైళ్లు పోవలసివుంది. ఇ్రజాయెల్ చెప్పినప్రకారం తెరచాపలు ఎత్తుతూ దించుతూ, ఓడను పోనిస్తున్నాను ఉత్తర సింధుశాఖను చేరాము. మలుపుతిరిగి ఆచీలికలోనికి ప్రవేశించాము. సింధుశాఖ ఇరుకుగా వున్నది. ఆ ఒడ్డున, ఈ ఒడ్డున దట్టంగా అరణ్యాలున్నాయి తీరాలను దాదాపు తగులుతూనే ఓడ ముందుకు పోతోంది. తీరరేఖలు రెండూ కలుసుకేచోటు సమీపించాము. అక్కడ శిధిలమై, తునాతునకలై వున్న ఒక పాతఓడ కనిపించింది.

"ఆ, ఇక్కడ చాలా బావుంది ఇంత మంచి రేవు నేనెక్కడాచూడలేదు. ఆ తెరచాపదించండి. నెమ్మదిగా, నెమ్మదిగా. .." అంటున్నాడు ఇ్రజాయెల్ నావెనక కొద్దిదూరం లోనిలబడి.

నేను ఓడను తీరాన ఆపుచేసే సరంభంలో ఇ్రజాయెల్‌ను, అతని చొక్కాలోని బాకును, అతని మోసాన్ని విస్మరించాను. హఠాత్తుగా గుండె ఝల్లుమంది ఎందుకు ఝల్లుమన్నదో నాకప్పటికీ ఇప్పటికీ అర్థం కాలేదు భయంకరమైన ప్రమాదం రాబోతున్నప్పుడు అలాగే జరుగుతుందను కుంటాను వెంటనే వెనక్కి తిరిగి చూశాను. ఇ్రజాయెల్ సగందారిలో ఊగతూ నుంచున్నాడు చేతిలో బాకును ఎత్తి పట్టుకున్నాడు

మా చూపులు కలుసుకోగానే ఇద్దరం ఒకసారే అరిచామను కుంటాను నా అరుపులో భయం వ్యక్తమవుతున్నది అతని అరుపులో దౌర్జన్యంవున్నది ఇ్రజాయెల్ అలా అరిచి నాకేసి దూకాడు దూకడంలో నా అదృష్టవశాత్తు కాలుబెణికి ముందుకు పడ్డాడు ఈఅదను చూసుకుని నేను దూరంగా పరిగెత్తాను వాడు లేచేలోగా పంట్లాం జేబులోంచి పిస్టలుతీసి వాడికేసి గురిపెట్టాను నాపిస్టల్‌ను లెక్కచెయ్యకుండా వాడు మీదికి వస్తున్నాడు పిస్టల్ పేల్చాను కాని పిస్టల్ మోగలేదు, పేలలేదు నా ఆశ్చర్యానికి మితిలేదు బెన్‌గన్ పడవలో ప్రయాణం చేస్తున్నప్పుడు అలలకి నా పంట్లాం తడిసి పోవటం జ్ఞాపకం వచ్చింది అప్పుడే, నా పిస్టలుకూడా తడిసి పనికి రాకుండా పోయివుంటుందను కున్నాను పిస్టలును సరిగా పరీక్షించి బాగు చేసుకోనందుకు నన్ను నేను ఎంతో నిందించు కున్నాను

ఇంతలో నా అదృష్టం కొద్దీ ఓడ తీరానగల ఇసుక దిబ్బలను కొట్టుకుని ఒక్కసారిగా కంపించింది ఓడ వెనక భాగంపైకిలేచింది ఆ అదురుకు నేను, ఇ్రజాయెల్ కూడ బోర్లాపడి, వాలుగావున్న సరంబీమీద దొర్లసాగాము మాతోపాటు ఓబ్రియన్ శవంకూడా దొర్లసాగింది ముందు లేచి నిలబడింది నేనే ఇ్రజాయెల్ మీదికి శవం దొర్లడంచేత వాడు దానితో కొంతసేపు కుస్తీ పట్టిగాని లేవలేక పోయాడు ఈలోగా నేను దగ్గర్లోవున్న ఒక తెరచాప కొయ్యమీదికి ఎగబాకాను

కొయ్యకు సగం ఎత్తున కట్టబడివున్న చట్రంవరకూ పాకి అక్కడ కూర్చున్నాను

ఇ్రజాయెల్ ఈలోగా నిలబడి మళ్ళీ ఒక అరుపుఅరిచి బాకు విసిరాడు అది నా కాళ్లకు కింద కొంతదూరంలో కొయ్యకు తగిలి నేలపై పడిపోయింది ఇ్రజాయెల్ విస్తుపోయి, కళ్లు చిట్లించుకుని నా కేసి చూస్తున్నాడు నేను సురక్షిత స్థలం సంపాదించాను గదా అనే ధీమాతో చట్రంమీద కూర్చుని చొక్కా పైజేబులోంచి పొడిమందు, తూటాలుతీసి పిస్టల్‌లోని తడిమందు తీసి పారవేసి తిరిగినింపాను. జేబులోనుండి ఇంకో పిస్టల్ తీసి దాన్నికూడా పొడిమందుతో నింపాను. రెండు పిస్టళ్లూ రెండు చేతులతో పట్టుకున్నాను ఇంతసేపు ఇ్రజాయెల్ నేను చేస్తున్న పని శ్రద్ధగా చూస్తున్నాడు

"ఇ్రజాయెల్! నువ్వు అడుగు ముందుకు వేశావంటే రెండుతూటాలూ ఒక్కసారిగా నీ తలలోంచి దూసుకుపోతాయి, జాగ్రత్త!"

ఈ బెదిరింపు వాడిమీద బాగా పనిచేసింది. ముందు రాబోతున్నవాడు అక్కడే ఆగిపోయాడు. అదిచూసి నేను ధీమాగా నవ్వాను ఇ్రజాయెల్ రెండు గుటకలు కష్టంమీద మింగి,

"కెప్టెన్! కాస్తలో తప్పిపోయింది గాని లేకపోతే ఈ బాకు నీవీపును రెండుచెక్కలు చేసేది. ఊహు నాకు అదృష్టం లేదు ఇప్పటికైనా నిన్ను వదిలి పెడతా ననుకోకు," అంటూ నేను కూర్చున్న


కొయ్యను సమీపించాడు నేను వాడిమాటలు చిరునవ్వు నవ్వుకుంటూ వింటున్నాను హఠాత్తుగా వాడు చెయ్యెత్తి కత్తి విసిరాడు కత్తి నాబుజముపైన చర్మాన్ని చీల్చుకుంటూ కొయ్యకు గుచ్చుకుంది అదే సమయంలో నేను పిస్టల్ పేల్చాను అప్రయత్నంగా ఇస్రాయెల్ హాహాకారం చేస్తూ కింద గుభీమని కూలిపోయాడు

26 పెసో, పెసో, పెసో

ఓడ ఏట వాలుగా వుండటం చేత ఇస్రాయెల్ హాండ్స్ దెబ్బ తింటంతోనే నీళ్లలో పడ్డాడు ఒకటి రెండుసార్లు నీళ్లపైకి తేలాడుగాని, నీళ్లు సద్దుకోవటంతో శాశ్వతంగా అడుగుకుపోయి అదృశ్యుడయ్యాడు

శత్రువు తొలగిపోగానే నా దుస్థితి స్ఫురణకు వచ్చింది ఇస్రాయెల్ విసిరిన బాకు నాబుజం చీల్చుకొని కొయ్యకు గుచ్చుకుందని చెప్పాను వీపుమీద, రొమ్ముమీద నెత్తురు కారుతున్నది బాకు తెరచాప కొయ్యలో గట్టిగా ఇరుక్కుపోవటం మూలాన ఒక్క చేత్తో లాగి వెయ్యటానికి సాధ్యంకాలేదు రెండు చేతుల్తో ఊడబెరికితే ఆ ఊపుకు నేను ముందుకు ఒరిగి నీళ్లలో పడకతప్పదు ఏం చేయటమా అనే భయంతో ఒక్కసారిగా ఆ పాద మస్తకం కంపించాను అప్రయత్నంగా కలిగిన ఆ కంపనకు బాకు ఊడిపోయి కిందపడింది నెత్తురు ఇంకా ధారలుగా కారింది ఎలాగైతే నేం కొయ్యనుండి కిందికి పాకివచ్చి సరంబీమీదకు చేరాను

ఓడ గదిలోకి వెళ్లి కొంతదూది, గుడ్డపీలికలు సంపాదించి గాయానికి కట్టుకున్నాను గాయం లోతుగా తగల్లేదు బుజంపై అంచుమాత్రమే తెగింది ఆ చెయ్యి ఉపయోగించటానికి వీల్లేనంతగా కూడా నెప్పి పెట్టడంలేదు అందుచేత గాయాన్ని గూర్చి



అదే సమయంలో నేను పిస్టల్ పేల్చాను అప్రయత్నంగా

కలత పడవలసిన అవసరం లేకపోయింది

చుట్టూ చూశాను. ఈఓడ యావత్తూ నాదే కదా అని సంబరపడ్డాను ఒకమూల నరంబీ పిట్టగోడ కానుకుని ఓబ్రియన్ శవం ఇంకా అలాగేవుంది. ఆపాటికది చాల వికృతంగా తయారై చూట్టానికి భయంకలిగిస్తోంది నడుం దగ్గర పట్టుకుని దాన్ని పిట్టగోడనుండి అవతలకు దొర్లించాను

అప్పటికి సూర్యుడు బాగా పడమటికి వాలిపోయాడు నేను ఒంటరిగా ఆ నిర్జన ప్రదేశంలో బిక్కుబిక్కుమంటూ నిలబడ్డాను బాగా చీకటి పడకముందే మట్టికోటను చేరుకోవాలని అనిపించింది నాసాహస కార్యాలను ఎప్పుడు నా స్నేహితులకు విని పిద్దామా అని ఆత్రుత ఎక్కువైంది ఎవరితోనూ చెప్పకుండా సాహసించి పోయినందుకు మొదటి చివాట్లు పెట్టినా, హిస్పానియోలాను శత్రువుల నుండి తిరిగి స్వాధీనం చేసుకున్నందుకు, ఒకశత్రువునైనా కడతేర్చినందుకు కెప్టెన్ నన్ను అభినందించక పోడని భావించాను.

లంగరు తాళ్ల ఆధారంతో నీళలోకి దిగాను మోకాళ్లవరకు మాత్రమే వచ్చాయ్ నీళ్లు ఒడ్డుకు చేరి దక్షిణంగా నడక ప్రారంభించాను సూర్యాస్తమయమైంది. చంద్రుడు తూర్పున ఉదయించాడు చంద్ర కాంతిలో, చిరు చలిగాలిలో, ఉషారుగా కూని రాగాలు తీస్తూ నడుస్తున్నాను. కొంతదూరం పరిగెత్తాను, కొంతదూరం నడిచాను కాని మట్టికోటను సమీపిస్తున్న కొద్దీ వేగం తగ్గించాను నన్ను గుర్తించలేక నామిత్రులే తుపాకి పేల్చి చంపెయ్య వచ్చునని భయపడ్డాను అందుకని సాధ్యమైనంత వరకూ చెట్ల నీడల్లోనే మెల్లిగా నడిచాను

మట్టికోట ఆవరణను చేరగానే ఆశ్చర్యం పట్టలేక పోయాను ఎందుకంటే మట్టికోట వెనక భాగాన పెద్ద దుంగలతో చలిమంట వెయ్యబడివుంది మంటలు రేగకపోయినా దుంగలు కణకణ తగలబడుతూనే వున్నాయి. ఇంత పెద్దమంట తయారు చేయటానికి నామిత్రులకు అంత కలప ఎక్కణ్ణించి లభ్యమైందో అర్థంకాలేదు. ఒకవేళ కలపఉన్నా దానివద్ద మనుషులెవ్వరూ లేకపోవటం మరింత ఆశ్చర్యాన్ని కలిగించింది ఆశ్చర్యంతోపాటు కాస్తభయంకూడా కలిగింది.

కాని ముందుకేపోయాను ఆవరణ చుట్టూవున్న కంచెనుదాటి చేతులతో, కాళ్లతో పాకుకుంటూ మట్టికోట ద్వారం సమీపించాను నా మిత్రులంతా గాఢ నిద్రలోవుండి గురకలు పెడుతున్నారు అంత నిర్భయంగా, కాపలాకూడా లేకుండా వాళ్లు నిద్రపోతున్నందుకు ఆశ్చర్యపడుతూ, ఇప్పుడు నా బదులు సిల్వర్ అనుచరులే వచ్చి అందరి తలలు నిద్రలోనే నరికివేస్తే ఏమవుతుంది? అని ఊహించుకుని వణికిపోయాను

లోపల అంతా చీకటిగావుంది చడీ చప్పుడూ లేకుండా నా స్థానంలోకిపోయి పడుకోవాలనీ, తెల్లవారాక నన్నుచూసి వాళ్లు దిగ్భ్రాంతులవుతుంటే చూసి వెక్కిరించాలనీ అనిపించింది ఊపిరికూడా బిగపట్టి పాకుతున్నాను ఇంతలో నాచేతుల కేదో తగిలింది ముట్టుకుని చూస్తే అది ఎవరిదో కాలు. ఆకాలు తాలూకు మనిషి ఇటునుంచి అటు దొర్లి పడుకున్నాడు. ఇంతలో హృదయ భేదకమైన కఠోర శబ్దం వినిపించింది

"పెసో, పెసో, పెసో, " ఈధ్వని ఎక్కడిదో ఎంతసేపటికీ ఆగటంలేదు

కెప్టెన్ ఫ్లింట్ ! సిల్వర్ చిలుక ! ఏమిటిది ! నేనెక్కడున్నాను? నామిత్రుల మధ్యకాదా?

చిలక అరుపులకు అంతా సందడిగా లేచారు. "ఎవరక్కడ?" అని సిల్వర్ గర్జించాడు నేను లేచి ద్వారంకేసి పరిగెత్తాను పరిగెత్తడంలో సూటిగా ఒకమనిషికి గుద్దుకున్నాను పక్కకు తిరిగి పరిగెత్తబోయి ఇంకో మనిషికి ఢీకొట్టాను అంతా కంగారు అయిపోయింది

"కాగడా ముట్టించండిరా," అని సిల్వర్ ఆజ్ఞాపించాడు ఒకడు కాగడా పుచ్చుకుని చలి మంట వద్దకుపోయి అంటించుకుని వచ్చాడు

27 శత్రు శిబిరంలో.

కాగడా వెలుతురులో పరిస్థితి అంతా క్షణంలో అవగతమైంది మట్టికోట అందులోని మా నామగ్రితోసహా శత్రువుల ఆక్రమణలో వున్నది అన్నిటికంటే నాభయం ఇనుమడింప జేసిన దేమంటే ఒక్క

జాడైనా కనబడలేదు. నా మిత్రులందర్నీ వధించి వుంటారని భావించాను వారితో పాటు మరణిం చేందుకు అవకాశం లేకుండా చేసుకున్నందుకు నన్ను నేను ఎంతో నిందించుకున్నాను

సిల్వర్ బుజంమీద చిలక కూర్చుని రెక్కలను ముక్కుతో పొడుచుకుంటోంది సిల్వర్ ఒకకొయ్య పెట్టెమీద కూర్చున్నాడు మిగతా కళాసీలు చుట్టూ నుంచుని నాకేసి ఏమీ అర్థం కానట్టు వింతగా చూస్తున్నారు. సిల్వర్ ఆ నిశ్శబ్దాన్ని భేదిస్తూ అన్నాడు.

"ఒహో! జిమ్‌హాకిన్స్ వచ్చాడా? తస్సదియ్య, ఏం చేస్తున్నామో చూద్దామని వచ్చావా? డిక్! కాస్త, ఆ కాగడా ఇటు అందివ్వు పైప్ ముట్టించు కుంటాను ఆ, చాల్లే ఒరే, అబ్బాయిలూ! మీరు జిమ్ హాకిన్స్‌కేమీ భయపడ నక్కర్లేదు అతడు చాలా మంచివాడు మీరు ఏం తప్పులు చేసినప్పటికీ అన్నిటినీ క్షమిస్తాడు. తస్సదియ్య, జిమ్! వచ్చావన్న మాట పాపం సిల్వర్ ముసలాడు, ఏం చేస్తున్నాడో చూసి పరామర్శించాలని వచ్చావా? నువ్వు చురుకైన వాడివని తెలుసనుకో కాని ఇంత నిర్భయంగా ఇక్కడికి రాగలవని అనుకోలేదుసుమా, తస్సదియ్య"

సిల్వర్ మాటకు నేనేమీ సమాధాన మివ్వ లేదు. పైకిమాత్రం ధైర్యంగానే ఉన్నాను గాని లోపల గుండెలు పీచు పీచు మంటూనే ఉన్నాయి సిల్వర్ మళ్లీ ప్రారంభించాడు.

"జిమ్! నే నిదివరకెన్నోసార్లు చెప్పాను నువ్వంటే నాకెంతో యిష్టమని. నీధైర్యం, చురుకు తనం ఎంతో మెచ్చుకుంటున్నాను నిన్ను చూస్తే చిన్నప్పటి నాచేష్టలు జ్ఞాపకం వస్తున్నాయి నువ్వు కూడా మాలో కలిస్తే ఎంత బావుండేది? నీకూడా కాస్త ధనం ముట్టజెప్పే వాళ్లం కదా! నిజం చెప్ప మంటావా జిమ్? నీమీద మా వాళ్లందరికీ కోపం వచ్చింది. ముఖ్యంగా డాక్టరుగారు నువ్వు మాలో కలిశావని అనుమానించి నిన్ను చంపేద్దా మన్నంత కోపంగా ఉన్నారు కనక నువ్వు వాళ్లదగ్గిర కెల్లాగూ పోలేవు ఇక నువ్వు మూడోపార్టీ స్థాపించా లనుకున్నా నీకు అనుచరు లెవ్వరూ లేకపోవటం మూలాన అదీ లాభంలేదు. కనక మాపార్టీలో చేరటం తప్పనీకు గత్యంతరం లేదు"

సిల్వర్ ఉపన్యాసం వల్ల ఒకవిషయం స్పష్ట పడింది. నామిత్రు లెవ్వరూ చనిపోలేదు అందుచేత వాళ్లకు నాపై కోపం వచ్చిందన్నమాట ఎలా వున్నా నా మనస్సుకొంత శాంతించింది.

"అబ్బాయ్ జిమ్! నువ్వు మా చేతుల్లో చిక్కావని నిన్ను బాధిస్తామేమోనని భయపడకు నీ కిష్టం అయితే మాలో చేరు ఇష్టం లేకపోతే మరి నీ ఉద్దేశ్య మేమిటో చెప్పు", అన్నాడు సిల్వర్.

వణుకుతున్న కంఠంతో నేనన్నాను: "జవాబు చెప్పమంటావా?"

"చెప్పమనే అడిగేది. తొందరలేదు. బాగా ఆలోచించుకుని సావకాశంగా చెప్పు"

"అయితే ఇదుగో, నేను తెలుసుకోవలసిన సంగతులు కొన్నివున్నాయి అసలేమి జరిగింది? మీరిక్కడికి కెల్లా వచ్చారు? నా స్నేహితు లెక్కడున్నారు?"

"ఏయ్, జాగర్తగా మాట్లాడు అవన్నీ నీకు చెప్పటానికి వీల్లేదు," అన్నాడొక కళాసీ.

"ఒరేయ్, నువ్వు నోర్మూయ్యరా నే నిక్కడ మాట్లాడుతుండగా నీ కెందుకు మధ్యలో," అని గదమాయించాడు సిల్వర్ ఆకళాసీని మళ్ళీ నాకేసి తిరిగి చెప్పాడు. "నిన్న మధ్యాహ్నంగావును, డాక్టరు లివ్‌సే సంధిజెండా పుచ్చుకుని మాదగ్గిరికి వచ్చారు. వచ్చి "కెప్టెన్ సిల్వర్! మనపని ఆఖరు. హిస్పానియోలా మాయమైంది," అన్నారు. మేము అబద్ధ మనుకున్నాం తీరాచూస్తే రేవులో ఓడలేదు గీడలేదు. డాక్టరు గారన్నారు. "కెప్టెన్ సిల్వర్! ఇక మనం ఎవరిదారి వాళ్లు చూసుకోవలిసిందే యుద్ధం మానేద్దాం ఈ మట్టికోటను, అందులోని సామాను మీరు తీసుకోండి మాదారిన మమ్మల్ని పోనివ్వండి," అని బతిమాలారు సరేఅని మేము ఒప్పుకున్నాం. వాళ్లు ఎక్కడున్నారో మాకు తెలియదు"

"ఇంతేనా" అని అడిగాను.

"ఆ. నువ్వు వినదగింది ఇంతే," అన్నాడు సిల్వర్.

(36-వ పేజీ చూడండి)

యథార్థవాది

థర్డు బెల్లుకొట్టి పావుగంటైనా యింకా మాష్టరు క్లాసుకు రాలేదు. విద్యార్థుల్ని గోల చేయకుండా చూస్తున్నాడు మానేటరు బాబు.

"అరేయ్ బాబు! ప్రతిరోజూ మాష్టరు క్లాసుకు ఆలస్యంగా హెడ్ మాష్టరుకు చెబితే మంచిదిరా బాబు!—"

"అరుగో! మాష్టారు వస్తున్నారు మీరు పూరుకోండి. తర్వాత ఆలోచిద్దాం—"

మాష్టారు క్లాసులోకి వచ్చారు. పిల్లలంతా లేచారు ఆయనకుర్చీలో కూర్చున్నారు. హాజరు తీసికొని

"నే నెప్పుడూ ఆలస్యంగా రాలేదుసార్! ఇవ్వాళ్ళ మబ్బుపట్టి టైం తెలియక ఆలస్యం అయింది సార్!"

"నీ వెన్నన్నా చెప్పు లాభం లేదు అరగంటఐపోయింది ఈ అరగంటకూడా బయట తిరిగి తర్వాత క్లాసుకురా" అన్నారు.

శ్రీ ఆరికపూడి హనుమంతరావు

వస్తుంటే ఎట్లారా? హెడ్ మాష్టరుకు తెలియపర్చరా సంగతి—"

"ఔను! మనక్లాసు అందరికంటె నాలుగు పాఠాలలో తక్కువగా వుంది ఇట్లాఐతే మనం తప్పటం ఖాయం! ఈ విషయం ముందే పాఠంచెప్పటానికి పుస్తకం తెరిచారు.

అంతలో ఒక విద్యార్థి ఆలస్యంగావచ్చి వాకిట్లో నిలబడ్డాడు ఆ విద్యార్థినిజూచి మాష్టారు "బెల్లుకొట్టి అర్థగంటకావస్తుంది ఇప్పుడొస్తున్నావా క్లాసుకు పో! పో! ఈ కాసేపుకూడా బజార్ల వెంట తిరిగిరాపో!" అని అన్నారు

"కాదుసార్! పొరుగూరినుండి వస్తున్నాను. కాస్త ఆలస్యం జరిగింది క్షమించండి! ఆలస్యంగా యిక ఎప్పుడూ రానుసార్!" అన్నాడు ఆ విద్యార్థి

"పొరుగూరు అయినా-ఈవూరు అయినా ఒకటే! టైంకు రావాలి - అంతే! మరీ యీరోజుల్లో విద్యార్థులు విద్యార్థులుగా లేరు ఇష్టంవచ్చినప్పుడు రావటం - యిష్టంవచ్చినప్పుడు పోవటం - క్రమ శిక్షణ శూన్యం!

మాష్టారు.

మానేటరుబాబు లేచి "మాష్టరుగారు! అతన్ని క్లాసులోకి రానివ్వండి! అతడు పొరుగూరినుండి చదువుకోటానికి వచ్చాడు అతడు టైంకుముందే వచ్చే విద్యార్థండి -" అన్నాడు

"ఓహో! మీరు వకాల్తా పుచ్చుకున్నారా? అది మీకు సంబంధించిన విషయం కాదు. తమరు కూర్చోండి!" అన్నారు మేష్టరు ఛలోక్తిగా -

"సార్! ఇది నావిషయం కాకపోయినా - నాకు సంబంధించిన విషయం - మీరు ఉపాధ్యాయులు.. మేము విద్యార్థులము. మీకూ, మాకూ, సంబంధం వుంటుందండి! మీరు ప్రతిరోజూ పావుగంట ఆలస్యంగా వస్తుంటారు. ఏదో అతను యీరోజు కాస్త ఆల

(34-వ పేజీ చూడండి)

పేచీపౌనితీర్పు

"జానకీరాణి

ఆరోజు ఆదివారం. మానాన్నగారు క్యాంపుకి వెళ్లారు. అమ్మకి జ్వరమొచ్చింది. మన పాకకళాప్రావీణ్యం చూపించాలి ఇక తెల్లారగానే కాఫీ కాచేశాను మా తమ్ముడు అప్పుడే లేచాడు కాఫీకి తొంభై వంకలు పెడ్తూ సేవించాడు

"మిగిలిన పాలు ఏంచేస్తావే?" అన్నాడు

"తోడు పెట్టుకోడానికి కొన్ని, మధ్యాహ్నం కాఫీకి కొన్ని" అన్నాను నేను కాస్పేపు పాలవంక చూశాడు. "ఒకమాట చెప్తాను గానీ, అమ్మకి చెప్పకుండా ఉంటావా?" అన్నాడు ఏదో పాడు చేశాడనుకున్నాను "చెప్పను లే చెప్పు" అన్నాను "కాసినిపాలు తీసి కోవా చేసుకుందాం నిన్నకొనుక్కున్నాను. ఎంతో బాగుంది" అన్నాడు.

నాకు కూడ ఈ ఆలోచన నచ్చింది కానీ, కోవా ఎల్లా చేస్తారో నాకు తెలియలేదు అమ్మనడిగితే కేకలేస్తుంది "కోవా చేయడం నాకు చేతరాదురా" అన్నాను చిన్నబోయేముఖంతో. వాడికి నా అసమర్థత తెలియచేయాలంటే చిన్నతనంకాదూ!

"ఏముందే! పాలల్లో మైదా పిండి, చక్కెరవేసి కలియబెట్టేస్తేసరి. ఫస్టుక్లాసుగా తయారౌతుంది" అన్నాడు అల్లాచేస్తే కుదురుతుందని నాకు నమ్మకం కలగలేదు. "నీమొహం సరిగ్గా తెలియకుండా చేస్తే, పాలన్నీ దండగకాదూ?" అన్నాను

"అమ్మ నడుగుదామంటావా?" అన్నాడు ఇద్దరం భయపడుతూ వెళ్లి అమ్మపక్కమీద కూర్చున్నాం. "అమ్మా! కోవా ఎట్లాచేస్తారే?" అన్నాడువాడు

"పాలల్లో పంచదారవేసి కలియబెడుతుంటే సరి అదే గడ్డకట్టుంది.

"మళ్లీ వేశావా! నేను వేశానురా ముందుగానే" అన్నాను. వాడు బిక్కమొహం వేశాడు. "అయ్యో నాకేంతెలుసే? నేను నాలుగు చెంచాలు వేశాను" అన్నాడు "పోనీలేరా ఎక్కువైనా తీపేగా!" అని సరిపుచ్చుకున్నాం కోవా తయారైంది పళ్లెంలో పోశాను "చల్లారగానే తిందామా?" అన్నాడు వాడు "వద్దు" అన్నాను నేను గిన్నెగీకుతూ

"ఏం?"

"రేప్రొద్దున్న స్కూలుకి వెళ్లేటప్పుడు తిందాం" "నీ ఇష్టమేమిటి? నా భాగం నేను తింటానిప్పుడే," అన్నాడువాడు "అసలు చేసింది ఇప్పుడే మీ మొదలెట్టకండి" అన్నది అమ్మ "లేదే ఊరికేనే అడిగాం" అని అమ్మకు ధైర్యం చెప్పాను నేను.

తక్షణం వంటింటిలో కెళ్ళి గిన్నెలో సగంవరకు పాలుపోసి కుంపటిమీద పెట్టాను ఐదారు చెంచాలు పంచదారవేసి కలియబెట్టి నేను చదువుకోడానికి వెళ్లాను కాస్సేపాగిన తర్వాత మాడువాసన వేస్తే, వెళ్ళి కలియబెట్టడం ప్రారంభించాను

నేను చక్కెర వేశానే మళ్లీ వెయ్యకే అక్కయ్యా" అంటూ మావాడు తయారైనాడు.

నేను. ఇప్పుడు తినటానికి వీల్లేదు. ఇంతకష్టపడిచేసి ఇప్పుడే తినేస్తే ఎల్లా?'' అన్నాను నేను.

''అమ్మతో చెపుతాను'' అన్నాడువాడు రోషంతో.

''చెప్పావో ఇప్పుడుమాత్రంచచ్చినా పెట్టను'' అన్నాను నేనుకోపంతో.

''అమ్మోయ్!'' అంటూ ఇద్దరం ఆ పాలకోవా అల్లానేఉంచి పరుగెత్తాం ''చూడవే అక్కయ్యని. రేప్రొద్దున్న ఎప్పుడో తినాలంటుంది. నాభాగం నేనిప్పుడే తినేస్తానే'' అన్నాడు తమ్ముడు మేము పాలకోవా చేశామని తెలుసుకుంది అమ్మ. కాని ఏమీ అనలేదు మమ్మల్ని. "కాదే అమ్మా. ఇప్పుడు అన్నం తినబోతూ ఎందుకురా, రేప్రొద్దున్న స్కూలుకి వెళ్లేటప్పుడు తిందామంటే వినడు చూడవే" అన్నాను నేను.

"ఆ కోవా ఇక్కడికి పట్టుకురండి. చెరొక సగం పంచిస్తాను. ఎవళ్లిష్టమొచ్చినప్పుడు వాళ్లు తిందురుగాని." అన్నది అమ్మ. నేను వంటింట్లోకి వెళ్లాను. ఏదీ కోవా? పళ్ళెంఖాళీ! "ఒరే తమ్ముడూ! ఏదిరాకోవా? దొంగవెధవ అంతా మెక్కేశావా?" అన్నాను నేను వచ్చేఏడుపు దిగమ్రింగుకుని. వాడూ వచ్చాడు. చుట్టూచూశాడు. వాడికి కూడా గొంతుపట్టుకుంది. "ఏదే?" అంటూ పైకేసిచూశాడు. "అదుగో నే అటకమీద'" అన్నాడు.

మీసాలు నాక్కుంటూ మా నల్ల పిల్లికూర్చునుంది. ఖాళీపళ్ళెం మమ్మల్ని చూసిపక్కుననవ్వింది. ★

యథార్థవాది

(32-వ పేజీ తరువాయి)

స్వంగావస్తే వెళ్లగొట్టటం న్యాయం కాదండి!" అన్నాడు బాబు కొంచెం కటువుగా -

మాష్టరు మండిపడి బాబును బయటకు వెళ్లగొట్టాడు. బాబు హెడ్‌మాష్టరు దగ్గరకువెళ్లి జరిగిందంతా చెప్పి ఏడ్చాడు. మాష్టర్ని కనుక్కుంటానని బాబును వోదార్చి క్లాసుకు పంపాడు హెడ్‌మాష్టరు.

సరే! రెండురోజులు గడిచాక యీ విషయం బాబునాన్నగారికి తెలిసింది. "గాడిద! కాస్తలేవ్? అప్పుడే పంతుళ్ళమీద తిరగబడుతున్నావ్? రౌడీ వెధవలా తయారవుతున్నావురా! మీ పంతులు దగ్గర కెళ్లి ఆయనకాళ్లుపట్టుకొని యికఎప్పుడూ యిలా చేయనని వేడుకో! –" అని బాబును బాదాడు.

ఇంతకూ తనుచేసిన నేరం ఏమిటో?–తండ్రి తననిలా ఎందుకు కొట్టాడో? – తెలియక ఏడుస్తూ మాష్టరుయింటికి వెళ్లాడు బాబు. మాష్టరు పడకకుర్చీలో పడుకొని పత్రిక చదువుకుంటున్నారు. "మాష్టరుగారు! నేను తెలియక మిమ్మల్ని ఎదిరించాను. మీరు కొట్టినా - తిట్టినా - ఏమన్నా - సహించి వూరుకుంటానండి! తెలియకచేశాను. క్షమించండి!" అని బాబు అన్నాడు.

బాబు మాటలకు మాష్టరు ఆశ్చర్యపోయారు.

"బాబు! నీవు ఎదిరించిందేముంది చెప్పు! చిన్నవాడివైనా ధైర్యంగా నిజం పలికావునాయనా! ఇందులో నీతప్పు ఏముంది? ఎందుకిలా తప్పుజేసిన వాడిలాగా పశ్చాత్తాపం జెందుతావ్?"

"ఇతరుల్ని నొప్పించే "సత్యాన్ని - ధర్మాన్ని" యిక నేనెన్నడూ పలకనండి. మీ మీద ఎదురుతిరిగానని మా నాన్న చావగొట్టాడండి! ఇక ఎవ్వరు, ఏమిచేసినా - నాకు సంబంధంలేనట్టుగా నడచుకుంటాను. మాష్టరుగారు మీరు ఏమన్నా పడతాను. నన్ను క్షమించండి!" అన్నాడు బాబు కన్నీళ్లు తుడుచుకుంటూ -

"బాబు! అసలు యీ సంగతి మీ నాన్నగారికెలా తెలిసింది?

అయినా యింతమాత్రానికే - నిజం తెలుసుకోకుండా నిన్ను కొట్టారా? అయితే నేనొక ఉత్తరం వ్రాసి యిస్తాను. అది మీ నాన్నగారికివ్వు- నిన్నేమీ అనరు." అని మాష్టరు ఒక చిన్న ఉత్తరం వ్రాసి బాబుకిచ్చి యింటికి పంపారు.

ఆ ఉత్తరాన్ని బాబు తీసుకొచ్చి తండ్రికిచ్చాడు. "శ్రీ...గారికి,

అయ్యా!

కర్తవ్యాన్ని మరచి ప్రవర్తిస్తున్న నన్ను - వెన్నుదట్టి నా కర్తవ్యాన్ని నాకు బోధించినట్టి చిరంజీవి మీ కుమారుడని తెలిసికొని చాల సంతోషించాను. నిజంగా బాబు ప్రవర్తనలో ఎలాంటి దోషము లేదు. అతడు యథార్థవాది. అన్యాయాన్ని - అక్రమాన్ని సహించలేదు అతని హృదయం.



పెద్దవాళ్ళమని - స్వేచ్ఛ వుంది గనుక - బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తున్న మనల్ని - పసివాడైనా బాబు విమర్శించాడు. అంతమాత్రానికే మనం భుజాలు తడుముకొన్నాం - నిజంగా మన ప్రవర్తనకు మనం తలలు వంచుకోవాలి! నలభైమంది క్లాసులో - "మీరు ప్రతిరోజూ ఆలస్యంగా వస్తున్నారు. ఒక విద్యార్థి ఒకరోజు ఆలస్యంగావస్తే అతన్ని మీరు క్షమించలేరా?" అని ధైర్యంగా అడిగింది ఒక్క మీ బాబుమాత్రమే! క్షణికమైన కోపానికిలోనై అతన్ని క్లాసులోనుండి బయటకు గెంటాను. తర్వాత నా నియంతృత్వానికి నేనే సిగ్గుపడ్డాను. బాబులాంటి పిల్లలు అరుదు. ప్రపంచానికి, పనికివచ్చే పైడిరత్నాలు. వాటిని మనం కళ్ళకద్దుకోవాలి! లేకపోతే మనం కళ్ళుగలిగివున్నా - అంధులతో సమానం -

ఇట్లు

". ...."

"ఉత్తరాన్ని చదివి అన్యాయంగా బాబును కొట్టానని విచారించాడు బాబుతండ్రి తనతప్పుకు పరిహారంగా బాబును పిలిచి ఒక రూపాయి యివ్వబోయాడు కాని ఆ పసిహృదయం ఏదో తెలియని బాధపడుతుంది. ఏవో అవ్యక్తమైన భావాలు సంఘర్షణ పడుతున్నాయిలాగుంది - తండ్రి యివ్వబోయిన రూపాయిని తీసికోలేదు బాబు!

బయట కుక్కలు అరుస్తున్నాయ్! బాబు వాకిట్లోకివచ్చాడు నాలుగు కుక్కలు ఒక కుక్కను కరవబోతున్నాయ్! అది తోక ముడుచుకొని గోడనానుకొని క్రింద పడుకొని కాళ్ళుపైకెత్తింది. మిగతా కుక్కలు దానిమీదకుదూకి కరవబోతున్నాయ్! - ఆదృశ్యాన్ని చూస్తూ అలాగే నిలబడిపోయాడు బాబు. ★

కాంచనద్వీపం

(31-వ పేజీ తరువాయి)

"నే నేం చెయ్యదలుచుకున్నానో చెప్పమంటావా?" అన్నాను.

"చెప్పు"

"విను. జాగ్రత్తగా వినండి అంతా. నేను కుర్రాణ్ణిగదా అని డబాయిద్దామనుకుంటున్నారేమో అదేం లాభంలేదు. మీరు నన్ను మోసగించలేరు. మీకు ఓడ దక్కలేదు, ఫ్లింట్ డబ్బు దక్కలేదు, మనుషులు దక్కలేదు. మీరు ఓడిపోయారు. దీనికి కారణం ఎవరో తెలుసా? నేను ఆరోజు రాత్రి ఆపిల్ పీపాలో దాక్కుని, మీ కుట్రయావత్తూ విని మా వాళ్లకు చెప్పింది నేను. హిస్పానియోలా లంగరుతాళ్లు తెంపి, దానిమీదవున్న కాపలా వాళ్లనిద్దర్నీ సముద్రానికి బలియిచ్చింది నేను ఓడను మీ కెవ్వరికీ తెలియనిచోట దాచింది నేను. కనక మీరు నన్నేదో డబాయించాలని చూస్తే పప్పులుడకవు నేనూ మిమ్మల్ని డబాయించాల్సింది. మీరంటే నాకేం భయంలేదు. చంపాలనుకుంటే చంపండి. నన్ను చంపినందువల్ల మీకేమీ లాభంలేదు. నన్ను వదిలేస్తే మీ ప్రాణాలు రక్షించటానికి ప్రయత్నిస్తాను"

నేను గుక్క తిప్పుకోటానికి ఆగాను ఇంతసేపు కళాసీలు నిశ్చేతనులై నాకేసి నోళ్లు తెరుచుకుని చూస్తున్నారు, చివరికిలాగన్నాను:

"సిల్వర్! ఇక్కడున్నవాళ్లలో నువ్వే మంచివాడివి. నన్ను చంపేస్తే చంపెయ్. కాని ఒక్క కోరిక చెల్లించు. డాక్టరుగారితో నేను వాళ్లకు ద్రోహం చెయ్యలేదనీ, అంతా మంచి బుద్ధితోనే చేశానని చెప్పు. ఇంతే నే కోరేది."

"జిమ్! అల్లాగే. జ్ఞాపకముంచుకుంటాను నువు చెప్పింది," అన్నాడు సిల్వర్. అతని ధోరణి చూస్తే హేళనగా అన్నాడో, లేక నాధైర్యానికి మెచ్చుకోలుగా అన్నాడో అర్థంకాలేదు.

"ఈ కుర్రాడింకోటికూడా చేశాడు. అప్పుడు నల్లకుక్కను కనిపెట్టింది కూడా ఇతనే అన్నాడు మోర్గన్. అంటే ఆరోజున టెలిస్కోప్ హోటల్లో సిల్వర్‌తో మాట్లాడిన మనిషే.

"తస్సదియ్యా, జిమ్ హాకిన్స్ బలేవాడులే. బిల్లీబోన్స్ దగ్గిర్నుంచి కాంచనద్వీపపటం కొట్టేసింది కూడా ఇతనే. మొదట్నుంచీ మనకి అడ్డంగానే వున్నాడు," అన్నాడు సిల్వర్.

"అయితే సఫా ఈదెబ్బతో", అంటూ మోర్గన్ చాకుతీసి నావేపు నడిచాడు.

"ఆగు", అని అరిచాడు సిల్వర్. "ఎవడ్రా నువ్వు? టామ్ మోర్గన్‌వి కాదూ? నాయకుడు నువ్వా నేనా? తస్సదియ్యా, ఒక్కడుగు ముందుకు వేశావంటే గుద్దుకు చంపేస్తాను. జాగర్త. ముప్ఫయ్యేళ్లనుంచీ నామాటకి ఎదురుచెప్పి బతికినవాడు లేడు ఈరోజుకు నువ్వు బయల్దేరావేం? తస్సదియ్యా అందర్నీ ఊచకోతగా నరికేస్తాను. ఏమనుకుంటున్నారో?" అని అడ్డం వచ్చాడు సిల్వర్.

మోర్గన్ ఆగాడు. కాని మిగతావాళ్లలో గుసగుసలు అధికమయ్యాయి.

"మోర్గన్ ఏం తప్పు చేశాడు?" అడిగాడొకడు.

"చాలా రోజుల్నుంచి చూస్తున్నాను, నీ ధోరణి. అంతా నీ ఇష్టమే! తప్ప మా ఇష్టం లేదా" అన్నాడింకొకడు.

నోట్లోంచి పైప్ తీసి సిల్వర్ తన అనుచరులందర్నీ ఒక్కసారి కలయచూశాడు.

"అయితే మీరంతా నాతో దెబ్బలాటకి సిద్ధంగా వున్నారా? మాట్లాడరేమర్రా ఒక్కళ్లూ? మీకు నోళ్లులేవూ? ఇన్నేళ్లు బతికి మీలాంటి వెధవ నన్నాసులకి జడుస్తాననట్రా? రండి. కత్తి తీసుకుని ముందుకు రండి ఎవరు వస్తారో? ఈ పైప్ ఆరిపోయేలోగా వాణ్ణి నరకానికి పంపిస్తాను, తస్సదియ్యా"

ఎవ్వడూ కదల్లేదు. ఎవ్వడూ నోరెత్తలేదు. సిల్వర్ మళ్ళీ పైప్ నోట్లో పెట్టుకుని "ఏం? ఒక్కడికీ దమ్ములులేవూ. ఛీ! మీ మొహాలు చూస్తే డోకొస్తోంది. ఒక్కడికీ మొగతనంలేదు. నేను మీకు కెప్టెన్‌ని. నన్ను మీరే ఎన్నుకున్నారు. మీ అందరిలోకీ నేనే మొగాణ్ణి కనక నన్నే ఎన్నుకున్నారు. మీకు నేనిష్టం లేకపోతే ఎవడైనాసరే ముందుకువచ్చి యుద్ధం చెయ్యండి అది మీకు చేతకాకపోతే నేను చెప్పినట్టు వినండి. ఆ కుర్రాడు మీకంటే నయం. అతనికున్న



సిల్వర్ "సుద్దుకుచం చేస్తాను జాగర్త!"

ధైర్యంలో పదోవంతు లేదు మీకు అతనిమీద చెయ్యి వెయ్యదలుచుకున్న వాడెవడో ముందుకు రండి"

తరవాత కొంతసేపు అందరూ నిశ్శబ్దంగా వున్నారు సిల్వర్ నా పక్షాన వాదించటంతో నాకు కొంచెం ఆశారేఖ తోచసాగింది కళాసీలు ఒకమూల చేరి కొంతసేపు గుసగుసలాడారు సిల్వర్ పెట్టె మీద కూర్చుని పైప్ తీసి ధ్యానంలో పడ్డాడు అయినా ఒక కంటితో అనుచరులను కనిపెట్టడం మానలేదు చివరికి తుపుక్కున ఉమ్మేసి ఇలా అన్నాడు

"మీరేదో చాలా చెప్పాలనుకుంటున్నట్లే వుందే? చెప్పండి త్వరగా"

"సిల్వర్! నువ్వు నీ ఇష్టం వచ్చినట్లు చేస్తున్నావు మాకు చాలా అసంతృప్తిగా వుంది ప్రతి ఓడసిబ్బందికీ కొన్ని హక్కులుంటాయి కొన్ని నియమాలుంటాయి మా హక్కుల్ని నియమాల్ని నువ్వు పాటించడంలేదు అందుచేత మేము కొంతసేపు ఆలోచించుకోవాలనుకుంటున్నాం," అని దురుసుగా అన్నాడొకడు

"మీ యిష్టం వచ్చినంతసేపు ఆలోచించుకోండి," అన్నాడు సిల్వర్

ఇందాకటి కళాసీ సిల్వర్‌కు సెల్యూట్ చేసి అవతలికి పోయాడు ఇంకొకడు సిల్వర్‌కు చాలా వినయంగా సెల్యూట్ చేసి తడబడుతున్న అడుగులతో బయటికి వెళ్లాడు ఇల్లా ఒకళ్ల తర్వాత ఒకళ్లు సెల్యూట్ చేసుకుంటూ పోయారు నేను, సిల్వర్ మాత్రమే మట్టికోటలో మిగిలాము సిల్వర్ నోట్లోంచి పైప్ తీసివేసి మొదలెట్టాడు

"జిమ్! వెంట్రుకవాసిలో నీకు చావు తప్పింది నన్ను వాళ్లు తొలగిద్దామనుకుంటున్నారు, కాని నీ కేమీ అపాయం రానివ్వను అసలు నువ్వు ఇందాక మాట్లాడిందాకా నిన్ను రక్షించాలనుకోలేదు కాని, నీ ధైర్యంచూసి, ఆశ్చర్యపోయాను నిన్ను రక్షిస్తే నన్నుకూడా నువ్వు రక్షించగలవనుకున్నాను"

"నేను చెయ్యగలిగింది చేస్తాను," అన్నాను

"ఏం లేదు అవసరమొచ్చినప్పుడు నాకు సహాయం చేస్తానని మాటివ్వు తక్కిందంతా నేను చూసు

కుంటాను. ఈ వెధవల్లో ఒక్కడికీ బుర్రలో మెదడు లేదు. నాకు మెదడున్నది అందుచేత నే నిప్పుడు జమీందారుగారి పక్షం చేరిపోయాను. ఆ బడు నెక్కడ దాచావోగాని, భద్రంగా వుందని నాకు తెలుసు. హాండ్సని, ఓబ్రియన్ని ఆఖరు చేశావనికూడా తెలుసు. కనక చూడు నువ్వూ నేనూ కలిసి వీళ్ల కళ్లలో దుమ్ముకొట్టి తప్పించుకోవాలి."

సిల్వర్ పెట్టెమీదనుండి లేచాడు. పెట్టె తెరిచి బ్రాందీ సీసా తీశాడు.

"కాస్త దాహం పుచ్చుకుంటావా జిమ్?"

"అక్కర్లేదు."

"సరే, నేను పుచ్చుకుంటాను. ఇప్పుడు ఈ వెధవలతో కాస్త చెయ్యా చెయ్యా కలపాల్సి వస్తుందేమో? అన్నట్లు జిమ్! మీ డాక్టరుగారు ఆ పటం నాకు ఎందు కిచ్చేశాడంటావ్?"

నేను తెల్లబోతూ చూశాను. నాకా విషయం ఏమీ తెలియదని గ్రహించాడు గావును సిల్వరు మరి దానిసంగతి ఎత్తలేదు.

"ఇచ్చాడులే, నీకు తెలియదేమో? కాని అందులో ఏదో మోసం వున్నట్టు నాకు అనుమానం," అంటూ సిల్వర్ గడగడ బ్రాందీ తాగాడు

(ఇంకావుంది)

రణ్జిత్‌వారి "హమ్‌లోగ్"

(హిందీ సాంఘిక చిత్రం)

రచన, డైరెక్షన్ జియాసార్ హాదీ
పాటలు విశ్వామిత్ర అదిల్, ఉద్ధవ్ కుమార్
సంగీతం రోషన్
ఫొటోగ్రఫీ ద్వివ్రా,
శబ్దగ్రహణం కె వి షా
ఆర్టు ఎస్ ఎ వాహాబ్
సెటింగులు జాగూ

నటీనటులు నూతన్, బల్రాజ్ సహానీ, దుర్గాఖోటే, శ్యామా, సజ్జన్, అన్వర్ హుసేన్, కన్హైలాల్, రషిద్‌ఖాన్, కకూ వగైరా

ఈనాడు వెలువడుతున్న చిత్రాలలో ఇది అనేక విధాల విశిష్టతగల చిత్రం మొదటి సంగతి, ఇది వినోదం కొరకు తీసిన చిత్రం కాదు, ఈ చిత్రం చూస్తూ ఆనంద పారవశ్యం పొందటం సాధ్యం కాదు ఇది జీవితాన్ని ప్రతిబింబించే ఉద్దేశంతో తీసిన చిత్రం, జీవితంలో ఏ భాగాన్ని ప్రతిబింబిస్తుందన్న విషయం కథ చూస్తే తెలుస్తుంది మూడో విషయ మేమంటే ఈ చిత్రం ప్రేక్షకులను గౌరవిస్తుంది-చాలా చిత్రాలు గౌరవించవు ఇతర చిత్రాలను తయారుచేసేవారికి ప్రేక్షకులపై గల భావాలు ఈ చిత్రంలోనే ఒక పాత్ర ద్వారా వ్యక్తం చేయబడ్డాయి "ప్రజలు మూఢులు, దేవుడిదయవల్ల వాళ్లు చాలుగు కాలాలపాటు అట్లాగే ఉండాలి వాళ్లను మూఢులను చెయ్యటానికే మనం నాటకాలు ప్రదర్శించాలి," అంటుంది ఈ పాత్ర ప్రజలలో సర్వశక్తులూ ఉన్నవనీ, వారినుంచి చైతన్యం ప్రభవిస్తుందనీ ఈ చిత్రం విశ్వసిస్తున్నది

ఈ చిత్రానికి కథానాయిక పారో (నూతన్) క్షయరోగి అయినపిల్ల ఈమె తండ్రి లాలాజీ (కన్హైలాల్) సేట్‌జీ దగ్గిర 80 రూపాయల గుమాస్తా పారోతల్లి (దుర్గాఖోటే) తన భర్తతోనూ ముగ్గురు బిడ్డలతోనూ ఉపాయంగా సంసారం ఈదుకొస్తోంది పెద్దవాడు రాజ్ (బల్రాజ్ సహానీ) సాంఘిక వ్యవస్థపై విశ్వాసం లేనివాడు

పారోకు చికిత్స చేయవలిసి వచ్చేసరికి దారిద్ర్యం ఈ కుటుంబాన్ని మరింత బాధిస్తుంది ఈ దారిద్ర్యం కారణంగా రాజ్ తనను ప్రేమించే నేపాలీ (శ్యామా) ప్రేమను స్వీకరించలేడు తన రోగం కారణంగా పారో ఆనంద్ (సజ్జన్) ప్రేమను స్వీకరించలేకపోతుంది

ఈ స్థితిలో ఒకనాడు రాజ్ తన తండ్రి ఇంట తెచ్చిపెట్టిన సేట్‌జీ డబ్బు పెట్టె తిరస్కరించి తన మిత్రుడైన కుందన్ (అన్వర్ హుసేన్) ఇంట దాస్తాడు కుందన్ పెట్టె పగలగొట్టి డబ్బు పట్టుకుపోయి జూదంలో పోగొట్టుకుంటాడు. లాలాజీ జైలుకు పోతాడు కుటుంబభారం మీద పడగా రాజ్ అతిగా శ్రమించి గుండె జబ్బు తెచ్చుకుంటాడు ఇంతలో కుందన్ తిరిగి రాజ్ కంటపడి, రాజ్ తనను ద్వేషించటం లేదని తెలుసుకుని పశ్చా



"హమ్‌లోగ్" చిత్రంలో రాజ్ పాత్రను సమర్థతతో నటించిన బల్రాజ్ సహానీ

తాపపడి ఆత్మహత్య చేసుకుంటాడు రాజ్ అతనిని హత్య చేశాడని విచారిస్తారు విచారణసమయంలో జరిగినది చెబుతూ రాజ్ మరణిస్తాడు పారో రాసిన నాటకం "హమ్ లోగ్" అన్నది ఆనంద్ సహాయంతో ఆడబడుతుంది రాజ్ కోర్టులో సాక్ష్యంచెబుతూ అన్న మాటల లోని యథార్థాన్ని ఆ నాటకం ప్రచారం చేస్తుంది

ఈకథలో కొన్ని గమనించదగిన విషయాలున్నాయి ఈ కథలో దారిద్ర్యం ఉన్నది గాని అది కార్మికుల దారిద్ర్యం కాదు పారో నాటకం రాసే తాహతు గలది మిగిలిన పాత్రలకు కూడా ప్రేమ అంటే ఏమిటో, స్నేహమంటే ఏమిటో, నీతి ఏమిటో తెలుసును జీవితంలో అవి లేకుండా పోయినందుకు ఆ పాత్రలు బాధ పడతాయి అన్నిటి స్థానమూ డబ్బు ఆక్రమించుకున్నందుకు అవి చింతిస్తాయి

అన్ని పాత్రలలోను ఉదారమైన పాత్ర రాజ్ ఆనంద్ తన డబ్బు ఎత్తుకుపోయినాడని ఆగ్రహించాడు "అందులో ఏముంది? నేనూ దొంగనే మనమంతా దొంగలమే," అంటాడు ఆనంద్ లో కూడా మానవత్వం పూర్తిగా నశించలేదు "ఇదేం జీవితం, రాజ్? ఇందులో ఎట్లా బతకటం?" అంటాడు "మానవుడు నశించడు," అంటాడు రాజ్ అదే అతని దృఢ విశ్వాసం

ఎన్నోచోట్ల ఈ చిత్రం అతి చిన్న సన్నివేశాలలో గుండెను గుచ్చుకుంది తల్లి దారిన పోతూ ఉండగా వైద్యుడు కనపడి పారో ఆరోగ్యం గురించి ప్రస్తావించి ఆ పిల్ల బట్టలూ, లోటాలూ, కంచాలూ ఎడంగా ఉంచమంటాడు ఆమె ఇంటికి వచ్చేసరికి అక్క తాగిన లోటానుంచి తమ్ముడు తాగబోతూ ఉండటం చూసి ఆమె కేకపెట్టి మరుక్షణం పెద్దపెట్టున ఏడుస్తుంది కేవలం శోకం కంటె బాధతో కూడిన ఏడుపుకు ఈచిత్రంలో ప్రాముఖ్యం ఉంది

చిత్రంలో సంభాషణలు పరిమితంగానూ, శక్తివంతంగానూ ఉన్నాయి ఫొటోగ్రఫీ, రికార్డింగు బాగున్నాయి గాని, ఫొటోగ్రాఫరు పాత్రల ముఖాలను సగం వెలుగులోనూ, సగం చీకటిలోనూ ఉంచటం అతిగా చేశాడు సంగీతంకూడా కొత్త బాణీలో ఉన్నది

నటులలో బల్రాజ్ సహానీ అత్యద్భుతంగా నటించాడు దుర్గా ఖోటే, నూతన్, శ్యామా, అనవర్ హుసేన్, రషీద్ ఖాన్ మొదలైనవారు కూడా చాలా బాగా నటించారు

ఈ చిత్రాన్ని సృష్టించిన జియాసార్ హదీ అన్నివిధాలా అభినందనీయుడు అందరూ చూడదగిన కొద్దిపాటి మంచి చిత్రాలలో "హమ్ లోగ్" ఒకటి ★



భరణీవారి "ప్రేమ" లో నాయికా నాయకులు భానుమతి, నాగేశ్వరరావులు



వాహినీవారి "మల్లీశ్వరి"లో—భానుమతి



"మానవతి"లో ఒక ముఖ్యపాత్ర ధరిస్తున్న ముక్కామల

సర్వోదయా వారి "మానవతి

చాలాకాలం క్రిత వై వి రావు గారి దర్శకత్వంతో ప్రారంభమైన సర్వోదయా వారి "మానవతి షూటింగు ఇంచుమించు పూర్తిఅయినట్టూ ఈ డిసెంబరులోనే విడుదల కానున్నట్టూ తెలుస్తున్నది

అయితే సర్వోదయావారు నవంబరు 30 న డి వై వి రావుగారిని 'మానవతి దర్శకత్వంనుంచి తొలగించారట రావుగారు ఈ చిత్రంపట్ల అశ్రద్ధ వహించారనీ బుద్ధిపూర్వకంగా షూటింగు సాగదీశారనీ నటులకు మేకప్ చేయించి కూడా కామెరా ముందుకు రప్పించక వారికి నిరుత్సాహం కలిగించారనీ సర్వోదయావారు వై వి రావుగారిమీద ఆరోపణ చేసినట్లు తెలుస్తున్నది దానిపై రావుగారు డిసెంబరు 5న 'మానవతి చిత్రంపై వారం రోజుల కై పొందిన ఇంజంక్షను సంపాదించి తాను చిత్రం చాలావరకు తీశాననీ ఈ తరుణంలో తనను తొలగించడంవల్ల తనకు నష్టమనీ అందుచేత తాను లేకుండా చిత్రం షూటింగు జరగరాదనీ అన్నారట 'మానవతి చిత్రం వై వి రావుగారి దర్శకత్వంతో పూర్తిఅయేదీ ఆయన దర్శకత్వం లేకుండా పూర్తిఅయేదీ త్వరలోనే తేలగలదు

"హమ్ లోగ్ నటులకు సన్మానాలు

రంజిత్ వారి "హమ్‌లోగ్ చిత్రంలో మామూలు ఆకర్షణలు ఏమీ లేకపోయినా అది బొంబాయిలో చాలా విజయవంతంగా నడిచింది (సమీక్ష ఈ సంచికలో చూడండి) రంజిత్ కంపెనీ యజమానులైన చందులాల్ షా గోహర్ బాయిగార్లు బొంబాయి లిబర్టీ సినిమాలో హమ్ లోగ్ ఆఖరు ప్రదర్శన తొలూకు రాబడి రు 10 500 లు బాలవికలాంగుల పోషణకుగాను దానం చేస్తూ అదే దర్బారులో "హమ్‌లోగ్ నటులకు బంగారు తకోలు బహూకరించారు చిత్రానికి దర్శకత్వం వహించిన జియాసర్ హాదీకి లేడీ రామారావు బల్రాజ్ సహానీ జనంకు రాజకపూర్ కన్హైలాల్ అన్వర్ హుసేన్ లకు గోప్, ప్లేబాక్ పాటలు పాడిన లతా



మోడరన్ థియేటర్స్‌వారి 'ఆడజన్మ"లో నారాయణరావు, లక్ష్మీప్రభ

మంగేశ్కర్, ముఖేశ్ లకు గోహర్ బాయీ బహుమతు లందజేశారు నాయికా పాత్ర ధరించిన నూతన్ గాని, సంగీత దర్శకుడు రోషన్ గాని సన్మానానికి రాలేదు ఒక్కొక్కరూ బహుమతులు పుచ్చుకొంటుంటే ప్రేక్షకులు పెద్దపెట్టున హర్షధ్వానాలు చేసి "హమ్‌లోగ్" చిత్రంపై తమకు గల అభిమానాన్ని వెలువరించారు

"పెద్ద మనుషులు"

వాహినీ ప్రొడక్షన్స్‌వారి "మల్లీశ్వరి" ఈ నెల 20న విడుదల కాగానే కె వి రెడ్డిగారి "పెద్దమనుషులు" అనే సాంఘిక చిత్రం పని ఆరంభ మవుతుంది దీనికి కథ తయారుచేయడానికి నియోగించబడిన డి వి నరసరాజుగారు కొంతకాలంగా కథారచనలో మునిగిఉన్నారు ఇది కె వి రెడ్డిగారి మొదటి సాంఘిక చిత్రం ఇదివరలో ఆయన పోతన, వేమనలగాథలూ, "గుణసుందరి కథ," "పాతాళ భైరవి"అన్న జానపదగాథలూ చిత్రాలుగాతీసి, వాటిని తయారుచెయ్యడంలో తమ ప్రతిభను

శ్రీ సత్యదేవ్ పజిల్ నెం 19 కీ సొల్యూషన్ —అడ్డము - 1 శ్రీ వెంకటేశ్వరుడు, 4 కల, 5 దీవి, 6 తుణము, 7 వాణి 9 నారి, 10 అంతకుడు, 13 రంభ, 14 అకారణము, 16 వస్త్ర్యము, 18 హంస, 19 హయము, 21 తొత్తు, 22 బొగ్గులు నిలువు - 1 శ్రీవృక్షము, 2 కట్నము; 3 రుక్మిణి, 4 కవి, 7 వారిధి, 8 కీడు, 9 నాటకము, 11 తగరము, 12 విభవ, 14 అకాముడు, 15 ముదుసలి, 17 లేహము, 20 సిగ్గు



విజయావారి "పెళ్ళిచేసి చూడు"లో వియ్యన్న మాట వినకుండా వెంకటపతి రమణను లాక్కుపోతున్నాడు అమ్మడికి తన భర్త పాదాలు క్షణంపాటు దొరికాయి—రంగారావు, డా కూచిభొట్ల, రామారావు,వరలక్ష్మి

పెళ్లడి చిఉన్నారు సాఘిక చిత్ర నిర్మాణ లోకూడా ఆయన తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటారని ఆశించవచ్చు

భారతీయ చిత్రాల పోటి

1950 ఏప్రిల్ 1 అన తర తయారైన భారతీయ చిత్రాలలో ఉత్తమ చిత్రానికి ఇండియా ఫిలిం ఫెడరేషన్‌వారు బహుమతి ఇస్తున్నారు ఈపోటిలో 14 బొంబాయి చిత్రాలూ 7 బెంగాలీ చిత్రాలూ 5 మద్రాసు చిత్రాలూ 4 ప్రాంతీయ చిత్రాలూ పాల్గొంటున్నాయి మద్రాసు చిత్రాలలో 3 తెలుగు చిత్రాలు "జీవితనౌక" "సంసారం" "పాతాళభైరవి", మిగిలిన రెండూ తమిళ చిత్రాలు పక్షిరాజావారి "ఏళైపడుం పాడు" జెమినీవారి "సంసారం"

ఇండియాలో జరుగనున్న అంతర్జాతీయ సినిమా మహోత్సవాలలో ప్రదర్శనార్థం 21 భారతీయ చిత్రాలూ 5 ప్రాంతీయ చిత్రాలూ 1950 అక్టోబరు 1 అన తర తయారైనవి ఆయా స్థానిక చిత్రనిర్మాతల సంఘాలకు సమర్పించబడాయి. ఆ సంఘాలు ఎన్నుకొన్న చిత్రాలను ఫిలిం ఫెడరేషన్‌వారు 4 చిత్రాలను ఎరుకుంటారు

ఉత్తమ చిత్రానికి విలేఖరుల బహుమతి

రానున్న అంతర్జాతీయ సినిమా ఉత్సవాల సందర్భంలో కలకత్తాలో ప్రదర్శించబడే ఉత్తమచిత్రానికి తగిన బహుమానం ఇవ్వడానికి బెంగాలు సినిమా రచయితల సంఘంవారు నిర్ణయించారు

విప్లవకారుడి చిత్రం

చరిత్ర ప్రసిద్ధిగన్న బెంగాలీ విప్లవకారుడైన ఖుదీరాం బోస్ అన్న కుర్రవాడి గాథను హిరణ్మయిసేన్ అనే యువకదర్శకుడు చిత్రంగా తయారుచేశాడు ఈ చిత్రం గతవారం కలకత్తాలో విడుదల అయి విజయవంతంగా నడుస్తున్నట్టు తెలుస్తున్నది ఖుదీరాం బోస్ బెంగాలు విభజన కాలంలో తన ప్రాణాలను దేశంకోరకు అర్పించిన మహావీరుడు మనదేశ స్వాతంత్ర్య సమరంలో పైకి వచ్చిన వీరుల గాథలు ఈవిధంగా చిత్రాలుగా తయారు చేసినట్లయితే ప్రజలలో ఎంతో చైతన్యం కలుగుతుంది ★

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

(7-వ పేజీ తరువాయి)

విషం కనపడింది డాక్టర్ దానిని శ్రద్ధగా పరిశీలిస్తున్నాడు హిలాయ్ విల్ ఫర్ట్ కి నోటమాటరాలేదు ఎంత జాగ్రత్తవహించినా విషం బయటపడ్డం విధినిర్ణయమనుకుంది డాక్టర్ వేలు ముంచి ఒక చుక్క రుచి చూశాడు "అబ్బ! విషం కాని ఇది పాతరకం కాదు మారింది" అన్నాడు హిలాయ్ విల్ ఫర్ట్ మెల్లిగా తన గదిలోకి తప్పుకుంది

విల్ ఫర్ట్ తన కళ్లు తాను నమ్మలేనట్లు ఇలా అన్నాడు "ఏమిటి? వాలంటన్ చనిపోవడమా?"

"అవును వాలంటిన్ చనిపోయింది" అన్నాడు డాక్టరు

"చనిపోయిందెవరు?"

విల్ ఫర్ట్ డాక్టరూ గుమ్మం వంక చూశారు. మారెల్ విభ్రాంతుడై నిలబడ్డాడు

విల్ ఫర్ట్ తెల్లపోయాడు "ఎవరు మీరు?" అన్నాడు. "ఇదేమి మర్యాద? వెళ్లండి వెంటనే వెళ్లిపొండి" వెళ్లమన్నట్లు డాక్టర్ సంజ్ఞ చేశాడు మారెల్ గుడ్లు పెద్దవైనాయి జుట్టు పీక్కుంటూ వెళ్లిపోయాడు డాక్టర్ తెల్లబోయాడు "పిచ్చెక్కింది!" అన్నాడు విల్ ఫర్ట్

అయిదు నిమిషాల్లో మెట్లవద్ద బరువైన పద ధ్వనులు వినవచ్చాయి నయర్ టైర్ ను కుర్చీతోసహా మారెల్ మోసుకువచ్చాడు. కుర్చీ దింపాడు వృద్ధుని ముఖం పాలిపోయుంది కన్నులలో నిప్పులు చెరుగుతున్నాడు మారెల్ వృద్ధుని చెయ్యి పట్టుకున్నాడు.

"మీరు చెప్పండి వీరికి నేనెవరని అడుగుతున్నారు నాకిక్కడ పనేమిటని అడుగుతున్నారు చెప్పండి" అన్నాడు

వృద్ధుని గుండెలు నిట్టూర్పుతో బ్రద్దలౌతా యనిపిస్తున్నది కన్నీరు ధారలు కట్టింది మారెల్ దుఃఖాన్ని అణుచుకుంటూ అన్నాడు "చెప్పండి వారికి, ఆమె నా ప్రియురాలని, నా ప్రాణమని" మారెల్ గబగబ పడక సమీపించి పరుపులో తల దాచుకుని ఏడ్వనారంభించాడు ఎవరికీ నోట మాట రాలేదు కొంతసేపటికి విల్‌ఫర్డ్ మారెల్ భుజంపైన చెయ్యివేశాడు "మీ రామెను ప్రేమించారని చెప్తున్నారు కాని ఆమె ఈ లోకం విడిచి వెళ్ళిపోయింది ఇంక ఫాదరీని పిలవడం తరవాయి"

"కాదు" అన్నాడు మారెల్ కోపంతో "ఫాదరీ చాలదు పగతీర్చుకోవాలి విల్‌ఫర్డ్! మీరు ఫాదరీకి కబురు పంపండి పగతీర్చుకోవలసినది నేను" పిచ్చివా డన్నట్లు అందరూ చూశారు సయర్ బైర్ కళ్లు తళతళ లాడాయి డాక్టర్ దగ్గరకు వచ్చాడు

మారెల్ ఇలా అన్నాడు "నేనేం చెప్తున్నానో నాకు పూర్తిగా తెలుసును వాలంటిన్ హత్యచెయ్యబడిందని మీకూ తెలుసును హంతకు లెవరో పట్టుకోవాలి ఇందులో జాలికి చోటు లేదు హంతకుని పట్టుకోవలసిన కర్తవ్యం మీది విల్‌ఫర్డ్!"

"పొరపడుతున్నారు" అన్నాడు విల్‌ఫర్డ్ "ఇక్కడ హత్యలు చేసేవా రెవరూ లేరు ఇదంతా నా ప్రారబ్ధం నా దుర్దినాలు అంతే"

"కాదు ఇక్కడ హత్యలు జరిగాయి" అన్నాడు మారెల్ బిగ్గరగా గొంతు చించుకుంటూ "ఈ యింటిలో ఇది నాలుగో హత్య ఇదంతా మీకు తెలుసును ఈ డాక్టరే మొదట మిమ్మల్ని హెచ్చరించారు"

"మీకు మతి స్థిరం తప్పింది" అన్నాడు విల్‌ఫర్డ్, ఉచ్చులోనుంచి తప్పించుకోడానికి తుదియత్నంగా

"నాకు మతి స్థిరంతప్పిందా? డాక్టర్! మీరే చెప్పండి సెంట్‌మిరాజ్ భార్య చనిపోయిన రోజు రాత్రి తోటలో మీరు విల్‌ఫర్డ్‌కి చెప్పలేదా?" విల్‌ఫర్డ్, డాక్టర్ ముఖముఖాలు చూసుకున్నారు "జ్ఞప్తికి తెచ్చుకోండి మీ మాటలు అప్పుడే నా చెవిని పడ్డాయి ఇది హత్య అనే సంగతి అందరికీ తెలుసు మీ రింక ఎవరి కన్నులూ కప్పలేరు తండ్రి తన కర్తవ్యాన్ని మరిచిపోయినా వాలంటిన్ హత్యకు నేను పగతీర్చుకుంటాను"

"నేనూ హంతకుని శిక్షించి తీరా లంటాను" అన్నాడు డాక్టర్ గంభీర స్వరంతో "నాకు రక్తం ఉడికిపోతోంది వీరికి తనంవల్ల, మనోదౌర్బల్యంవల్ల హంతకునికి, నేను తోడ్పడినట్లయింది" "అయ్యయ్యో!" అని మూలిగాడు విల్‌ఫర్ మారెల్ వృద్ధునివంక చూశాడు "సయర్ బైర్ ఏదో చెప్పా లనుకుంటున్నారు ఆగండి" అన్నాడు

వృద్ధుని సమీపించి మారెల్ ఇలా అడిగాడు "హత్యచేసిన దెవరో మీకు తెలుసునా?"

తెలుసునన్నట్లు చూశాడు వృద్ధుడు

"ఎవరో చెప్పగలరా?"

వృద్ధుడు ద్వారంవంక చూశాడు "నన్ను వెళ్ళిపోవాలంటున్నారా?" అన్నాడు మారెల్ దీనంగా.

"అవును"

"నే నొక్కడినేనా?"

"కాదు"

"ఇంకెవరు? డాక్టర్ కూడానా?"

"అవును"

"విల్‌ఫర్డ్ ఒక్కరితోనూ మాట్లాడతారా?"

"అవును"

మారెల్, డాక్టర్ ఇద్దరూ కలిసి సావడిలోకి వెళ్ళారు. విల్‌ఫర్డ్ తలుపు మూశాడు కొంతసేపైన తరవాత తలుపు తెరుచుకుంది "రండి" అన్నాడు విల్‌ఫర్డ్ విల్‌ఫర్డ్ ముఖంలో ఉద్రేకం, దుఃఖం ఉట్టిపడుతున్నాయి ముఖమంతా చెమటతో నిండింది చేతిలో విరిగిన కలంముక్క లున్నాయి బొంగురుపోయిన గొంతుతో ఇలా అన్నాడు "ఈ ఘోరరహస్యాన్ని ఇంకెవ్వరికీ తెలియనివ్వరని నావద్ద ప్రమాణం చెయ్యండి"

ఇద్దరూ తెల్లబోయారు

"ఫరవాలేదు భయపడకండి" అన్నాడు విల్‌ఫర్డ్ "పగ తీర్చుకోవాలని నా తండ్రిగారుకూడా తహతహ లాడుతున్నారు" అంటూ తండ్రివైపు చూశాడు

అవునన్నట్లు చూశాక వృద్ధుడు మారెల్ బాధతో మూలిగాడు విల్‌ఫర్డ్ మారెల్ చెయ్యి పుచ్చుకున్నాడు "నా మాట నమ్మండి మూడు రోజుల్లో నా బిడ్డహత్యకు ప్రతీకారంచేస్తాను నా ప్రతీకారం చూస్తే మీరే భయపడతారు"

"ఈయన మాట నమ్మవచ్చునా?" అన్నాడు మారెల్ వృద్ధుని వంక చూసి

అవునన్నట్లు చూశాడు వృద్ధుడు

"రహస్యాన్ని కాపాడి నా వంశగౌరవాన్ని సంరక్షిస్తారని ప్రమాణం చెయ్యండి పగతీర్చుకునేకర్తవ్యాన్ని నాకు విడిచిపెట్టండి" అన్నాడు విల్‌ఫర్డ్ డాక్టర్ అయిష్టంతోనే తల ప్రక్కకు తిప్పి "అలాగే" అన్నాడు వినపడీ వినపడనట్లు మారెల్ గభాలున పడకవద్ద మోకరిల్లి వాలంటిన్ హృదయంలో ముఖం కప్పుకుని దుఃఖించాడు తరవాత ఛరాలున లేచి గబగబ నడిచి వెళ్ళిపోయాడు ఇంటి ప్రక్కనే ఉన్న ఫాదరీవచ్చి శవంవద్ద దైవప్రార్థన మొదలు పెట్టాడు ★

అపశ్రుతి

(25-వ పేజీ తరువాయి)

"కాదంటావా బుచ్చీ? కాయితాల మీద కనబరచుకొనే సుభాషితాలని మన బతుకులమీద ప్రయోగించుకోలేం శేఖరం గొప్పఆదర్శాలు గల వ్యక్తే ఇతరుల్ని ఆదేశిస్తూ వెలుగులోకి పొమ్మంటాడు కాని తన యింట్లో మాత్రం తన చేతులతోనే కారుచీకట్లని విధిస్తాడు"

విషయాన్ని కొద్దిగా అర్థం చేసుకోగలిగాడు ఒక క్షణం నిశ్శబ్దంగా వుండి తర్వాత—అసలు విషయాలు విపులంగా తెలుసుకోవాలనే కాంక్షకొద్దీ అడిగాడు

"అసలు జరిగిన సంగతేమిటి జానకీ?"

ఇంకా వూహించలేదూ? శేఖరం మనస్సంతా చీకటి గుహ పైకి గంభీరంగా వుండాలని ప్రయత్నిస్తాడు అందుకోడు, నేను కాస్త మంచిబట్టలు కట్టుకొని అలా ఒక్కరైనా షికారుకి వెళ్లితే అత్త అనుమానాలు, మాటకిమాటంటే మామగారి తిట్లు అప్పుడే శేఖరం మనిషినని మరచి పశువులా ప్రవర్తిస్తాడు"

బుచ్చి పెదవులు వొణికాయి "శేఖరం చెయ్యి చేసుకొంటాడా?"

"కాదు చింతరువ్వలు వుపయోగిస్తాడు"

"హాఁ!"

"అవును బుచ్చి నేనా హింసలు సహించలేకపోయాను స్కూల్లో చదువుకోవడంవల్ల కాస్తగా తలెత్తిన నా మానసత్వం ఎదురు తిరిగింది ఎదిరించాను ఒకరోజు పర్యవసానం యింట్లో అందరూ నన్ను కుక్కలా బాధించారు"అంటూ ముఖాన్ని చేతుల్లో దాచుకొని ఏడుస్తుంది

బుచ్చి నోట మాటలేదు కోపంతో ఒళ్ళంతా వణికింది శ్వాస తీవ్రమయింది

జానకి కళ్లు తుడుచుకొని మళ్లా ప్రారంభించింది:

"అంట్లు తోమడం దగ్గరనించి, కాళ్లు పిసకడం వరకు నాదేనట! తీరుబడి చేసుకొని ఎప్పుడైనా పుస్తకంవిప్పితే, అనుమానమో లేక కోపమో అత్త ఏదో ఒక పని పురమాయించేది వచ్చినట్టు నోరు నొక్కుకొని చేసేదాన్ని కాని రాత్రి పదింటి వరకూ "ఒకటే పనైతే ఇక నేను మాత్రం మనిషిని కాను?"

"శేఖరం యివన్నీ చూస్తూ వూరుకొనేవాడా?"

"హాఁ! ఒక రోజున చెప్పాను—అతని దగ్గర నాకున్న చనువునుబట్టి తల్లిని కోప్పడ్డాడు మర్నాడు మళ్లా చెప్పాను ఈసారి తల్లిని ఏమన్నా అన్నాడో లేదో తెలీదు మూడోసారి చెప్పేసరికి యింతెత్తున లేచాడు తర్వాత నేను చెప్పనూ లేదు, అతను నా కష్టసుఖాలని అడగనూ లేదు కాని తల ఒంచేకొద్దీ తిట్ట నారంభించారు ఇక సహించలేక ఒకరోజున చెయ్యెత్తాను వెంటనే ఫలితం కనిపించింది"

జానకి కన్నీళ్లు తుడుచుకొని మళ్లా అంది

"అక్కడికి వెళ్లిన తర్వాత సినిమామాటే మరచిపోయాను ఒకవేళ వెళ్లినా నన్ను ఆడవాళ్ళల్లో కూచోమనేవారు ఖర్మా లేదు సినిమాల్లో గూడ మన దేశంలో ప్రత్యేక పరదాలుంటాయి-దానిక్కాదు నేననేది నేను గూడ ఆయనలానే స్పెషల్ క్లాసులో మగవాళ్ళతో ఎందుక్కూచోగూడదు? కూచున్నంతలో ఆ పక్కమనిషి మీద అమాంతంగా ప్రేమ పుట్టుకొచ్చేస్తుందా? నీతో నేను ఎన్నిసార్లు సినిమాకి రాలేదు? అదంతా ఆయనలో వున్న చీకటి ఆడదానిమీద ఆయనకున్న చిన్నచూపు"

అని క్షణం ఆగి అంది

"బుచ్చీ! పిల్లలు కలక్కపోవడం నా తప్పే? చెప్పు? నీ దగ్గర నాకున్న చనువుని బట్టి అడుగుతున్నాను ఏ చిన్న వంక దొరికినా యిరుగు పొరుగుల వాళ్ళతో గొడ్రాలుముండని తిట్టి శపించేది ఊరందరికీ లోకువ చేసేశారు నేను బయటికివస్తే చాలు ఆ యిల్లాళ్లు మూతులమీద మూతులు పెట్టుకొని 'దొరసాని'అంటూ నవ్వేవారు. నేను నిలువునా కూలిపోయేదాన్ని"

"ఇందులో చెప్పేవాళ్ళు వినేవాళ్లు ఎలాంటి అనుభూతుల్ని పొందుతారోగాని ఊసులు అనేసరికి పదిమంది యిల్లాళ్లు మా గుమ్మం మీదికి చేరిపోయేవారు యజమానులే లోకువిస్తే, ఈ ఆడవాళ్లు లోకువ చెయ్యడం ఏంకొనుక్కరావాలా? తమ చిత్తం వచ్చినట్టు మాటాడేవారు

"నేను చదువుకొనేప్పుడు, ఈ వీధిలో అలాంటి ఆడవాళ్ళ కబుర్లు వింటూ—వాళ్లని నయాన ఒక దారికి తీసుకవస్తే, ఈ "స్కాండల్స్" మాట్లాడం మానేస్తారని అనుకొనేదాన్ని దాన్నిబట్టి ఆడదానికి ఒక విధమైన వ్యక్తిత్వం వస్తుందని కాని అవన్నీ అనుభవంతో అసాధ్యాలే అని తెలుసుకున్నాను ఆడదాన్ని చెరకుగడలా మెషిన్లలో పెట్టి రసం పిండి, పిప్పి చేసి దాంతోనే కాల్చి నాశనం చేసేస్తారు ఆడదానికి స్థానం లేదు దానికి అగిచేం

దుకు గొంతుక లేదు అరిస్తే నొక్కేస్తున్నారు"అంటూ ఏడ్చింది

బుచ్చికి గూడ కళ్ళనీళ్ళ పర్యంతం వచ్చింది మెల్లగా అన్నాడు "జానకి నిన్ను ఆ నరకంలోకి నిజంగా నేనే తోసేశాను"

"పర్యవసానాలు యిలా అవుతాయని నువ్వుమాత్రం కలగన్నావా బుచ్చి"

"నీ జీవితాన్ని నిజంగా నేనే అగ్గిపాలు చేసేశాను"

"అదుగో మళ్లా అలా కష్టంగా అంటావ్! ఇందులో నీ తప్పేముంది? శేఖరంలో నీకు కనిపించిన సుగుణాలనిబట్టి నువ్వలా చేశావ్ అసలు శేఖరం స్వతఃగొప్పవాడే కాని తలిదండ్రుల మాటలు విని రెచ్చిపోయేవాడు నేనా బాధలు పడలేకపోయాను"

"ఆయితే."

"అయితే లేదు, గియితే లేదు నేనిక ఆ గడప తొక్కను, శేఖరం ముఖం చూడను అతను సహజంగా గొప్పవాడే గాని, యితర్ల మాటలకి లొంగిపోతే మనిషిగా పుట్టెందుకు? అలాంటి దుర్బలుడుతో కాపురం చేసేకంటె జీవితాన్ని యిలా గడుపుకొంటే నయం"

"జానకి!"

"అవును బుచ్చి, విడాకుల దావా వేయడానికే వచ్చేశాను"

బుచ్చి నోట మాట లేదు స్తంభించిపోయాడు

"అవును బుచ్చి, ఆ మాట అంటూనే తిరిగి వచ్చేశాను"అని తల దింపుకొని మెల్లగా అంది "నేను కాలేజీలో జేరుతాను బుచ్చి తర్వాత నా మటుకి నేను పని చేసుకొని బ్రతుకుతాను ఇక ఎవరికీ నేను లెఖ్ఖ చేయను—నా బ్రతుకు ఎలానూ నాశనమై పోయింది మన దేశంలో స్త్రీని, ఈ కుళ్లుమనుష్యులు తయారు చేసిన శాస్త్రాలు,నియమాలు, ధర్మాలు ఆర్థికంగా, సాంఘికంగా, చివరికి నైతికంగా అబలగా చేసి పారేశాయి ఆ స్త్రీయే ఎదిరించి ఎందుకిలా చేశారు బాబూ' అని అడిగితే ఆమెని నీతిలేని కులటగా బహిష్కరిస్తారు"

పొగలు కక్కుతూ, కోపంతో దహించుకొపోతున్న జానకి కళ్ళల్లోకి చూడడానికి బుచ్చి ధైర్యం చేయలేకపోయాడు క్షణంలో ఒళ్ళంతా చెమట పట్టింది

"బుచ్చీ! నేను విడాకులిచ్చి నీయింట్లో వుంటె నన్ను యింతకుముందులా ప్రేమించగలవా?"అంది దిగజారిపోతున్న స్వరంతో

ఈ స్వరం బుచ్చిహృదయంలో కరుణారసాన్ని కలత చేసింది విరజిమ్మిన దయారసం కళ్ళల్లో ప్రతిఫలించింది

జానకీ! ఏమిటా పిచ్చిమాటలు?"

"అవును బుచ్చి, నాకింకా సరిగా యిరవై యేళ్ళన్నా నిండలేదు అంతలోనే భర్తతో తెగతెంపులు చేసుకొని వచ్చేశాను విడాకు లిచ్చిన ఆడదానిమీద తలిదండ్రులకే అసహ్యం అలాంటిది మిగతావాళ్ళకి ఏం ప్రేమ వుంటుంది?"

పోనీ బుచ్చీ, వీళ్లని ఎదిరిస్తాను నాలాంటి పదిమందికి పాఠాలు నేర్పిస్తాను స్త్రీ "ఇల్లాలు" కాదని, అదీ సహజమైన మనిషని నిరూపిస్తాను ఇన్నేళ్ల బానిసత్వంలో నలిగిపోయిన మన ప్రజల మెదళ్లు మరో మూడు తరాలకి గాని స్త్రీని కొత్త గుర్తించలేవు నేనప్పటికి వుండను నాలాంటి వేలమంది పోతారు"

అని బుచ్చి దగ్గరగా వచ్చి అంది

"బుచ్చీ! నువ్వు బి ఏ వరకూ చదువుకొన్నావ్ నీకు మన సమాజంతో ప్రత్యక్ష అనుభవం లేకపోయినా, పుస్తకాలు చదివైనా కొత్త తెలుసుకొన్నావ్ రేపు నీకు పెళ్లి అవుతుంది ఆ వచ్చే అమ్మాయినైనా నిష్కల్మషంగా ప్రేమించు మనసులో చీకటి, నాలికమీద వెలుగుగా మాటాడవద్దు పరిస్థితులు, వాతావరణం నేర్పించిన సంకుచిత దృష్టిని నీ ఇంగితజ్ఞానంతో చంపుకొని ఆ వచ్చే భార్యని 'ఇల్లాలు'గా గాకండా, నీ 'ఆలు'గా ప్రేమించు నీలాంటి యువకులు ఆడదాన్ని గౌరవించడం నేర్చుకుంటే, వచ్చే తరానికైనా మనకీ భావదాస్యం వొదిలిపోతుంది" అంటూ గ్లాసు తీసుకొని లోపలికి వెళ్ళిపోయింది

బుచ్చి జానకిని పిలచాడుగాని, అది పైకి పెగల్లేదు అలాగే నిలబడి పోయాడు మనస్సులో కలతలు ప్రారంభమయ్యాయి ఆ గుండెదడ, ఆ రక్తోద్వేగం—తమాయించి ఆలోచించుకోనేందుకు గూడ ఆస్కారాన్ని కలుగనివ్వటంలేదు

అంతలో జానకి తిరిగి తలుపు వేసుకొని వచ్చింది బుచ్చి ఈసారి పిలచాడు జానకి ఆగి ఏమిటన్నట్టు చూసింది

"రేపొద్దుట పాసింజరులో విశాఖపట్నం వెళతాను"

"ఎందుకు?" అని ఛప్పన బుచ్చికేసి తిరిగి అడిగింది "రాజీ కుదర్చడానికా?"

బుచ్చిబాబు మాటలు తడబడ్డాయి

"అడుగుతాను శేఖరాన్ని ఈ విషయం గురించివాడికి బుద్ధొచ్చేట్టు నాలుగు చీవాట్లు పెడతాను లొంగితే సరేసరి_లొంగకపోతే "

"బుచ్చీ! అనవసరశ్రమ నీకెందుకూ? ఆయన లొంగావద్దు చెయ్యావద్దు నేనిక ఆ గడప తొక్కనని ఒట్టేసుకొన్నాను ఆయనతో నాకు తెగతెంపు లయ్యాయి" అని గిరుక్కున తిరిగి బయటకి వెళ్లిపోయింది

ఇక యిప్పుడు అడిగి లాభం లేదనుకొన్నాడు పాసింజరు ప్రొద్దుట నాలుగింటికి వస్తుంది ఎవరికీ చెప్పకండా త్వరగా లేచి బండికి వెళ్లిపోవాలనుకొన్నాడు ఆ నిశ్చయంతోనే బయటకొచ్చి మంచం మీద మేనువాల్చాడు

కళ్లు మూతలు పడలేదు అప్పుడే పన్నెండు గంటలూ వినిపించాయి నిద్ర లేరి పోయిందేమో ననుకొన్నాడు ఆవులించి బలవంతాన కళ్లుమూశాడు మళ్ళా ఆలోచనలు వెనక్కి పరుగెత్తాయి శేఖరం తనతో చదువుకునేప్పుడు నిజంగా చాల అమాయకుడులా అగుపించేవాడు వాడిలో తనకి నచ్చింది నిష్పక్షపాతబుద్ధి, సమభావం కాని వాడే ఈనాడు యిలా మారిపోతాడని తను కలలోనైనా వూహించలేక పోయాడు

తొలికోడి కూసేసరికి తుల్లుక్కపడి కళ్లు విప్పాడు కళ్లు మండాయి ఇంతా చేస్తే, తను ఒక్క రెండుగంటలే కళ్లు మూశాడు! పక్కమీంచి లేచాడు లోపలికి వెళ్ళి సంచిలో రెండుజతల బట్టలు తీసుకొన్నాడు గాని, మళ్ళీ ఏమనుకొన్నాడో సంచి వొదిలి బట్టలు మార్చుకొని బయటకి వచ్చాడు


"ఎక్కడికి?" వెనకనించి వచ్చిన ప్రశ్నకి బుచ్చి తలతిప్పి చూశాడు వెంటనే మాటలు రాలేదు చివరికి అన్నాడు

"విశాఖపట్నం వెళుతున్నాను నాన్నతో, అమ్మతో చెప్పు" అని మెట్లు దిగి వేగుచుక్క తూర్పుమసగ వెలుగులో కలసిపోయాడు (ఇంకా వుంది)

Edited, Prtined & Published by S Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St , Madras.



ఐలండ్ గ్రౌండ్సులో జరిగిన బహిరంగసభ సందర్భంలో వేదికమీద ఆసీనులై యున్న కాంగ్రెసు అధ్యక్షునికి చీటీ అందిస్తున్న శ్రీమతి ఇందిరాగాంధీ



నగరంలో కార్యక్రమం ముగించుకొని 28 వ తేదీ ఉదయం ఢిల్లీకి బయలుదేరిన కాంగ్రెసు అధ్యక్షునికి మీనంబాకం విమానాశ్రయంవద్ద పురప్రముఖుల వీడ్కోలు

ఆంధ్రపత్రిక

శ్రీ నందననామ సంవత్సర

పంచాంగం

శ్రీ పిడపర్తి కృష్ణమూర్తిశాస్త్రిసిద్ధాంతి

గారిచే గుణింపబడిన

ఈ సంవత్సరం పంచాంగములో చాంద్రమాన, దృక్సిద్ధాంతాల ప్రకారం గుణింపబడిన రెండు పద్ధతుల తిథి, వార, నక్షత్రాలు వేర్వేరుగా చూపబడినవి

కొత్త పంచాంగాలు సిద్ధమౌతున్నవి

డెమ్మి క్వార్టో సైజు వెల

ప్రతి 1-కి 0-4-0

100-కి 18-0-0, 1000-కి 200-0-0

రైలుఖర్చులు ప్రత్యేకం

1000 కాపీలు ఒకేదఫా కొనువారి చిరునామా

ముఖపత్రమున ముద్రించబడును

వివరాలకు వ్రాయండి

మేనేజరు - ఆంధ్రపత్రిక, మద్రాసు 1.